Literary Criticism　　　　సాహిత్య విమర్శ

# శ్రీశ్రీ
# మహాప్రస్థానం
# సమాలోచనం

మాదిరాజు రంగారావు



రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 28

**MAHAPRASTHANAM - SAMALOCHANAM**
**Literary Criticism (Telugu)**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

*Presented*

*to*

*My daughter*

***Dr. M. CHARITHA***

Los Angeles

California U.S.A

with

blessings and affection

# సూచిక

1. ప్రేరక శక్తులు – వ్యక్తిత్వ నిర్మితి........................................ 83
2. అభ్యుదయ దృక్పథం................................................ 89
3. ఆరంభగీతం – ఆదర్శ రూపం........................................ 97
4. ఋక్కులు – సంవిధాన ప్రయోజనాలు ............................ 101
5. జయభేరి – విశ్వభావన............................................ 104
6. వాడు – పీడన శక్తికి ప్రతీక .......................................... 107
7. వ్యత్యాసం – యధార్థ జీవిత చిత్రణం ................................ 110
8. ప్రతిజ్ఞ – నిశ్చయ లక్ష్యం – బహుశ్లిష్ట విధం........................ 112
9. దేశ చరిత్రలు – యధార్థ భూమిక .................................. 117
10. సంపరివర్తన రూపం – కవితా! ఓ కవితా! ........................ 121
11. రథ చక్రాలు – ప్రగతి రూపం....................................... 125
12. అభ్యుదయ పథం................................................... 129
13. ప్రతిజ్ఞ – సంవిధాన కళ – స్వేచ్ఛా ఛందోహృదయం ............. 135
14. శ్రీశ్రీ 'నీడలు' – సామాజిక వాస్తవికత.............................. 140
15. శ్రీశ్రీ పరిణామ వ్యక్తిత్వం .......................................... 143
16 శ్రీశ్రీ యుగ కర్తృత్వం ................................................ 149
17. మరో ప్రపంచం – అభ్యుదయ పథం ................................ 155
18. మరో ప్రపంచం – విప్లవ సంకేతం.................................. 159
ప్రతిపాదనం ........................................................... 162

# 1. ప్రేరక శక్తులు - వ్యక్తిత్వ నిర్మితి

గురజాడ అప్పారావుతో ఆరంభమైన నవ్య (అభ్యుదయ) కవిత్వం శ్రీశ్రీతో విస్పష్టమైన ఆకృతిని సంతరించుకుంది. సామాజిక సమస్యాత్మకంగాను మానవతా ప్రబోధకంగాను పరివర్తన శీలంగానూ ఉంది, వర్గ సంఘర్షణతో విప్లవగతితో సామ్యవాద పరిష్కార మార్గంగా పరిణమించింది. అంతర్జాతీయమైన అవగాహనతో నవ సమాజావతరణకు లక్ష్యంగా నిలిచింది. గురజాడ నిర్దేశించిన సాహితీ జగత్తుకు శ్రీశ్రీ నాయకత్వం వహించడంతో తెలుగు సాహిత్య చరిత్రలో వినూత్న యుగం ఆరంభమైంది. గురజాడలోని స్వేచ్ఛాభావాలు క్రమంగా శ్రీశ్రీలో మార్క్సు సిద్ధాంతంవైపుకు దారితీసాయి. ప్రభవ రచన తరువాత శ్రీశ్రీలో ప్రధానమైన మలుపుకు, గురుజాడ ప్రభావం కారణమైంది, సాహితీపరంగాను సామాజికంగాను గురజాడ రచనల్లోని స్వేచ్ఛా దృక్పథం సామాజిక స్పందనం అంతకు ముందున్న కవిత్వం నుండి వేరైంది. ఇక్కడే రాయప్రోలు, గురజాడ కవిత్వ వ్యక్తిత్వాలు విభేదిస్తాయి. రాయప్రోలు సంప్రదాయ జగత్తులో ఆధునిక కవి. గురజాడ ఆధునిక జగత్తులో ప్రగతి కవి. శ్రీశ్రీ అనుసరించింది. గురజాడ నవ్య మార్గం.

శ్రీశ్రీ రచనల్లో ప్రముఖమైన కృతులు మహాప్రస్థానం, ఖడ్గసృష్టి. మహాప్రస్థానంలో శ్రీశ్రీ కవిత్వంపై పనిచేసిన శక్తివంతమైన ప్రభావాలు రెండు. మొదటిది యూరోపియన్ దేశాల్లో ముఖ్యంగా ఫ్రాన్సులో 1924 ప్రాంతంలో వచ్చిన అదివాస్తవికత (surrealism) కు సంబంధించిన స్వేచ్ఛాతత్వం. రెండోది మార్క్సు ప్రతిపాదించిన గతి తార్కి భౌతికవాదం ఈ స్ఫూర్తి కనుగుణమయిన సామాజిక స్పందన రూపం, మరో ప్రపంచం వైపు ప్రయాణింపజేసింది. కవి మాటల్లో "మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉందని అప్పటికి తెలియకపోయినా" నిష్ఠురమయిన నిజాల వాస్తవికతకు దర్పణంగా ఆధునిక కవితారూపం అవతరించింది. కానీ ఈ కవిత్వ సమాలోచనంలో కవికి ఆధునిక భావజాలంతో సంబంధాన్ని బట్టే మార్క్సిజం విషయంతో సాధారణమైన పరిచయమో అవగాహనో ప్రభావమో ఉన్నట్లే అనిపిస్తుంది. శ్రీశ్రీని మహోజ్వల వ్యక్తిగా నడిపించిన ఈ ప్రేరక శక్తుల్లో మొదటిది ప్రయోగాత్మకం. దీన్ని అందుకొనీ రెండోది సామాజిక పరివర్తనం సాగింది.

ఆంద్రెబ్రెటన్ 1924లో స్వేచ్ఛ అన్న మాటకు అధివాస్తవికత (సర్రియలిజం) పరంగా స్పష్టంగా వ్యాఖ్యానించడం జరిగింది. ఈ సందర్భంలో ఇతడు "Liberty for the artist means first a liberation from the rules of art" అంటాడు, కళాకారుని స్వేచ్ఛ అంటే మొదట కళా నిబంధనల నుండి స్వేచ్ఛను పొందడంగా భావించాడు. దీనికై చేసే ప్రయత్నం అధివాస్తవికతా ధోరణులకు దారితీసింది. దీని ప్రభావం శ్రీశ్రీ. "ఓ కవితా! నా కవితా!" అన్న సుదీర్ఘమైన కవితలో కనిపిస్తుంది. ఇక్కడ పాత ఆలోచనలకు నిబంధనలకు స్వస్తి పలకడం, క్రొత్త ఆలోచనలతో స్వేచ్ఛా రూపానికి నాంది పలకడమే ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. పూర్వం ఉన్న సరస్వతీ దర్శనం వేరు. ఇపుడితడు భావించే సరస్వతీ దర్శనం వేరు. అక్కడ "వినువీధుల్లో విహరించే అందని అందం"లో "చటులాలంకారపు మటుమాయల నటన"తో ఉంది. ఆమెను భూమిపై అందుకోడానికి సహజమైన నిజసౌందర్యం చూడడానికి, కవి, ఒంటరిగా "ఒక్కడునై" చీకటిలో వేదనలో స్రుక్కిన రోజులు లేకపోలేదు. ఈ స్థితి కవిలోని మానసికమైన సంక్షోభాన్ని పరివర్తన ముఖాన్నీ సూచిస్తుంది. తరువాత వరుసగా భూకంపం, ప్రభుత్వ పతనం, యుద్ధం, విప్లవం అన్నీ ఆమె విశ్వరూప సాక్షాత్కారంగా కనిపిస్తాయి. ఆపైన ఈ భూమిపై కనిపించేవి. "జవరాలి మనః ప్రపంచపుటావర్తాలు రోగార్తుని రక్తనాళ సంస్పందన, ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం, సమ్మె కట్టిన కూలీలు కూలీల భార్యల, బిడ్డల, ఆకలి చిచ్చుల హాహాకారం ఆర్తరావం" వినిపించాయి. ఇంతవరకు వినువీధుల్లో విహరించే సరస్వతీ రూపానికి దూరమైన సామాజిక ఘటనలు ప్రజాసమస్యలు ఇందులో క్రమంగా ప్రసక్తమైనాయి. ఈ స్థితి పూర్వ కవితా వస్తు సంప్రదాయం నుండి వేరైంది. ఇవన్నీ విన్నవించబోతే, మాటలకై వెదుకాడబోతే, స్వేచ్ఛాగుణంతో ప్రత్యేకతను పొంది, నియమ నిబంధనల్ని క్రమించింది. "శ్మశానాల వంటి నిఘంటువులు దాటి వ్యాకరణాల సంకెళ్ళు విడిచి ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి" "వడివడిగా వెలువడినై యెదనడుగిడి"నై, ఇందులో చెప్పబోయేది ప్రధానంగా ఇంతకుముందు పేర్కొన్నట్లు పూర్వ కళా నిబంధనల నుండి విముక్తి పొందే తత్పరత కనిపిస్తుంది. నిఘంటువు, వ్యాకరణం, కఠినమైన నిబంధనలతో కూడిన ఛందస్సు – కవి హృదిలో ప్రసరించే భావ ప్రసారాన్ని నిరోధించేవిగా కనిపించాయి. అలాంటి శుష్కమైన కృత్రిమమైన నిబంధనల నుండి విముక్తి పొందడమే ఇతని లక్ష్యం. అంతేకాని ఈ కవిత్వంలో నిఘంటువుల్లోని శబ్దాలు, వ్యాకరణ నియమాలు, ఛందోరీతులు లేవని కాదు. ఇతడెన్నుకొన్న ఛందోరీతివేరు. ప్రత్యేకమైంది. ఇందులో

ఇతనికి స్వేచ్ఛ ఉంది. తనకు తానై భావ ప్రసారాన్ని బట్టి ఏర్పరచుకొన్నది. ఛందస్సులో సర్ప పరిష్వంగం అన్న మాటలో ఇతని ఉద్దేశ్యం స్పష్టం. ఛందస్సు రమణీయ గతి విన్యాసం వరకే పరిమితమై ఉండాలి గాని, క్లిష్టమైన నియమనిబంధనలతో సర్పం వలె చుట్టుకొని కొన ఊపిరితో ఉక్కిరి బిక్కిరి చేసేదిగా ఉండకూడదనే కవి అభిప్రాయం. మహా ప్రస్థానం రచనా కాలంనాటి శ్రీశ్రీ మనస్సు పూర్వ నియమాల్ని ఉల్లంఘించి, క్రొత్త నియమాల్ని తన రచనానుగుణంగా ఏర్పరచుకొన్నట్లు అతని రచనా శిల్పమే సాక్ష్యం. ఇవి ఇతని సృజనాత్మక శక్తికి సరిపడినవి. స్వేచ్ఛా మనస్తత్వగతికి ఒదిగినవీ. ఏ విధంగాను రచనా స్వాతంత్ర్యానికి నిరోధం కానివి. "నా ఆకాశాలను లోకానికి చేరువగా నా ఆదర్శాలను సోదరులంతా పంచుకునే రవ్వల జడిగా" ఊహించడంలో సూక్ష్మంగా వస్తు విన్యాసాన్ని, దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ఇతనికొక ఆదర్శం ఉంది. దీని అనుభవంలో సోదరులంతా భాగస్వాములు కావాలనే తహతహ కనిపిస్తుంది. ఈ అనుభవ రూపంతో రచనలో ప్రగతి లక్ష్య పర్యావసానమే మహాప్రస్థానం. కవితా వస్తువుదృష్ట్యా ప్రజల సమస్యలకు దర్పణంగా నిలిచింది.

"నేనేదో విరచిస్తానని నా రచనలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ

నా జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగించాలని" ఇతని ఆకాంక్షలో కవితా వస్తు శిల్ప లక్ష్యాల్ని చూడవచ్చు. ఇందులో కవితా వస్తువు ఎన్నిక, ఇది అభివ్యక్తి పొందిన తీరు ప్రయోజనం కన్పిస్తాయి. ఒకటి రచనలో లోకం ప్రతిఫలించడం, రెండోది జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగించడం. మొదటిది వస్తు దర్శనాన్ని, రెండోది శిల్పరూపాన్ని భావింపజేసేవి. కవిత్వంలో ఏ నియమమూ, గతి విశేషమూ లేకపోతే ఇదెలా సాధ్యం? అయితే ఇవి క్రొత్త పద్ధతిలో కవి స్వేచ్ఛా భావనలకు దీప్తినీ వేగాన్నీ కలిగించేవిగా ఉన్నాయి. శ్రీశ్రీ ఆంతర్యం పాత నుండి విడివడి క్రొత్తను అన్వేషించడమే. ఇది భాషలో, భావనలో ఛందస్సులో స్పష్టం. మూడోది జనోపయోగం, జనహితం కలిగిందీ.

ఆంద్రే బ్రెటన్ చెప్పిన కళా నిబంధనల నుండి విముక్తి పొందడం మొదటి సోపానం. దీనితో సరిపోదు. దీనితో సమానంగా తానాశించిన లక్ష్యాలకు నిదర్శనంగా క్రొత్త సమాజ సృష్టి జరగాలి. ఇది రెండో సోపానం అందుకు – "కదిలేదీ కదిలించేది మారేదీ మార్పించేదీ" కావాలి. ఇతడు పాతను నిరసిస్తున్నాడు. బాగానే ఉంది. అయితే

కోరే క్రొత్త ఏమిటన్న ప్రశ్నకు సమాధానం పెను నిద్దర వదిలించేదీ పరిపూర్ణపు బ్రతుకిచ్చేది. ఇందులో భావ విప్లవం సామాజిక చైతన్యంగా జీవితాశయంగా నిర్దేశించడం జరిగింది. మార్పు ప్రవచించిన విప్లవ తత్వానికి సన్నిహిత ప్రతీకలుగా

"సింధూరం రక్త చందనం బంధూకం, సంధ్యారాగం

ఎగరేసిన ఎర్రని జెండా కలకత్తా కాళిక నాళిక" మొదలుగా కనిపిస్తాయి.

"వికసించిన విద్యుత్తేజం చెలరేగిన జనసమ్మర్దం" ఇవి వర్గ సంఘర్షణను, విప్లవ విజృంభణాన్ని వ్యక్తం చేసేవి. విప్లవభావనతో ప్రజల్లో కదలిక వచ్చి, సామూహిక చైతన్యంగా పరిణమిస్తుంది. పరివర్తన వారిని పురోగమింపజేస్తుంది. ఇది బ్రతుకులకు సంపూర్ణతను సాఫల్యాన్ని సిద్ధింపజేస్తుందనే ప్రగాఢ విశ్వాసం. ఈ అంతర్గత తత్వం ఈయన వ్యక్తిత్వానికి ప్రధానమైంది. ఇది "విలయావర్తపు బలవత్ ఝరవత్ పరివర్తన" ఫలాకారం. ఈ పరివర్తనమే కవి వేసిన విశేషణాల్లో సంక్షోభంతో ఆవేదనతో సమాజపరంగాను, కొత్తదనంతో కవితాపరంగాను అన్వయించుకోవచ్చు. ఈ పరివర్తన ఇతనిలో ప్రధానమైన మలుపును పట్టిస్తుంది.

ఫ్రాన్సులో ఆంద్రేబ్రెటస్ వ్యాఖ్యానించిన అధివాస్తవిక ధోరణి కారణంగా కవిత్వంలో విశిష్టమైన మార్పు వచ్చింది. ఇది చిత్రకళకు ప్రాకింది. ఇతని మొదటి మానిఫెస్టో 1924లో ప్రచురితమైంది. రెండవది 1930లో వెలువడింది. మొదటిదానిలో సైకిక్ ఆటోమేషన్ (Psychic automation) ప్రధానంగా ఉంది. దీని లక్ష్యం 1) ఆలోచనల వాస్తవ రూపాన్ని ప్రకటించే ప్రయత్నంగాను, 2) ఏ విధంగాను అభ్యాసమైన అలవాటైన నియమాలకు లొంగని ఆలోచనా ప్రసారంగాను చర్చితమైంది. రెండవదానిలో సర్రియలిజం గురించి తాత్త్వికమైన విశ్లేషణ కనిపిస్తుంది. ఇక్కడ ప్రధానంగా పేర్కొనదగిన అంశం ఆంద్రె బ్రెటస్‌కు కమ్యూనిస్టు ఉద్యమంతో సంబంధం ఉంది. అటు పూర్వకళా నిబంధనల్ని త్రెంచుకొనే స్వేచ్ఛాతత్త్వం ఇటు కమ్యూనిజం – చేదోడు వాదోడుగా కలిసి పనిచేసిన ప్రభావం మహా ప్రస్థానంలో చూడవచ్చు. "ఓ కవితా నా కవితా" అన్న గీతంలో ఇతడు ఎదుర్కొన్న సమస్యలు. 1) మనస్సు నుండి చెరగిపోని పూర్వ రూపం (వినువీధుల్లో విహరించే... చటులాలంకారపు నటనలు మొదలైనవి) 2) దీన్ని వెనక్కు నెట్టి త్రోసుకొని వచ్చే నవ్యరూపం (అగ్ని సరస్సున వికసించిన వజ్రం మొదలుగా) సాక్షాత్కారం 3) ఈ మధ్య స్థితీ 4) పరివర్తన దశ కవిత్వంలో మానసికమైన సంఘర్షణతో సంవేదనతో శిల్పీకృతమైనాయి. రచనలో సంక్షుబ్ధత్వం నుండి అవతరించే నవ్యసృష్టి ఆయా దశల

కనుగుణంగా శబ్దచిత్ర సంయోజనంతో భావరూప సంవిధానంతో కనిపిస్తుంది. ఒక ఉద్రేక స్థితిలో ఈ గీతం మొదటి నుండి చివరి వరకు లయాత్మకమైన వలయాలు వలయాలుగా అత్యంత వేగ గతిలో నడవడం శ్రీశ్రీ అనితరమైన శిల్ప శక్తికి నిదర్శనం. ఇది ఈ మహాగీతం వెనుకనున్న స్పందనా రూపం. ఫ్రాన్సులో ఆవిర్భవించిన పది పన్నెండు సంవత్సరాల కాలంలోనే ఆ ప్రభావ ముద్రతో స్వయం వ్యక్తిత్వస్ఫూర్జితమైన కవిత్వం వెలువడడం గమనించదగిన అంశం. అక్కడ 1924-30 వరకు ప్రచలితమైన నూతన కవితా స్వరూపానికి ప్రతిస్పందనంగా ఇక్కడ 1934-40 మధ్యలో వెలువడింది. అంతర్జాతీయ రంగంలో వచ్చే ప్రధానమైన మార్పులకు స్పందించి, సృజనరూపం దిద్దుకోడానికి తెలుగుదేశంలో ఉన్న వ్యక్తికి పదిపదిహేను సంవత్సరాలు చాలా తక్కువ సమయమే. 1934లో మహా ప్రస్థానం 1937లో ఓ కవితా నా కవితా 1940లో జగన్నాథుని రథ చక్రాలు వెలువడినాయి. ఈ కవితల క్రమంలో మరో ప్రపంచ స్ఫూర్తితో ఆదర్శంలో పరివర్తనా శీలం, ప్రగతి లక్ష్యం కనిపిస్తాయి. ఇది శ్రీశ్రీ విశిష్టమైన వ్యక్తిత్వ నిర్మితి జరిగిన కాలం.

1935లో బ్రెటన్ కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు త్రెంచుకున్నాడు. అయితే సర్రియలిజం ప్రవచిస్తూనే ఉన్నాడు. 1938లో పారిస్‌లో సర్రియలిజంపై అంతర్జాతీయ చర్చారూపం ఆరంభమైంది. ఈ సందర్భంలో బ్రెటన్ గురించి తెలుసుకోవాలనే ఔత్సుక్యం సహజం. ఇతడు ఫ్రాన్సు నుండి మెక్సికోకు వెళ్ళి 1941లో న్యూయార్క్ వెళ్ళాడు. 1942లో యేల్ విశ్వవిద్యాలయంలో ప్రముఖమైన ఉపన్యాసం చేశాడు. ఇది ఇతడు కమ్యూనిజం నుండి విముక్తి పొందిన విస్తృతమైన కళా సిద్ధాంత రూపాన్ని పట్టి ఇస్తుంది. 1947లో తిరిగి పారిస్ వచ్చాడు. ఈ ప్రయాణాల వలన పొందిన అనుభవం పరంపరతో వచ్చిన వైశాల్యం వైవిధ్యం ఇతనిలో కమ్యూనిజం నుండి విడివడిన అధివాస్తవికతా కళాత్మక శక్తిని మరింత ప్రకాశింపజేసాయి. అంతర్జాతీయ చర్చా రంగంలో కళాత్మకమైన సుస్థితికి ప్రయత్నం జరిగింది. ఈ మార్గం వేరైంది. శ్రీశ్రీలో 'అధి వాస్తవికత' పట్ల అభిలాష తగ్గింది. అందువల్ల దీనికి భిన్నంగా శ్రీశ్రీపై మార్క్సిజం రోజురోజుకు బలమైన ప్రభావాన్ని ప్రసరిస్తూ వచ్చింది. దీనికి ముందు జరిగిన తీవ్రమైన పరిణామాలే కారణం. 1) ప్రపంచయుద్ధ పరిణామాల వల్ల ఏర్పడిన సంక్షోభం, 2) విదేశీ పరపరిపాలనలో క్రుంగిపోయిన దేశస్థితి. వీని పర్యవసానం గాను ఇంకా 3) ఇతని జీవితంలో ఎగుడుదిగుళ్ళు వల్లనూ ఏర్పడిన ఆలోచనల తీరు తెన్నులు వేరుగా పేర్కొవచ్చు. 1933లో

"నేను సైతం/ ప్రపంచాగ్నికి / సమిధ కొక్కటి ఆముతిచ్చాను" జయభేరి కవితతతో తెలుగులో నవ్య (అభ్యుదయ) కవిత్వయుగం ఆరంభమయింది. ప్రగతి స్వరూపానికి మార్గం సుగమమయింది. మహాప్రస్థానంలో ముఖ్యమయిన గీతాలన్నీ 1930-40 మధ్య వ్రాసినవి. (గర్జించు రష్యా 1941లో నీడలు 1947లో వచ్చాయి. 1930-40 మధ్య కాలంలో1) ప్రపంచ మంతటా నెలకొన్న "ఆర్థిక మాంద్యం", సంక్షోభంతోపాటు దారిద్ర్యం అసమానతలు / నిరంకుశత్వం మొదలుగానూ దయనీయమయిన పరిస్థితులూ 2) పాశ్చాత్య దేశాల్లో ఆధునికతకు ప్రాతినిధ్యం వసించే ఆడన్, స్టీపెన్ స్పెండర్, లూయిస్, జార్జ్‌బ్రూకర్, డిలాన్ థామస్ మొదలయిన కవుల కవిత్వ ప్రభావమూ కలిసి శ్రీశ్రీలో సామాజిక కవితా వ్యక్తిత్వాన్ని తీర్చాయి. అప్పటికి మార్క్సిజం గురించి తనకు తెలియదనీ శ్రీశ్రీ అభిప్రాయం. అయినప్పటికీ తనకు పైకి తెలియకుండానే లోపల మానసికంగా అప్పటి పరిస్థితుల వల్ల ఆలోచనలు మార్క్సిజంలోని మౌలికమయిన భావనతో సంవదించాయి.

సామాజిక స్పృహతో ఆవేదనతో స్పందనతో కూడిన వ్యక్తిత్వం సామాజికతను బింబించే సామ్యవాద మార్గాన్ని సూచించే కొత్త ప్రపంచం అంతర్జాతీయ భావనతో అవతరించింది. తెలుగు సాహిత్య చరిత్రలో నవ్య (అభ్యుదయ) యుగం ఆరంభమయింది. దీనికి కవిలో స్వేచ్ఛామనోరూపమూ బాగా తోడ్పడింది. "ఓ కవితా నాకవితా" గీతంలో ప్రస్ఫుటమయ్యే స్వేచ్ఛాతత్త్వం - తక్కిన గీతల్లోను వికాస వైవిధ్యంతో కనిపిస్తుంది. ఇది శ్రీ శ్రీ అపూర్వమైన వ్యక్తిత్వం పొందిన ఒక ముఖం.

# ౭. అభ్యుదయ దృక్పథం

శ్రీశ్రీలో స్వేచ్ఛాతత్త్వం తర్వాత పేర్కొనదగిన మరో లక్షణం అభ్యుదయ దృక్పథం. 'మహాప్రస్థానం' కవితా సంపుటి ఈతని అభ్యుదయ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించేది. ఇందులో మొదటిది 'మహాప్రస్థానం', మరోది 'దేశచరిత్రలు', చివరది 'జగన్నాథుని రథచక్రాలు' ప్రముఖంగా పేర్కొనదగినవి. 'మహాప్రస్థానం' గీతంలో సమాజ పరివర్తన గతిలో వేగాన్ని సాధించే ప్రయత్నం కన్పిస్తుంది. అభ్యుదయ శక్తుల సమీకరణం జరిగింది. పురోగమన ధ్యేయమైన మరో ప్రపంచ స్ఫూర్తి చిత్రితమైంది. 'దేశ చరిత్రలు' గీతంలో సామాజిక గతి క్రమంలో చారిత్రక పరిణామ దశలకు మార్క్సు సిద్ధాంతాల సమన్వయం కనిపిస్తుంది. జగన్నాథుని 'రథ చక్రాలు' గీతంలో ప్రజా శక్తుల విజృంభణ, వర్గ సంఘర్షణ, చివరకు విజయ సూచనతో కవి లక్ష్యమైన సమసమాజస్థాపనం లక్షితమైంది. పై మూడు ప్రధానమైన రచనలతో పాటు, అవతారం, ప్రతిజ్ఞ, నీడలు, మిధ్యావాది, వ్యత్యాసం, నిజంగానే, మొదలైనవి. కవి ఆదర్శరూపాన్ని వివిధ కోణాల నుండి వెలుగులోకి తెచ్చేవి. వస్తువు ఎన్నికలో నిర్వహణలో క్రొత్తదనం ఉంది. లక్ష్యసాధనలో సంపూర్ణమైన కవి వ్యక్తిత్వానికి బింబిస్తూ వినూత్నమైన యుగానికి ఆదర్శమైందీ కృతి. "మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది." ఇది సామాజిక ప్రబోధంతో అభ్యుదయ శక్తులకు గతినిర్దేశం చేస్తూంది. ఆలోచనకు ఉద్రేకాన్ని జతపరుస్తూంది. ఆదర్శానికి వాస్తవికతను జోడిస్తూంది. ఈ భూమికతో వ్యక్తుల్ని ఉత్తేజపరుస్తూ, సంఘర్షణతో, వర్గ రహితమైన సమ సమాజ పరివర్తన కాయత్తం చేసే సమ సమాజ రాజకీయ సిద్ధాంత తత్త్వంతో ఆరంభమౌతుంది.

'మహాప్రస్థానం' రచనా కాలం (1934) నాటికి ప్రపంచంలో ఆదర్శమైన వ్యవస్థలు రెండు. ఒకటి ప్రజాస్వామ్యానికి రెండోది సామ్యవాదానికి అంకితమైనవి. మొదటిదానికి అమెరికా, రెండోదానికి రష్యా నాయకత్వం వహించాయి. భారతదేశంలోను సామాన్యునికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూర్చే, సర్వ సమానత్వం గల ఆదర్శప్రాయమైన సమాజాన్ని నిర్మింపజేయాలన్న ధ్యేయంతో సామాజికంగా, అభ్యుదయ భావ ప్రసారం జరుగుతూన్న కాలం. ప్రపంచ యుద్ధ పర్యవసానంగా, దేశం ఆర్థిక సంక్షోభంతో విచలితమైంది. ప్రజా సమస్యల పరిష్కారానికి మార్క్సు ఆర్థిక సిద్ధాంతాన్ని అవలంబించిన

దేశాలన్నీ రష్యా నాయకత్వంలో రెక్కలు సాచడం మొదలు పెట్టాయి. ఇది ఇక్కడ అక్కడ అన్న విభేదం లేకుండా సంకుచితమైన దేశసీమల్ని దాటింది. జాతి వలయాలు తుడిచివేసింది. విశ్వ మానవతా దృక్పథంతో, వెనుకబడిన దేశాల్లో మానవుని సమస్యల పరిష్కారానికీ పద్ధతియే మేలైందన్న భావం ప్రబలింది. ఈ కవిలోను ఈ భావం ధృడంగా నిలచింది. రెండో ప్రపంచయుద్ధంలో రష్యా పాల్గొన్న సందర్భంలో వ్రాసిన "ఓ రష్యా! నా రష్యా!" గేయం నిరంకుశత్వానికి వ్యతిరేకంగానే గాక, కవి ఆదర్శానికి ప్రాతినిధ్యం వహించే సామ్యవాద పక్షం పట్ల నిబద్ధతనూ అచంచలమైన అశాగతిని ప్రతిబింబిస్తూంది. రష్యా గురించి "కోటి గొంతులు నిన్ను కోరి రమ్మన్నాయి. కోటి చేతులు నిన్ను కౌగిలిస్తున్నాయి." అని ఎంతగానో ఉప్పొంగిపోతాడు. ఇందులో మేరలు మీరిన అనుభూతితో గాఢమైన మానసిక తృప్తిని పొందడం గమనించవచ్చు. ఒక లక్ష్యంతో నిశ్చలమైన అభిప్రాయాలతో నిర్మితమైన సాహితీ వ్యక్తిత్వం "మహాప్రస్థానం" అంతటా దర్శనమిస్తుంది. విశ్వజనీన దృక్పథంతో సామాన్య ప్రజల ఆశయాలకు దర్పణంగానే కాక అంతర్జాతీయమైన అవగాహనతో సాహిత్యాన్ని సిద్ధింపజేయడంలో కవి చూపిన మార్గం సాహసోపేతమైంది. తెలుగు సాహిత్యగతినీ, విలువల్నీ లక్ష్యాల్నీ సంపూర్ణంగా మార్చివేసింది. ఇది పూర్వ సాహిత్యరూపం కన్నా సంపూర్ణంగా భిన్నమైంది. కొత్త విలువలకూ, కొలమానాలకూ ప్రయోజనానికి దారి తీసింది.

## II

మార్క్స్, ఎంగెల్స్ నిరంతర కృషి ఫలంగా ఆవిర్భవించిన గతి తార్కి భౌతికవాద స్వరూపం శ్రీశ్రీ "నవ్య" కవిత్వానికి అంతస్తత్వం. డైలక్ట్సు అన్న పదం గ్రీక్ భాషా సంబంధమైంది. ప్రత్యర్థి వాదనలో పరస్పరం వ్యతిరేకించే లక్షణాన్ని గుర్తించి వాటిని పరిశీలించి పరిష్కరించి వాస్తవాన్ని బయటికి తీసే చర్చా నైపుణ్యాన్ని డైలక్ట్సు అంటారు. స్థూలంగా ఇది తర్కంతో నిర్వహించే చర్చాకళకు సంబంధించింది. ఇక్కడ వస్తువులో నిహితమైన పరస్పర వ్యతిరేక శక్తుల్ని గుర్తించి దాని మూల గతినీ, అభివృద్ధి పరిణామాన్నీ పరిశీలించడానికి సహకరించేదిగా భావింపవచ్చు.

వస్తువు గతి స్వభావం కలిగింది. ఇది దీని అంతస్స్వభావం. పదార్థం యొక్క అస్తిత్వ లక్షణానికి నిదర్శనం. పదార్థం ఎప్పుడూ గతి సహితమైంది. గతిలో అవతరిస్తుంది. గతిలో స్ఫుటమవుతుంది. వస్తువులో మార్పు నిత్యం జరుగుతూ ఉంటుంది. జడ

జగత్తులోనూ భౌతిక రసాయనికమైన మార్పులు తప్పవు. మార్పు ఎట్టి పరిస్థితుల్లోను ఆగదు. మార్పు లేకపోతే పరిణామమే లేదు. జీవపరిణామంలో ఈ మార్పుకత్యంత ప్రాముఖ్యముంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని 'గతి తార్కిక' అన్న మాట ఉపయోగించడం జరిగింది. ఇది వాస్తవికతను గుర్తింపజేసేది. దీని స్వరూపం భౌతికమైంది. అందువల్ల 'గతి తార్కిక భౌతికవాద' మనడం జరిగింది. వస్తువూ గతీ రెండు విడదీయరానివి. ఈ గతిలో వేగం రావడం వల్ల గుణాత్మకమైన మార్పు త్వరగా వస్తుంది. ఈ సందర్భంలో మతం యథాస్థితిని సమర్థించేది కావడం వల్ల సమాజంలో ఇది మార్పుకు వ్యతిరేకంగాను ప్రగతి నిరోధంగాను భావితమైంది. ఇది యథాస్థితికి కొమ్ము కాచేదన్న అభిప్రాయంతో మత సంబంధమైనదంతా నిరసింపబడింది. గతి తార్కిక భౌతిక వాదం రూపొందడానికి ఆకాలంలో ప్రముఖ పాత్ర వహించిన పరిశోధనాంశాల్లో. 1. శక్తి – నిల్వ, మార్పిడి సూత్రం. 2. జీవ కణ నిర్మాణ సిద్ధాంతం, మార్పు, పరిణామం. 3. డార్విన్ పరిణామ వాదం, అనేవి ప్రముఖమైనవి.

అయితే ఇది ప్రకృతి – మానవుడు – ఆలోచన అనే వాటినీ, గతి, సంఘర్షణ, సమన్వయం అన్న సూత్రాలతో సహేతుకంగా సంయోజనపరచిందీ. సమాజపరంగా నిర్మించిన చారిత్రక పరిణామ దృష్టితో భౌతికవాదంతో కూడిన తత్త్వంగా పరిగణితమయింది.

స్థూలంగా చూస్తే 'మహాప్రస్థానం'లో కవి విభిన్న శక్తులను గుర్తించడం జరిగింది. వీటి మూల స్వభావాన్ని, అభివృద్ధి దశల్నీ పరిశీలించి, సమీకరించి, అభివృద్ధి క్రమంలో పాతపై క్రొత్త జరిపే పోరాటాల్నీ గుర్తించడం ప్రేరేపించడం కనిపిస్తుంది. అభ్యుదయ శక్తుల వికాసాన్నీ, చివరకు విజయాన్నీ నిరూపించడం గమనించవచ్చు. ఇది కవి ప్రధానమైన ఉద్దేశంగాను కనిపిస్తుంది. ఈ విధం సాహిత్య జగత్తులో క్రొత్త దృక్పథంతో, సామాజిక తత్పరతను చేకూర్చింది. ఎన్నో వందల యేండ్లుగా నెలకొన్న తెలుగు సాహిత్య వ్యవస్థ అసాధారణమైన మార్పులకు లోనైంది. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అవతరణం, తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన చారిత్రక ఘటనగా పేర్కొనవచ్చు. ఈ మరో ప్రపంచానికి నాయకత్వం వహించడానికీ, ఎప్పటికప్పుడు క్రొత్త ఆలోచనలతో దీనిపై ప్రత్యయమూ విశ్లేషణమూ అవసరం. సాహసంతో ప్రయాణించడమూ ముఖ్యం. కళాత్మకంగానే కాక తాత్త్వికంగాను బాధ్యతయుతమైన రచనాశీలమూ అవసరం. 'మహాప్రస్థానం'లో మొదటి నుండి చివరి వరకు ఈ పరివర్తనగమనాన్ని స్పష్టంగా గమనింపవచ్చు. క్రొత్తను

అన్వేషించడంలో శ్రీశ్రీ ఎన్నో ప్రయోగాలు చేయవలసి వచ్చింది. ఈ అన్వేషణాక్రమంలో భాగమే ఈ కవి అధివాస్తవిక రచనలు.

## III

జీవితంలోను, కవిత్వంలోను సంప్రదాయానికీ మార్పుకూ మధ్య ఎడతెగని పోరాటం ఎప్పుడూ సాగుతూనే ఉంటుంది. సంప్రదాయానికీ మార్పు కోరే అభిలాషకూ మధ్య నిరంతరం పరివర్తన విప్లవం దిశగా జరిగే సంఘర్షణను వేగవంతం చేసే కవితా కళా సాధనంగా ఆవిష్కృతమైందీ 'మహాప్రస్థానం'. "మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం" పిలిచింది. సమాజంలో వయస్సు మళ్ళిన సోదరులను ప్రక్కకు నెట్టేసి, నెత్తురు మండే శక్తులు నిండే, సైనికులై. కదలే యువలోకాని కెదురయ్యే ఎడారులూ, నదీనదాలు, కొండలూ వాటిని అధిగమించి మరో లోకాన్ని చేరే స్థితి చిత్రితమైంది.

ఇంతటి నవ్య సృష్టిలోను ప్రవృత్తమయ్యే సంప్రదాయ ప్రభావం శ్రీశ్రీ సాహితీ వ్యక్తిత్వానికి మూలశక్తినీ భావ విస్తృతినీ కలిగించేదే కాని ఏవిధంగాను క్షతి కలిగించేది కాదు. ఈ శబ్దాలు ఒక్కొక్క మారు ప్రతీకలై ఒక స్థితికీ, భావానికీ వివిధచ్ఛాయల్ని ప్రసరింపజేస్తూ గాఢత్వాన్ని నైశిత్యాన్ని, ఔజ్వల్యాన్ని సంపాదించి పెడుతున్నాయి. ఉదాహరణకు ఇందులో ప్రయుక్తమైన "హరోం హరోం హర" "ధనంజయుడు" ఇంకా 'నిటాలాక్షి', 'నటధూర్జటి', 'ఆది సూకర వేద వేద్యుడు' మొదలైనవి ఆయా సందర్భాల్లో ఆవిష్కృతమైన విధాన్ని గమనించవచ్చు. ఇవి పౌరాణికమైన వస్తుజాలంలో చేరినవైనా, ప్రకృత స్థితిలో పరివర్తన భావానికి ఉద్ధృతినీ, వేగాన్ని, ఔజ్వల్యాన్ని, వివృతినీ కలిగింపజేసే ప్రతీకాత్మకను సంతరించుకున్నాయి. శివుని మూడో కన్ను పగలడంలో సంఘర్షణలో చెలరేగిన విప్లవశక్తి వల్ల పాత వ్యవస్థ వినాశనం సూచితం. అలాగే "ధనంజయుడు" అనేది సామాన్యుడు సామ్యవాద లక్ష్యంతో ధనస్వామ్య వ్యవస్థపై విజయం సాధించడం సూచితం. ఇలాగా ఎన్నో పరిశీలనకందుతాయి. శ్రీశ్రీలో సంప్రదాయ బంధురత ఎంత లోతుగానో వ్రేళ్ళుదన్నుకొని నిలిచింది. ఇతనిలో ఇది శక్తివంతమైన "నవ్య" కవిత్వాన్ని ఆవిష్కరించడానికి సహాయపడింది. శ్రీశ్రీ దృక్పథంలో "మరో ప్రపంచం" ప్రస్తుత వ్యవస్థకు భిన్నమైంది. ఇక్కడ దీని స్వరూపం కేవలం సూచితమైంది. 'రథచక్రాలు'లో వివృతమైంది. దీన్ని సాధించడమంత సులభం కాదు. దీనికి త్యాగం నిబద్ధత, ఆదర్శంతో పాటు సాహసం ధైర్యం, ఉత్సాహం అవసరం. ఈ లక్షణాలన్నీ ధారా ప్రచండంగా వర్ణింపబడిన గీతం

'మహాప్రస్థానం'. వర్తమాన యుగంలో విప్లవ చైతన్యంతో ఉజ్జ్వలమైన సమాజ భవిష్యత్తును ప్రతిఫలింపజేసే రచన.

'దేశ చరిత్రలు' – క్రియ ప్రతి క్రియ వెనకనున్న చారిత్రక శక్తుల యథార్థ కథనం అనవచ్చు. చరిత్రలోని మౌలికమైన సమస్యలు నూత్న దృక్పథంతో విశ్లేషించి చూచే మనస్తత్వంతో, ఇంత వరకూ మరచిన సామాన్యునిపై వెలుగు ప్రసరించడం జరిగింది. ఇది రచనకొక విశిష్టతను చేకూర్చింది. గుంపుగా జీవించే మానవుల్లో మొదటి నుండి సహకారంతో పాటు సంఘర్షణ కూడా తప్పనిసరిగా ఉండేది. భూమి, దీనితో చేకూరిన సంపద రానురాను సరిపోకపోవడం వల్ల, విస్తరణకాంక్ష వల్ల, అధికార తృష్ణ వల్ల బలప్రదర్శనతో సంఘర్షణ తీవ్రరూపం ధరించింది. దీనికై సైనికబలం, ఆయుధాల అవసరం యుక్తీ వ్యూహం అవసరమైనాయి. తాము జయించిన వారిని బానిసలుగా చేసుకోవడమో లేదా చంపివేయడమో జరిగేది. సంఘంలో క్రమంగా మరో ప్రక్కనుండి డబ్బు, అధికారం, సంపద, హస్తగతం చేసుకొన్న ఒక వర్గం ఆధిపత్యం ఇవి తగ్గిన / లేని మరో వర్గంపై జరుగుతూ బలపడుతూ వచ్చింది. క్రమంగా సామాన్యుని స్థితి ఎప్పుడూ పై వారికి ఉపయోగపడేలా ఉందే కాని ఏ మార్పు పొందడానికి అవకాశం లేకపోయింది. అప్పుడప్పుడు చరిత్రలో అవసరాల్ని బట్టి ఏదో మార్పుకు దారి తీసినట్లు కనిపించినా అది చాలా స్వల్పమైంది. ఇవి రాజకీయంగా సాంఘికంగా, ఆర్థికంగా ఒక దాని ప్రభావం మరో దానిపై ప్రసరింపజేస్తూ సమాహారంగా సామాన్యుని దుస్థితికి హేతుభూతమయ్యాయి. రాను రాను నాగరకత పెరిగిన కొద్దీ పీడకులు, పీడితుల మధ్య అఖాతం మరీ ఎక్కువైంది. వైషమ్యం, స్వార్థం, కౌటిల్యం అన్నీ ఇందుకు దోహదం చేశాయి. ఇప్పుడు ఇతిహాసపు చీకటికోణంలో అట్టడుగున కనపించని కథలన్నీ పైకి తీసి చరిత్రకు వినూత్నమై అర్థాన్ని చెప్పవలసి వచ్చింది. సమాజానికి హేతు దృష్టితో పరివర్తన గుణంలో సామ్యవాద గతిని కల్పించవలసిన అవసరం ఏర్పడింది. ఈ విశేషస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని శ్రీశ్రీ తన రచనలో చారిత్రక పరిణామ దశలను వర్గ సంఘర్షణ దృష్టితో విశ్లేషించి చిత్రించడం కనిపిస్తుంది. 'నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది? క్రోమాన్యాన్ గుహాముఖాల్లో మానవ కథ వికాసమెట్టిది? పురాతన నాగరకతలో బ్రతికిన సామాన్యునిపై వెలుగు ప్రసరించే పద్ధతి వల్ల చరిత్ర స్వరూపమే మారింది. దీనితో తారీఖులు, దస్తావేజులు వదలి యథార్థ జీవిత కథనంలో సామాన్యునికి విశిష్టమైన స్థానం లభిస్తూంది. ఇప్పుడు రాళ్ళెత్తిన కూలీ, పల్లకిమోసిన బోయీ ప్రాధాన్యమేమిటో అర్థమౌతుంది. 'క్రో – మాన్యాన్'

అనే పేరుతో పెద్ద గుహ ఫ్రాన్స్‌లో నెజీర్ నదీ తీరాన ఉంది. క్రో–మాన్యాన్ అంటే పెద్ద గొయ్యి అని అర్థం. 1868లో రైలు మార్గం వేసే ప్రయత్నాలు జరిపినప్పుడు లే ఐ జీన్ ప్రాంతంలో త్రవ్వకాల సందర్భంలో ఎన్నో పెద్ద తలలు, వెడల్పయిన ముఖాలు, ఎత్తయిన నాసికలు గల అస్థిపంజరాలు కనిపించాయి. ఇవి ఆరు అడుగుల పొడవు కలిగినవి. ఎడ్వర్డ్ లార్డే ఈ నాగరకతపై గొప్ప పరిశోధన జరిపాడు. ఆ గుహలో పై కప్పు మీద గోడల మీద దున్న మొదలైన జంతువుల చిత్రాలు కనిపించాయి. జంతువులు వలలో పడినట్లు, బల్లెం గ్రుచ్చుకొన్నట్లు, రాళ్ళతో గాయపడినట్లు చిత్రాలు ఒకదానిపై మరొకటి వేయబడి ఉన్నాయి. ఇంకా జంతువుల వేషాల్లో మనుషుల బొమ్మలు ఉన్నాయి. ఇక్కడ విలసిల్లిన సంస్కృతి పాతరాతియుగంలోని చివరిదశకు చెందిందని (క్రీ.పూ. 28,000 నుండి 10,000 మధ్యకాలం) పరిశోధకుల అభిప్రాయం. మానవ సంస్కృతుల్లో మొదటి నుండి ఇప్పటి వరకు మరచిన సామాన్య మానవునిపై దృష్టితో ఈ దేశం ఆ దేశం, ఈ జాతి ఆ జాతి అన్న భేదం లేకుండా చరిత్రను అవగాహన చేసుకోవలసిన అవసరం భావితమైంది. ఈ గీతం ఇప్పటివరకు మనం అనుసరించే విలువల్నీ మార్చివేసిందీ. సామాన్యులు కేంద్రంగా క్రొత్త దృష్టిని ఏర్పరచింది. క్రొత్త విలువల్ని రూపొందించిందీ. "ఏ శిల్పం ? ఏ సాహిత్యం ఏ వెల్గులకీ ప్రస్థానం" అన్న ప్రశ్నలకు సమాధానమే, 'మహాప్రస్థానం'లో చివరిగీతం. పతితుల్నీ భ్రష్టుల్నీ బాధాసర్పదష్టుల్నీ దీనుల్ని, హీనుల్ని ఉద్దేశించింది.

"జగన్నాథుని రథచక్రాలు" కవిత ఎప్పటికి అసంపూర్ణంగా ఉండిపోతుందేమో అని శ్రీశ్రీకే సందేహం కలిగింది. ఇది లేకుండా 'మహాప్రస్థానం' పూర్తికావడానికి వీలు లేదు. దీన్ని తొందరపడి ఏదో విధంగా వ్రాసేయ్యడానికి ఇష్టం లేదు. 'మహాప్రస్థానం' సంపుటిలో మొట్టమొదటి గీతం 'మహాప్రస్థానం' చిట్టచివరి గీతం 'జగన్నాథుని రథ చక్రాలు' ఉండాలనే శ్రీశ్రీ ఉద్దేశం. ఎలాగైతేనేం అనుకున్న విధంగా 1940లో ఒకరోజు రథచక్రాలు వ్రాయడం పూర్తి అయింది. ఈ మాటల్లో కవి దృష్టిలో రెండు గీతాలు కలిసి భావ సంపూర్ణతను ఎలా సాధించిందీ సులభంగా గుర్తించవచ్చు. మొదటిది విప్లవ భావనతో కార్యాచరణ కాయత్తపరచేదీ. రెండోది పాతదైన ప్రస్తుత వ్యవస్థస్థానంలో క్రొత్తదైన సమసమాజస్థానం సాధించడానికి కార్యచరణమైందీ. దీని తీవ్రరూపం చిత్రితమైంది. సామాజిక పరివర్తనం కోసం అభ్యుదయ చైతన్యంతో ప్రజల్ని విప్లవమూర్తులుగా ఉత్తేజితం చేసి మార్పును సాధించే లక్షణం కనిపిస్తుంది. సామాజిక న్యాయం చేకూరకుండా ఇంకా

అట్టడుగున పడి ఉన్న పతితుల్ని, భ్రష్టుల్నీ, దీనుల్ని, హీనుల్నీ ఉద్దేశించి కరుణోపేతమైన చిత్రణతో ఆరంభమౌతుంది. వీరి నిస్సహాయ స్థితికి జాలిపడతాడు. ఓదారుస్తాడు. ఇంతటితో తన కర్తవ్యం తీరిందనుకోక వాళ్ళలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని కలిగిస్తాడు. వారి సమస్యకు పరిష్కార మార్గంగా జగన్నాథుని రథచక్రాలు భూమార్గం పట్టించే ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ జగత్తుకు నాథుడు ప్రజ!

సమాజంలో సంఘర్షణ అనివార్యమైన దశకు చేరుకున్నప్పుడు పీడితులు, పీడకుల మధ్య ఒక స్థితి వరకు ఉన్న రేఖ చెదిరిపోతుంది. దీని పర్యవసానంగా విప్లవం విజృంభిస్తుంది. పూర్వ వ్యవస్థ కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. మానవుడు తన చరిత్రకు తానే బాధ్యుడు. ఈ నవ వ్యవస్థా నిర్మాణంలో ప్రతి వ్యక్తికీ కర్తవ్య బాధ్యత ఉంది. సమాజ పురోగమన సందర్భంలో, సమసమాజస్థాపనకై అభ్యుదయ శక్తులకు తద్ వ్యతిరేక శక్తులకు, మధ్య సంఘర్షణ అనివార్యమై, ఇది విప్లవానికి దారితీస్తుందన్న మార్క్స్ అభిప్రాయాన్ని ఇచ్చట అనుసంధించుకోవచ్చు. “హాలాహలం పొగచూరింది కోలాహలం చెలరేగింది” హాలాహలం తర్వాత వచ్చేది అమృతం, కోలాహలం తర్వాత నెలకొనేది శాంతి! భవిష్యత్తులో అమృతఫలం కోసం శాంతి జీవనం కోసం వర్తమానంలో జరుగుతూన్న మథనమే, ఈ సంక్షోభం, సంఘర్షణ! స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం పునాదులై ఇళ్ళు లేచి జనావలికి శుభం పూచి “శాంతి! శాంతి! కాంతి జగమంతా జయిస్తుంది.”

అన్న ఆకాంక్ష ఈతని విధ్వంసన శీలంతోపాటు దాన్ని అనుసరించిన నిర్మాణాత్మక లక్షణాన్ని దర్శింపజేస్తుంది. ఇది మానవతా స్పర్శతోను విలసిస్తూంది. ఒక దేశం, జాతి అన్న పరిధుల్ని అతిక్రమించి, అఖిల ప్రపంచ స్థాయిలో స్పందనం ఉత్తేజం కలిగించే సృజనరూపం, ఈ గీతం. ఒక వ్యక్తి మరో వ్యక్తిని, ఒక జాతి మరో జాతిని అణచివేయనీ, పీడించనీ సామ్యవాద వ్యవస్థ యొక్క ఆవిర్భూతిని సాక్షాత్కరింప చేసే ప్రయత్నరూపంగా దర్శనమిస్తుంది.

ఈ గీతాల్లో అప్పుడప్పుడే యూరోపియన్ దేశాల్లో ప్రచలితమైన స్వేచ్ఛాతత్త్వం. దీనికి సహకారంగా హేతు భావన దీనికి మార్గదర్శిగా మార్క్సు గతి తార్కిక భౌతికవాదం – ప్రభావంతో రూపొందిన వ్యక్తిత్వం, క్రొత్త యుగానికి ప్రానిధ్యం వహిస్తూంది. ఈ కవిత్వం లక్ష్యమైన సామ్యవాద ఆదర్శం, అంతర్జాతీయమైన ప్రభావం కలిగింది. పూర్వ సాహిత్య ప్రభావంతో, సిద్ధించిన గణబద్ధ పద్యరచనతో ఆరంభించి, భావకవిత్వంలోకి

ప్రవేశించి దీన్ని అధిగమించి గురజాడ మార్గంలో మాత్రాచ్ఛందస్సునవలంబించి అభ్యుదయ జగత్తులో స్థిరపడి, విప్లవశక్తికి ప్రతినిధిగా రూపొందిన శ్రీశ్రీ విశిష్టమైన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా బింబించేవీ మూడు గీతాలు.

శ్రీశ్రీ మాటల్లో "సంపూర్ణ స్వాతంత్ర్యం ఎలాగైతే ఒక ఆదర్శప్రాయంగానే ఉండి ఎన్నటికి అందుకోరానిదో ఆలాగే అచ్చమైన కవిత్వం కూడా ఎంతవాడికి అందరానిదే! కవిత్వమూ స్వాతంత్ర్యమూ ఎవ్వరికీ, ఎప్పటికి అందని అందాలే ఆదర్శాలే అయినప్పటికీ వాటిని సాధించాలనే ప్రయత్నంలో, ఆ ప్రయత్నంలోని ఆవేగంలోని అశాంతిలోనే, ఆ అశాంతి నుండి ఆనందంలోనే జీవితానికి సార్థక్యం!" ఉంది. ఈ ఆలోచనతో కూడిన అన్వేషణ, తపన, క్రియాశీలం స్పందనల సమాహారమే, శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం! సామాజిక స్పృహలో మార్క్సియం కేంద్ర బిందువుగా రూపొందిన సాహితీ వ్యక్తిత్వం!

# 3. ఆరంభ గీతం - ఆదర్శ రూపం

ఇది 'మహాప్రస్థానం' గీతాల సంపుటిలో మొదటిది. ప్రస్థానం అంటే గమనం, ప్రయాణం. విజయయాత్రకు వెడలడం ఇంకా మరో లోకానికి ప్రయాణించడం. ఇక్కడ ఈ గమనమూ, ప్రయాణమూ మరో ప్రపంచానికి అంటే ఈ వ్యవస్థను కాదని, తిరస్కరించి దీన్ని అంతరింపజేసి ఆపైన మరో క్రొత్త వ్యవస్థలోకి ప్రయాణించడం అన్నమాట. ఇదో సామాజిక ప్రయాణం. ఇందులో ఇప్పుడు నెలకొని ఉన్న వర్గ సమాజరూపాన్ని రూపుమాపి వర్గ రహిత సమాజాన్ని అవతరింపజేసే తీవ్రమైన ప్రయత్నం ఉంది. దీనివల్ల పాతశక్తుల స్థానంలో క్రొత్త శక్తులు ఎదుగుతాయి. పాత సంబంధాలు పోయి కొత్త సంబంధాలు ఏర్పడతాయి. ఈ క్రొత్తదైన మరో ప్రపంచాన్ని స్థాపించే ప్రగతి శీల ఉద్యమంలో 1) జనచైతన్యం 2) వర్గ సంఘర్షణ 3) సమసమాజ దర్శనం - స్ఫూర్తి చిత్రమే ఈ గీతం. ఇది భౌతిక శక్తుల పునాదిపై ఏర్పడింది - సమాజం గతి లక్షణం కలిగింది. దీన్ని ప్రకృతి శక్తులూ భౌతిక శక్తులూ పురోగమింపజేస్తాయి. సంఘర్షణమనేది సమాజం యొక్క భౌతిక ధర్మం. విలయం నుండి సృష్టి సహజం. ఒక దశలో అంటే చరమస్థితిలో మరో క్రొత్త రూపాన్ని పొందుతుంది. ఈ గీతం మార్క్సు గతి తార్కిక భౌతిక వాదానికి సన్నిహితమైంది. ఈ గీతం వ్రాసేటప్పటికి మార్క్సు సిద్ధాంతం గురించి పరిజ్ఞానం తనకులేదని శ్రీశ్రీ అన్నప్పటికి కవిలో అప్పటి సమాజ దుస్థితి పట్ల ఆవేదన ఉద్వేగమూ పరివర్తన కోరే గుణంతో పాటు ఆనాడు తనలో ఉన్న అంతర్జాతీయమైన అభిలాష, ఆలోచన, అవగాహన, మార్క్సు సిద్ధాంతాలతో సంవదించే చైతన్యంగల కవిత్వం ఆవిష్కృతమైందని భావించవచ్చు. కాని కవిత్వాన్ని పరిశీలిస్తే స్థూలంగానయినా మార్క్సిజం గురించి పరిచయ ప్రభావం ఆలోచనలో నిలుస్తుంది.

"మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది.

పదండి ముందుకు పదండి తోసుక పోదాం పైపైకి" ఈ మరో ప్రపంచమే క్రొత్త సమాజం ఇది వర్గరహితమైంది. సమసమాజ భావన కలిగింది. మార్క్సు సామ్యవాద సూత్రాలపై నిర్మితమైంది. దీనికోసమే ఈ ప్రస్థానం. ఇది అనితరమైంది. అంతర్జాతీయమైన భావప్రేరణ కలిగింది. గతి తార్కి భౌతికవాదం పునాదులపై వ్యవస్థీకృతమైంది. కవి మరో ప్రపంచం పిలుపు ప్రయాణ గమనానికి దిశను చూపుతుంది. ఇది క్రియాచరణకు

దారి తీస్తూంది. "పదండి ముందుకు పదండి త్రోసుకుపోదాం పోదాం పైపైకి" కవి అభిప్రేతమైన ఈ ప్రస్థానం ఉత్సాహశీలకమైంది. అంటే వీర రసావిష్కారకమైందన్నమాట. ఇది దూరం బహుదూరంలో ఉంది. కవి అంతరంగం ఈ స్థితిలో మార్పు కోరే భావంతో అతని పిలుపుతో, కార్యచరణకు సిద్దమయ్యే సామాజిక శక్తులతో ప్రగతి రూపం పొందింది. కవి భావన ప్రబోధరూపంలో వస్తువుతో ఐక్యాన్ని పొందడం గమనార్హం. ఇదో సంవిధానం. పిలుపుననుసరించి కవి ప్రతిధ్వనితో అభినీతమైన చలనంతో సంఘర్షణ, ఆపైన విప్లవ దర్శనం కనిపిస్తాయి. ప్రజాశక్తి, కదం తొక్కుతూ పదం పాడుతూ ముందుకు సాగింది. అశ్వగతి సామాజికమైన విజయయాత్రను, పాట శ్రమను లెక్కచేయని మనోరూపాన్నీ, హృదంతరాళం వీరభావాన్నీ స్ఫూర్తికి తెస్తాయి. గర్జించే హృదయం ప్రస్తుత వ్యవస్థపై తిరుగుబాటునూ జైత్రయాత్రలో ఆత్మవిశ్వాసాన్నీ శబ్దిస్తూంది. ప్రస్థాన దశ సంఘర్షణకు దారి తీస్తోంది. రణ స్పర్శను పొందుతూంది. ఈ గమనం ఉన్నత లక్ష్యంతో విజయభావనతో మహాప్రస్థానంగా పరిణమిస్తూంది.

## II

ప్రస్థానంలో మొదటి దశలో మరో ప్రపంచం జలపాత ధ్వనివలె శ్రవణపథంలో అనుభవానికి వస్తుంది. ఇది కశ్మలమైన సమాజాన్ని క్షాళనం చేసి శుభ్రమైన వ్యవస్థను నిర్మించే మార్పుకు సంకేతమైంది. జనశక్తి "దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ" ఎన్నో బాటలూ పేటలూ కోటలూ నదీనదాలూ అడవులూ కొండలూ ఎడారులూ దాటుతూ నిర్నిరోధంగా పురోగమించింది. ఈ యాత్ర సీమల్ని, ఖండాల్ని దాటింది. ఈ రచన విశాలమైన అంతర్జాతీయత్వాన్ని పొందింది. ఈ పురోగతిని చుట్టూ ఉన్న ప్రకృతికీ సమాజానికి సంబంధించిన అడ్డంకులేవీ నిలుపలేక పోయాయి. సాధనలో లక్ష్యం దగ్గరౌతున్న కొద్దీ కార్యాచరణ పట్ల ప్రియత్వమూ అధికమైంది. ఉత్సాహం ఇనుమడించింది. అంకితభావం గాఢత్వాన్ని పొందింది. ధైర్యం కవచమైంది. ఈ ప్రస్థానంలో "నెత్తురు నిండే శక్తులు మండే" సైనిక శక్తులకే స్వాగతం. జరాక్రాంతులకూ, రుజాగ్రస్తులకూ స్థానం లేదు. సోమరులకిక్కడ మృత్యువే అలంకారం. వీళ్ళపై నుండీ వీళ్ళను వదిలీ

"హరో హరోం హర! హర హర హర!" యని మరో జగత్తులోకి వ్యవస్థలోకి కదిలిపోయే కదం ఇది! ఉద్రేకోత్సాహసంభృతమైంది.

ఈ లక్ష్యం అంతలో చేతికందేది కాదు. సులభంగా సాధ్యమయ్యేది కాదు. దీనికో క్రమం ఉంది. పరిణామ దశలున్నాయి. వీటిని దాటినపుడే మరో ప్రపంచం కనిపించేది. మహా ప్రపంచ చేరేది. ఇది ధరిత్రి నిండా నిండిన సమాజ భావనలో సర్వ ప్రపంచ దృష్టి ఉంది. వివిధ జాతుల్ని మతాల్ని వర్గాల్ని వర్ణాల్ని సమైక్యం చేసే సర్వమానవ సౌభ్రాతృత్వ లక్షణం ఉంది. ఇది సమ సమాజ సామ్యవాద మరో ప్రపంచం, ఈ సమాజం అణువణువూ విస్తరిస్తూ ధరిత్రిని ఆవహించేదీ. ప్రపంచ తలంపై విప్లవ కార్యాచరణం కలిగిందీ. దీనికి అవని అంచులే చివరి సీమలు. చైతన్యంతో మహాప్రజ "ప్రభంజనం వలె" హోరెత్తి, "భావ వేగంతో" ప్రసరించీ వార్షుక మహామేఘం వలె ఉరుములతో మెరుపులతో పెళపెళ విరుచుకుపడుతూ పురోగమించడం చిత్రితమైంది. "ప్రళయ ఘోషవలె శబ్దించడం ప్రస్తుతం నెలకొన్న పెట్టుబడిదారీ వ్యవస్థ వినాశనం సూచితం. ప్రస్థానంలో మరో (పై) దశకు చేరుకోగానే ఎదురుగా దూరంగా మరో ప్రపంచపు "త్రేతాగ్ని" కణకణలాడుతూ కనిపిస్తుంది. "కన్పడలేదా?" అన్న ప్రశ్నలో గమనంలో వివిధ పరిణామ దశలు దాటాక తప్పకుండా కనిపిస్తుందన్న సమాధానం ఉంది. త్రేతాగ్నులు మూడు. గార్హపత్యం ఆహవనీయం దక్షిణాగ్ని అనేవి. ఇక్కడ కణకణలాడే అగ్నిస్ఫూర్తి వరకే భావరూపం నియతమైంది. వైదికమైన వివరణతో పనిలేదు. సంస్కృతి గర్భితమైన పురాభావజాలం అనేక సందర్భాల్లో పరమితుల్లో వస్తువుకూ ఆలోచనకూ, బలాన్ని ఆకర్షణనూ చేకూర్చేదిగా నిర్వహించబడింది. కవి వాచ్యం చేయని విప్లవం – "అగ్ని" భావ రూపంలో ధ్వనితమౌతుంది. త్రేతాగ్ని పరిశుద్ధమైన తేజోరూపాన్ని భాసింపజేస్తుంది. ఇందులో "జల ప్రళయం" పాత వ్యవస్థను నశింపజేసే చర్యకు ప్రతీక. పురా ప్రతీకలు స్థితికీ సందర్భానికీ, భావనకూ శక్తి కేంద్రాలుగా పరిమిత స్థాయిలో ఉపయోగింపబడినాయి.

జనశక్తి చేసే తిరుగుమాటు, సంఘర్షణ ఫలితంగా మేరు పర్వతాలు 'ఎగిరి ఎగిరి' పడుతున్నాయి. సముద్రం 'జలప్రళయ' నాట్యం చేస్తూంది. "సల సల క్రాగే చమురా? కాదిది ఉష్ణ రక్త కాసారం" దేహంలో నెత్తురు దీపానికి చమురు వంటిది. విప్లవయాత్రలో దారిలో నెత్తురు పడియలేర్పడినాయి. ఈ దశ సామ్యవాద సమాజ పరిణామంలో భాగమైంది.

గమనం శివ సముద్రము నయాగార వలె వేగాన్నీ తీవ్రతనూ అందుకుంది. త్రాచుల వలె వేగంతో, రేచులవలె విడువని పట్టుతో, ధనంజయుని వలె విజయశీలంతో మునుముందుకు సాగే ఆకాంక్షలో ప్రత్యయమూ ప్రయత్నమూ నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. "ధనంజయ" శబ్దం – ధనాన్ని జయించినవాడు అర్జునుడే గాక, పెట్టుబడి దారీ (ధన) వ్యవస్థపై విజయాన్ని సూచిస్తోంది. దూరంగా ఎదురుగా విజయరూపం.

"అగ్ని కిరీటపు ధగధగలూ ఎర్రబావుటా నిగనిగలూ హోమజ్వాలల భుగభుగలూ" విప్లవ దృశ్యం మొదట్లో ఉన్న శ్రవణపథం నుండి చివరనున్న నేత్ర పథానికందే దశకు చేరుకుంది. "అగ్ని కిరీటం", విప్లవంతో హస్తగతమయ్యే అధికార శక్తికీ, ఎర్రబావుటా విప్లవ సమాచరణకు, భుగభుగమనే హోమజ్వాలలు స్వచ్ఛమైన ఉత్సాహవంతమైన క్రియాత్మకమైన చైతన్యగతి శీలానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ ప్రస్థానం అనితరమైంది. మహానీయమైంది, ప్రజాపరమైందీ.

ఎక్కడా వాచ్యం కాని వ్యంగ్య విలసితమైన అర్థ స్ఫూర్తితో, వివిధ స్థాయిల్లో భిన్నభిన్నమైన ఆలోచనా రామణీయకతల కాస్కారమైందీ, ఆరంభగీతం. కవి ఆదర్శాన్ని ఆవిష్కరిస్తుంది. వస్తువు ఎన్నికలో అభివ్యక్తి విధంలో, లక్ష్యసాధనలో ఉన్నతమైన కవితా కళా ప్రమాణాల్ని పొందింది.

# 4. ఋక్కులు - సంవిధాన ప్రయోజనాలు

ఋక్కు అంటే స్తుతి – ఛందోయుతమైన వేద మంత్ర విషయంలో ప్రసిద్ధమైంది. వేదంలో ఋక్కులు ప్రకృతి వర్ణనంతో దేవతా భావనతో అతీత దర్శనంతో విలసిల్లాయి. శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో "ఋక్కులు" అనే ఖండిక ఉంది. ఇక్కడ ఋక్కు అంటే శబ్ద సంక్షేపంతో అర్థ సంగ్రహంతో భావస్ఫూర్తితో ఆకర్షణీయమైన సంక్షిప్త రూపాన్ని సూచిస్తుంది. ఈ ఖండికను రెండు భాగాలుగా గుర్తించవచ్చు. మొదటి దానిలో కవితా వస్తు స్వరూపం వర్ణితమైంది. రెండో దానిలో కవితా తత్త్వం వివృతమైంది.

మొదటి భాగంలో మూడేసి శబ్ద చిత్రాలు (Word Images) అంత్య ప్రాసతో లయాత్మక గతి విశేషంతో మూడు నమూనాలు (Patterns) సంవిధానం యోజితమైంది. అయితే ఒక్కొక్క దాని చివర వాక్యాలు. కవితా వ్యాఖ్యలుగా కనిపిస్తాయి. వీటిలో ఉల్లేఖితాలైన వస్తువులు వాస్తవ జీవితంలో మనకు కన్పించేవీ. అనుభవంలో నున్నవీ. వీటిని గురించి ఆలోచన చేయడం వీటి సామాజికమైన అవసరాన్ని గుర్తించడం, అహీనమైనస్థానాన్ని దృష్టికి తేవడం కనిపిస్తుంది. ఒక వరుసలో కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, శబ్దచిత్రాలు కనిపిస్తాయి. వీటి చివర కవి మాటలో దేన్నీ హీనంగా చూడవద్దు. అన్నీ కవితామయాలే అన్న వ్యాఖ్యలో తత్వోక్తితో సంవిధాన రూపాన్ని పొందాయి.

"కుక్కపిల్ల" విశ్వాస పాత్రమయింది. అందమైంది. తనను పోషించే మనిషిని చివరిదాకా వదలకుండా ఉండేది, కాపాడేది. ఈ కృతజ్ఞతా లక్షణం సమాజంలో వ్యక్తి గుర్తు పెట్టుకోదగింది. అగ్గిపుల్ల మనిషి జీవన సంస్కృతిలో గణనీయమైన దశకు చెందింది. ప్రాచీన కాలంలో అరణిని మథించీ, ఎంతో కష్టపడీ అగ్నిని సాధించేవారు. దాన్ని కాపాడుకునేవారు. ఇది ఎంతో ప్రయాసతో కూడిందీ, కాలయాపనతోను కూడింది. ఈ క్రమంలో అగ్ని ఇతరేతర కారణాల వల్ల దేవతారూపాన్నీ పొందింది. శ్రీశ్రీ ఋక్కులో అగ్గిపుల్ల మానవ సంస్కృతి చరిత్రలో గొప్ప మలుపును సూచించడమైకాక విశేషమైన ప్రయోజనరూపం కలిగింది. ఈ సందర్భంలో అగ్గిపుల్ల మనిషి అవసరాన్ని అవలీలగా తీర్చే సులభమైన ఆధునిక సాధనం, తనలో అగ్నిని నిక్షిప్తం చేసుకుంది. మనిషి అవసరానికి క్షణంలో ప్రయోజనం తీర్చే రూపాన్ని పొందిందీ.

మరో వరుసలో 'రొట్టెముక్క' 'అరటి తొక్క' 'బల్లచెక్క' శబ్ద చిత్రాల్లో వస్తువులు మనిషి వైపే చూస్తుంటాయి. తమ "లోతుకనుక్కో" మంటాయి. రొట్టెముక్క క్షుధను తీర్చేది, ఇది మనిషి మొట్టమొదటి అవసరం. దీని చుట్టూ ఎంతో సామాజిక చరిత్ర ఏర్పడింది. దీన్ని అంటిపెట్టుకొని మనిషి భ్రమణమూ సాగింది. అరటి పండు పైనున్న పొట్టు (తొక్క) రక్షణ కవచంలా పనిచేస్తుంది. మాలిన్యం నుండి కాపాడేది. కాస్తలోతుగా ఆలోచిస్తే మనిషికీ మానసికంగా ఇలాంటి రక్షణ కవచమేదో జీవితంలో అవసరమనిపిస్తుంది. బల్లచెక్క కూర్చోడానికి పనికి వచ్చే విశ్రాంతి తలం. శ్రమానంతరం మనిషికి విరామం అవసరం. ఇది మనిషిని శ్రమనుండి మళ్ళీ పునర్నవీకృతం చేస్తుంది. ఈ విరామ విశ్రాంతి స్థితిలోనే ఎంతో విజ్ఞానం, ఎన్నో కళలు ఆవిర్భవించాయి. ఇక్కడ బల్లచెక్క విశ్రాంత స్థితికి సంకేతం మాత్రమే.

ఇంకో వరుసలో "తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం" శబ్ద చిత్రాలతో, ప్రతి వస్తువు అర్థతనూ దానిలో ఏర్పడిన పనితనాన్ని, శిల్పాన్ని ప్రయోజనాన్ని భావింపజేయడం జరిగింది. వీటి నిర్మాణంలో మనిషి తెలివీ, ప్రయోజనలక్ష్యం, శిల్ప దృష్టీ ఆకర్షిస్తాయి. తలుపు గొళ్ళెం ఇంటి భద్రత కవసరమైంది. కళ్ళెం గుర్రం వేగాన్ని ఉద్ధృతీనీ అదుపులో పెడుతుంది. ఎప్పటికప్పుడు అవసరమైన సరియైన అశ్వగతికి తోడ్పడుతుంది. ఇక మరొకటి హారతి ఇచ్చేటప్పుడు మండే, వెలిగే కర్పూరాన్ని వహించే సాధనం పళ్ళెం. ఇది ఒక విశేషమైన పనిలో ఉపకరించేది. సహకరించేది ఈ భాగం వస్తు వర్ణనం ప్రధానమైంది.

రెండోభాగంలో, చూపంటూ ఉంటే చూచీ వాక్కుంటే వ్రాసీ "సందర్భాన్ని బట్టి భాహ్యస్థితిని దాటిన మానసికమైన ఆలోచనా స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది. వాక్కుభావమయమైంది. అభివ్యక్తి గతమైంది. ఈ రెండింటి సమ్మేళనం (అంటే భావం మరియు అభివ్యక్తి) చేత సిద్ధించే రసావిష్కారం శోభామయమైంది. దీన్ని అర్థం చేసుకోడానికీ అనుభవించడానికీ చూపు ఉండాలి. ఇది బాహ్యంగాను అంతరంగాను వర్తించేది. ఇది ఉండడం వల్ల 'శోభాలేశం' లభ్యమానమవుతుంది. లేశం అన్నమాట కనీస స్థాయిని సూచిస్తూంది. 'చూపు' కేవలం భౌతికమే గాక మానసికం కూడా' ఆలోచనకు సంబంధించింది. వాక్కు శబ్ద శక్తి సంబంధించిందీ. స్థూలంగా రసమంటే అనుభవంలో రుచీ సారమనీ అర్థం. రసం చేతనే కావ్యం జీవిస్తుందనీ అలంకారిక మతం. "ప్రపంచమొక

పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం" ఇది 'బుక్కులు' ఖండిక చివరి పంక్తులు. సాహిత్య ప్రపంచంలో బహుళ వ్యాప్తిని పొందాయి. రణక్షేత్రంలో శత్రువులపై విజయాన్ని సాధించేందుకు పద్మం ఆకారంలో దళాల అమరికవలె సేనల ఏర్పాటు పద్మవ్యూహం. ప్రపంచమూ ఇటువంటిదే అని కవిభావం. లోపలికి ప్రవేశించడమే కాని బయటపడడం కష్టతరమైంది. జీవితంలో సంఘర్షణ అనివార్యమవుతుంది. మహాభారత యుద్ధంలో అభిమన్యుని కథ ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది. పద్మవ్యూహంలో ప్రవేశించి విజయాన్ని పొందడం సులభం కాదు. దీనికి వ్యూహ పరిజ్ఞానం, ఛేదించే నేర్పు అవసరం. కేవలం రణేచ్ఛ ఉంటే సరిపోదు. కవిత్వ విషయంలోను కేవలం పిపాస ఉంటే సరిపోదు సంవేదన, భావనాశక్తి, రచనా కౌశలం ఉండాలి. ఈ దాహం ఒక్క మారుతో తీరేది కాదు. అంతంలేంది. అనంతమైంది. కవితా విషయంలో ఉచ్చ నీచ భేదం పనికిరాదు. ఏ వస్తువైనా స్వీకారార్హమే. అయితే కవి ప్రతిభ చేత కవితావేశం భావ రచనా రామణీయకతల్ని పొందుతుంది. ఆపై రసనిర్దేశం జరగవచ్చు. "రమ్యం జుగప్సిత ముదార మథాపి నీచం ఉగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు యద్వాప్యవస్తు కవి భావక భావ్యమానం తన్నాస్తి యన్నరసభావ ముపైతి లోకే" అన్న దశరూపకంలోని సాహిత్యశాస్త్రోక్తిని అను సంధించుకోవచ్చు. అందమైందైనా అసహ్యమయినదైనా, గొప్పదైనా, తక్కువదైనా, భయంగొల్పేదైనా, సంతోషం కలిగించేదైనా, దుఃఖం (కష్టం) కలిగించేదైనా ఏ విధమైన వస్తువైనాసరే లోకంలో కవి సంస్కారం చేత ఆలోచనలో రసభావాన్ని పొందని వస్తువు లేదు. ప్రతిభా దీప్తి! అభివ్యక్తి శక్తి, లక్ష్యశుద్ధి వల్ల భావనా బలం చేత కవిత్వమవుతుంది. "బుక్కులు" కవిత్వంలో అవసరమైన వస్తువు మరియు శిల్పాలతో పాటు వేదన మరియు రామణీయకత గురించి స్పృశిస్తూ వస్తు వైవిధ్యాన్నీ భావనా వైశిష్ట్యాన్నీ, ప్రయోజనాత్మక లక్ష్యాన్నీ రసావిష్కారాన్ని గురించి ఆలోచింపజేసేదిగాను ఉంది.

# 5. జయభేరి - విశ్వభావన

'మహాప్రస్థానం' గీతాల సంపుటిలో "జయభేరి" కొత్త భావరూపానికీ ప్రగతి తత్త్వానికీ ఆకర్షణీయంగా నిర్వహించిన సంవిధానానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రయోజనపరత్వమూ అభివ్యక్తి శిల్పమూ ఈ రెండింటి సమన్వయమూ కళాత్మకమైన పరిణతిని పొందాయి. రచన చదువుతూంటే అనుభవ విశ్లేషణలో సామాజికత ఆకర్షిస్తుందా? కళ ఆకట్టుకుంటుందా? అనిపిస్తుంది. భేరి అనేది చర్మవాద్యం. జయాన్ని సూచించే ధ్వనితో సంపన్నమైనది. జయభేరి ఆశయసాధనలో జయ సూచనతో సంతోషకరమైన స్థితిని ధ్వనింపజేస్తుంది. ఇందులో విజయ భావనా స్థితి సమాజపరమైంది. దీనికి కేంద్ర బిందువు వ్యక్తి. "నేను" రూపంలో వ్యక్తమైంది. "నేను" కవి స్వరంలో రూపొందే సామాజికమైన అస్తిత్వంతో సామ్యవాద సమాజానికి ప్రతినిధి. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను". ప్రపంచాగ్ని సమాజ విప్లవ శక్తికీ, సమిధ బాధ్యతాయుతమైన వ్యక్తికీ, ఆహుతి ప్రయోజనపరమైన కార్యాచరణకు ప్రతీకలు. కవి స్వరంతో అనుసంధింపబడిన నేను ఈ సందర్భాన్ని బట్టి సామ్యవాద రూపమైన సామాజిక విప్లవ శక్తిలో ఏకదేశం. కవి భావించే సమాజం ప్రపంచతలంపై వ్యవస్థీకృతమైంది. అదే సమ సమాజం. మార్క్సు సామ్యవాద సిద్ధాంతంపై నిలబడింది. ఈ కవితలో "నేను" ప్రగతి శక్తికి సంకేతం. తాను కూడా ప్రగతిశక్తుల్లో ఒకడుగా భావించడానికి ఉపక్రమించడం సమాజంలో ప్రతిఒక్కరినీ కలుపుకొనిపోయే విధంతోపాటు కవిగా తన సామాజిక పాత్రను విస్మరించరాని స్థితినీ సూచిస్తోంది. ఈ అభివ్యక్తి విధానం ఈ గీతానికి ప్రత్యేకతను సిద్ధింపజేస్తోంది.

"నేను సైతం విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధార పోశాను" విశ్వసృష్టి – విశ్వజనీనమైన కరుణాత్మక స్థితి గతులకు చెందిన సమాజ జీవితాన్నీ – అశ్రువు దీనికి స్పందించే వేదనా హృదయం రాల్చే సానుభూతినీ స్ఫురింపజేస్తాయి. ధారపోయడమనేది, త్యాగంతో వర్తించే వ్యక్తిత్వాన్ని భావింపజేస్తోంది. సమాజంలో అడుగడుగునా కరుణాత్మక దృశ్యాలనేకం. పేదరికం నుండి జీవన బాధల దాకా దుఃఖాలనుండి మృత్యువు ఛాయల దాకా పరివ్యాప్తమై కనిపిస్తాయి. మరో విధంగా ప్రపంచ వ్యాప్తంగా పీడితుల తాడితుల దుఃఖితుల కరుణాత్మకమైన జీవిత రూపానికి విశ్వ వృష్టీ, తోటి మనిషి పట్ల ఆర్ద్రమైన

అనుభూతికి అశ్రువూ నిలుస్తాయి. ఇది మార్పుకు తొలి దశలో పరిణామ గుణంలో అంతర్భాగమైందీ.

చారిత్రక నేపథ్యంలో సమాజంలో పీడితుల్ని దుఃఖితులల్ని గురించి ఆలోచన చేసే వారిలో బుద్ధుడు సాక్షాత్కరిస్తాడు. క్రీస్తు ఎదుట నిలుస్తాడు. మార్క్స్ మెదలుతాడు. ఎందరో మహనీయులు వివిధ తలాలపై పీడనకూ బాధలకూ ఒక్కొక్క విధంగా ప్రతిస్పందించారు. ప్రతి క్రియల్ని కనుగొన్నారు. ఏ పరిష్కారమూ సమగ్రమైందిగా కనిపించలేదు. వీటి సమాధానాల సందుల్లో నుండి అంచుల్లో నుండి ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. అయితే ఆర్థిక దృష్టితో ఈ ఎడారిని సుక్షేత్రం చేసేందుకు మహావృష్టి అవసరం కాక మరేముంది? మహావృష్టి మార్పుకు సంకేతం. దీనిలో భాగమే గగనాశ్రువు. హృదయ తంత్రిని సుకుమారంగా మీటి ఆర్ద్రస్ఫూర్తిని మెరపించేదీ ఖండం. ఒక్కొక్క స్థాయిలో ఒక ప్రమాణంలో వ్యంగ్య మర్యాదల్ని కలిగింది, ఉత్తమ కవిత్వమనుకుంటే ఆ ఒరిపిడికి నిలిచేవీ పంక్తులు. "నేను సైతం భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను" ఇందులో భువన ఘోష, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆర్తి స్వరాలసంపుటి. వెర్రి గొంతుక అమాయకమైందీ అంటే సహజమైందీ. కష్టాల్లో బాధల్లో నిర్నిమిత్తంగా ఒకటయ్యే స్వర సంపుటితో మ్రోగేదీ. సామాజికమైన ఆర్తిలో వైయుక్తికమైన అనుభూతి స్ఫూర్తితో తదైక్యం కలిగిందీ. "నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను"

ప్రపంచమనే పద్మానికి తెల్లని రేకై చిగిర్చడంలో శాంతి ప్రియత్వం ఉంది. పద్మం అందర్జాతీయ సమాజానికి ప్రతీక. సామ్యవాద వ్యవస్థీకృతమైంది. అందులో సుందరమైన రేకుల వ్యక్తిత్వంతో ఏక దేశమైన మనిషినీ, పల్లవించడం అస్తిత్వ వికాసాన్నీ రేకులన్నీ కలిసీ సమాజ సమగ్రతనూ భావింపజేస్తాయి. "నేను సైతం విశ్వవీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను" ఇదే విధంగా విశ్వమనే వీణకు తంత్రినై మధురమైన స్వరాల్ని పలకడం సమాజ తలంపై ప్రయోజనపరత్వాన్నీ వైయక్తిగంగా కళాత్మకతనూ దృష్టికి తెస్తాయి. మూర్ఛన అంటే సంగీత శాస్త్రంలో స్వరాల ఆరోహణావరోహణం. ఒక నిర్దిష్టమైన క్రమంలో స్వరాల ఆరోహణ అవరోహణ చేతనే రాగం సిద్ధిస్తుంది. దీనిలో నేర్పు చేత ప్రతిభ చేత రాగ కళ ప్రకాశిస్తుంది. "నేను సైతం భువన భవనపు బావుటానై పైకి లేస్తాను" ఇది పై విశేషంతోపాటు పైన పేర్కొన్న వాటికి భిన్నమైంది. ప్రపంచ భవనంపై పతాకయై పైకి లేస్తానంటాడు. తాను బావుటాల్లో ఒకటి కాదు. ఇక్కడ కవిగా తన

ప్రత్యేకతను నిలుపుకునే మనోరూపం కనిపిస్తుంది. ఈ బావుటా సర్వమానవ విజయశక్తికి సంకేతం. ఇక్కడ తన విజయమంటే మానవ సమాజ విజయమే. కష్టాల నుండి పీడన నుండి దుఃఖా ను,డి బాధల నుండి ఉద్గమించే సంతోష భావనా స్థితినందుకున్న సందర్భంగా మ్రోగేదీ జయభేరి, విజయ చిహ్నం.

ఈ గీతంలో విశ్వైక్య భావన ఏక సూత్రంగా ఉంది. సామ్యవాద సామాజిక తత్త్వం ఆధారతలంగా ఉంది. వ్యక్తి అస్తిత్వం స్ఫుటంగానూ కనిపిస్తుంది. వ్యక్తి వికాసం సమాజంలో భాగమైందీ. ఆలోచనతోపాటు అనుభూతినీ కలిగించేదీ. కళాత్మకమైన ఆకర్షణతో పాటు వ్యక్తి స్ఫూర్తిని మరవని సమాజపరమైన సామ్యవాద ప్రయోజనంతో సహృదయుల్ని ఆకట్టుకునే “అనితర” మైన కళాత్మకతను పొందిన గీతం జయభేరి.

# 6. వాడు - పీడన శక్తికి ప్రతీక

సమాజంలో పీడన, బాధ, వేదన సంఘర్షణ, మానవత, సమానత అన్న భావ స్థానాల పరివృత్త రూపమే శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం. మార్క్సియ సామ్యవాదం కేంద్రస్థానం. దీనికి మార్క్సియ భావ ప్రపంచంలో వాస్తవ జీవితంలో కార్యాచరణ రూపమే “వాడు” ఖండిక. ఇది అభ్యుదయ స్వేచ్ఛా కవిత్వంలో ప్రథమోదాహరణీయంగా నిలుస్తుంది. సమాజంలో “వస్తు సముదాయం” సమష్టి కృషి పర్యవసానమైంది. ఇందులో ప్రతి ఒక్కరి శ్రమ దాగి ఉంది. సమాజంలో వస్తు సృష్టి ఆరంభం నుండి సమాప్తి వరకూ శ్రమతో పర్యాప్తమైంది. అందరూ కలిసి చేసిన వస్తువు వినియోగంలో లేదా మూల్యంలో అందరికీ భాగం ఉండాలి, ఇది న్యాయం. అయితే ఎవడో ఒక్కడే వచ్చి దీన్ని అపహరిస్తూంటే చూచి, ఊరుకోకుండా నిరసిస్తూ, ప్రతిఘటిస్తూ “అన్యాయం” అని ఎలుగెత్తడం గొప్ప ఆధునిక యుగ చేతన పరిణామమే. ఈ పరిస్థితి రావడానికెంతో కాలం పట్టింది. చరిత్రలో ఈ విధమైన నిరసన స్పృహ లేకుండానే సమాజంలో యుగాలు గడిచాయి. ఆధునిక యుగంలో హేతువాద ప్రభావంతో ప్రగతిశక్తుల చలనంతో ప్రశ్నించడం మొదలైంది. దీని పర్యవసానమే! సమిష్టి శ్రమ ఫలాన్ని దోచే వ్యక్తిని చూచి, ఆగ్రహించడం, “అన్యాయమని”, శబ్దించడం జరిగింది. పీడితుల నిరసనం శబ్దైకమాత్రంగానే నిలిచింది. వాడు (పీడకుడు) మాత్రం “అనుభవించాలి మీ కర్మమని” వెళ్ళిపోతాడు. ఇది పూర్వ సమాజంలో నెలకొన్న తాత్త్విక స్పర్శతో కూడిన మాట. విధి – కర్మ – పేరిట అణచివేతను ప్రతారణాన్ని (Exploitation) కప్పిపుచ్చే ధోరణి ముఖ్యంగా తాత్త్విక చింతనలో భాగమైంది. ఇది ఒక స్థాయిలో నిష్క్రియత్వానికీ దారితీసింది. పీడితుల్ని ఉన్న దశలోనే ఉండిపోయేట్లు చేసింది. శ్రమజీవుల నిరసననూ లెక్కచేయకుండా వారిని కష్టాలపాలుజేసే వ్యవహార దక్షుడు ప్రతారణశీలి (Exploitor) “వాడు”. ఇదో యధార్థ స్థితి రూపం.

పొద్దు పొడిచింది మొదలు పగలంతా శ్రమ నిండిన “పని” తప్ప మరే వ్యాపకం లేదు. ఆట, పాట, అనుభవం, ఆలోచన అనే విశేషాలు లేనే లేవు. సూక్ష్మతలంపై జీవితం లేనేలేదు. “ముద్ద” దొరకడమే కష్టమైపోతే, ఇక కడుపునిండాక తీరికవేళల్లో సమయం గురించిన ప్రశ్నేలేదు! అందుకే వాళ్ళు “మొద్దు”లూ “మొరటులు”గా

మిగిలిపోయారు. శ్రమ స్పృహతో సమాజంలో విషమత్వానికి దారితీయడం సహజం. ఇది గ్రహించి చారిత్రక దశలో సామాజిక చేతనతో ఎదురుతిరిగి, “దారుణ”మంటే, ఇట్లా పనిచేస్తూపోవడం, “ఆచారం”, ఇది దాటరాదని జవాబు వస్తుంది. సమాజంలో ఆచారం పేరిట నియమం పేరిట జరుగుతూన్న పీడనకూ అమానుషత్వానికీ ఇది నిదర్శనమైంది. ఆ తరువాత దశలో శ్రామికులు తమ జీవితంలో ఈ దుస్థితి భరించలేని స్థితి వచ్చింది. ఈ బరువును భరించడం కష్టమైంది. చేతిలో పనిముట్లను వదిలేసే స్థితి వచ్చింది. “చెయ్యలేం, చస్తున్నాం” అన్న ఆవేదన, ఆక్రోశం ఎగసింది. జీవనానికి “ఆసరా” చూపించమంటే పీడితులు మాట పలక్కుండా గొంతు నొక్కేయడం, వారిని అవమానకరంగా బాధించడం జరిగింది. క్రమంగా శ్రామికులు వ్యతిరేకమార్గం అవలంబించక తప్పని పరిస్థితి ఏర్పడింది. పనిముట్లు వదిలేసారు ఆగ్రహం వెలిబుచ్చారు. నిరసన ప్రకటించారు. ప్రతి ఘటించారు. సంఘర్షణకు దిగారు. కాబట్టి దీనికి సమాధానంగా వారికి అణచివేసే ధోరణిలో పీడితులపై దౌర్జన్యానికి సిద్ధం కావడం అణచివేతకు పరాకాష్ట అయింది.

ఈ రచన మూడు భాగాలుగా ఉంది. మూడు పేరాల్లో నిబంధింపబడింది. మొదటి భాగంలో కేవలం నిరనం ఉంది. రెండో భాగంలో దీన్ని ఆచరణలో పెట్టడం జరిగింది. మూడో భాగంలో సమాప్తి రేఖను తలపించే క్రియత్మాకత ఉంది. వీటిని క్రమంగా నిరసనం, ప్రతిఘటనం, సంఘర్షణగా గుర్తించవచ్చు. మార్క్సీయమైన అభ్యుదయ భావన సూక్ష్మస్థితిని పొందింది.

“వాడు” ఖండిక, ఒకటి ఆధునిక యుగంలో హేతుదృష్టితో అభ్యుదయ భావజాలంతో మేల్కొన్న శ్రామిక సమాజం, రెండు వారిలో పీడితుల్ని ఎదిరించే మోహరించే మానసిక పరివర్తననూ, బింబించే ఖండిక. ఈ దుర్భరమైన స్థితి అలజడికీ ఆందోళనకు దారితీసేది. వర్గ సంఘర్షణకు దారిచూపేది. “వాడు” కు పేరు లేదు. యుగాలుగా సమాజ పీడనశక్తికి ప్రతీకగా, చరిత్రలో నిరంకుశతత్వానికి ప్రతినిధిగా నిలిచే, సామాజిక రూపంగా గ్రహింపబడింది. ఎన్నో పేర్లతో వ్యవహారింపబడే సర్వనామం. ఈ పేర్లు శ్రమకు సంబంధించిన యాంత్రికం వ్యవసాయకం, వృత్తిపరం, ఇంకా ఎన్ని విధాలుగానో తటస్థ పడతాయి. వర్గభేదాల్ని జ్ఞాపకం చేస్తాయి.

ఈ ఖండికలో 1) పీడన నుండి ఆర్తి, 2) ఆర్తితో వేదన, 3) వేదన మూలంగా నిరసన ప్రతిఘటన సంఘర్షణ, 4) మొత్తం మీద లోపించిన మానవత, 5) చివరకు స్థాపింపగోరే సమానత సమాలోచనకందుతాయి. ఇందులో వస్తువు దేశ కాలాతీతమైన విశ్వజనీనమైన జీవిత యధార్థరూపాన్ని పొందింది. అభివ్యక్తి రూపం కవి ఆదర్శతలంపై సార్వజనీనమైన హృదయాన్ని స్పందించే మానవతా గుణాన్ని తలపిస్తూంది. లక్ష్యం వాచ్యం కాలేదు వ్యంజితమయింది. అది పీడన అంతరించిన వర్గ బేధం లేని, సమ సమాజం, స్ఫూర్తికి మాత్రమే అందుతూంది.

# 7. వ్యత్యాసం - యధార్థ జీవిత చిత్రణం

"వాడు" కవితకు వివరణ రూపమే వ్యత్యాసం. ఇదో పార్శ్యం మాత్రమే. సమాజంలో రేఖ కవతల కొందరూ రేఖ కివతల కొందరూ. వీరు ఇరు పక్షాలుగా యుగాలుగా ఉన్నవారు అంతా మానవులే, సమాజం ఒకటే, కాని పరిస్థితులు వేరు, జీవితాలు వేరు, ఆలోచనలు వేరు, ప్రవర్తనలు వేరు. జీవితంలో అసమానతలతో ఈ పక్షాలు పరస్పరం వ్యతిరేకమైనవి. విభేదాలతో సంఘర్షణకు దారితీసేవి. ఒక వైపు ఉన్నవారి జీవితం వడ్డించిన విస్తరి అయితే వీరిని కాపాడేందుకు గొప్ప వ్యవస్థ ఉంది. వీరికి ఉన్నచోటు చాలు! కదిలితే ఏమవుతామోనని! భయం! ఇంకా వెనక్కి పోవాలనుకునేవారూ! ఉన్నారు. వీరికి సుఖం! సంతోషం!తో కూడిన జీవితం ముఖ్యం. వీలును బట్టి అభిప్రాయాలు – మార్చుకునే అదృష్టవంతులు. ఇదో వర్గం. మరొక వైపు నున్న జీవితం, ఎప్పటి కప్పుడు యాతనతో కూడుకొంది. ఎవరి వంట వారే పండుకొనే స్థితిలో ఉంది. పదార్థాలు సులభంగా దొరకవు! ఒక్కొక్కప్పుడు విస్తరి కూడా దొరకదు. అన్నీ సందేహాలే! అన్నీ ప్రశ్నలే! సుఖం! సంతోషం! కన్నా, బాధ! ఆవేదన అధికం. అలజడి ఆందోళన తప్పదు! దారిలో ముళ్ళూ రాళ్ళూ ఎన్నో! అభిప్రాయాల కోసం సిద్ధాంతాల కోసం ప్రయాణంలో ! అన్నీ భరించడం – అవసరం, వీరు జీవితంలో లక్ష్యం ఆదర్శం ముఖ్యమైన పురోగాములు. మరో వర్గం. ఈ కవితలో రాజకీయ సిద్ధాంతాల ఉద్ఘాటనం లేదు. కేవలం యధార్థ జీవిత స్వరూపం సమాజంలో ఎట్లా రెండుగా చీలి ఉంది. అది ఎట్లా వర్గాలుగా ఏర్పడి ఉందీ. చిత్రితమైంది.

ఈ వ్యత్యాసం క్రమక్రమంగా స్వార్థం, ప్రతారణంతో ఎన్ని యుగాలుగానో రూపుదిద్దుకుంటూ బలపడుతూ వచ్చింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజరికం, మతం మొదలైన విశ్వాసాల సహాయంతో పట్టు చెడకుండా కాపాడబడుతూ నిలిచిఉంది. ఉన్నవారూ, లేనివారూ, పీడకులూ, పీడితులూ, అదృష్టవంతులూ, దురదృష్టవంతులూ సుఖజీవులూ, శ్రమజీవులూ మరియు భాగ్యులూ అభాగ్యులు రేఖకు చెరొక వైపుననున్నవారు ఈ వ్యత్యాసాన్ని అనుక్షణం గుర్తుచేస్తారు. వ్యక్తులు లేకుండా సమాజం లేదు. నిజమే కొందరు వ్యక్తుల సమాహారం సమాజం అవదు. వీరి జీవితాల వెనుకనున్న సామాజిక రాజకీయ సాంస్కృతిక శక్తుల ప్రభావం ముఖ్యం. వీటి ప్రభావ పర్యవసాన రూపమే

సమాజం. అనేక చారిత్రక సామాజిక రాజకీయ కారణాల వల్ల సమాజ గతిలో వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. అభ్యుదయ దృక్పథంలో మార్క్సియ భావనలో ఈ వ్యత్యాసం వర్గ సంబంధమైందని మాత్రమే ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంది. అటు, ఇటు వ్యత్యాసాలతో రెండు సమాజాల్లో ఒకటి పాత ప్రపంచం, రెండోది కొత్త ప్రపంచం. ఇవి నిరంతరం ఘర్షణ పడుతుంటాయి. ఇది ఒక్కొక్కప్పుడు వేగాన్ని పొందవచ్చు. దీన్ని వేగవంతం చేయడమే నవ్య (అభ్యుదయ) రచయితల కర్తవ్యం. ఈ వ్యత్యాసాలు లేని, ఇవి తుడిచిపెట్టుకొనిపోయే ఒకే ఒక సమాజ రూపం వర్గ రహితమైంది. సామాజిక న్యాయంతో ఆర్థిక సమానత్వంతో అవతరించివలసి ఉంది.

సమాజంలో రేఖకిరువైపుల సంఘర్షణకు సిద్ధంగా ఉన్న ఇరుపక్షాల యధార్థ స్వరూప చిత్రణమే "వ్యత్యాసం" మునుముందు మహాప్రస్థానం కావ్యంలో "జగన్నాథ రథ చక్రాల" ఆగమనంతో సంఘర్షణ సమీకృతమవుతుంది. వ్యత్యాసాలకు కారణమైన వర్గ సమరం సమాహితమవుతుంది. అలజడి చెలరేగుతుంది. ఆటో ఇటో తేలిపోతుంది. రేఖ అంతరించి సమసమాజస్థాపనం జరుగుతుంది. ఇది వర్గ రహితమైందీ, ఆర్థిక సమానత్వం కలిగిందీ. వ్యత్యాసాలకు కారణాలు స్థూలంగా ఒకటి అవిద్య, రెండు దారిద్ర్యం – వీటిని రూపుమాపే ప్రయత్నం జరగవలసినంతగా యుగాలుగా జరక్కపోవడం. మూడు సమస్యల పట్ల హేతుదృష్టి లోపించడం నాలుగు స్వార్థం సంకుచిత్వం. అయిదు మానవతనూ ఉదారతనూ మరచిపోవడంగా దృష్టికి వస్తాయి. రాజ్యమూ మతం పట్ల విశ్వాసాలతో కూడిన వాతావరణం మొదటి వర్గమైన పీడకులు బలపడేందుకు మాత్రమే సహకరించాయి. సామాన్య ప్రజల జీవితాల వైపు తగినంత శ్రద్ధ తీసుకోలేదు.

శ్రీశ్రీ రచనలో ఈ విశ్లేషణ మార్క్సియ వర్గ భేద సిద్ధాంతంతో మూలరూపాన్ని పొందింది. వ్యత్యాస నిర్మూలనం కేవలం భావనా మాత్రం గానే కాక క్రియాచరణంగాను పరిణమింపజేయడం, సత్వరం లక్ష్య సాధనకుపక్రమింపజేయడం, ప్రేరేపించడం, నవ్య (అభ్యుదయ) కవిత్వం ప్రధానమయిన ప్రయోజనం. ఈ సంప్రేరణ గుణం శ్రీశ్రీ కవిత్వంలో ఒక ఆకర్షగుణంగాను రూపొందింది. ఈ రచన మార్క్సియ భావనలో పురోగమన గమ్యానికి స్పష్టతను చేకూర్చింది.

# 8. శ్రీశ్రీ ప్రతిజ్ఞ - నిశ్చయ లక్ష్యం - బహూశ్లిష్ట (multiplex) విధం

ప్రతిజ్ఞ శ్రీశ్రీ మహాప్రస్థానంలో నిశ్చయమయిన లక్ష్యంతో స్పందించే సజీవ గీతం. శిఖరాయమాణమయిన గీతాల్లో ఒకటి. ఒక విధంగా అభిప్రాయ రూపానికీ ఆదర్శ గమ్యానికీ ప్రకటన రచనగానూ ఉంది. సామాజిక దార్శనికతను కలిగిందీ. మార్పు కోరే ఉద్దేశంతో శ్రామికలోకం సౌభాగ్య దిశను స్ఫుటంగా సూచిస్తూంది. ఇది మార్పు సామ్యవాద భావ స్ఫూర్తికీ సన్నిహితంగా వర్తిస్తూంది. యథార్థ జీవితంలో కష్ట జీవుల వ్యథనూ ఆర్తినీ చిత్రిస్తూంది. ప్రపంచంలో సౌభాగ్యానికి కారణమయిన మానవ "శ్రమ", విలువ కట్టరానిదీ. సమాజానికెంతగానో అవసరమయి,దీ. జీవితంలో సుస్థితికీ వికాసానికీ దారితీసేదీ. ఈ నేపథ్యంలో "ప్రతిజ్ఞ" నిర్దిష్టమయిన కార్యాన్ని నిర్వర్తించేందుకు నిశ్చయమైన ఆదర్శంపై దృఢతను ప్రకటిస్తూంది. ఇది కవి సామాజికమయిన మనో రూపానికి సంకేత,గా ఉంది. "పొలాలనన్నీ హలాల దున్నీ"తో మొదలయింది. వస్తు నిర్వహణం తటస్థ (objective) ధోరణిలో సాగింది. చివర "నా విరుతించే నా విరచించే"తో మలుపు తిరిగింది. "నవీన రీతి", "నవీన గీతి"కి ప్రాణంగా ప్రణవంగా రూపొందింది. భౌతిక మానసిక స్థాయిలో వ్యక్తిభావ (subjective) భూమికతో సమాహితమయిందీ. సామాజికంగా ఎదురయ్యే సమస్య గురించి వ్యవస్థలో మార్పు పరిష్కారంగా, లక్ష్యంలో లీనత (involvement) నూ నిబద్ధత (commitment) నూ భావింపజేస్తూంది. ప్రతిజ్ఞలో స్థిరమయిన నిశ్చయగుణం ఉంది. లక్ష్యంలో సమాజానికి ఉపకృతి మార్గాన్ని అవలంబించింది. సమస్య ఎదురయినప్పుడు నిందిస్తూ ఉండిపోవడం కాకుండా, మౌనాన్ని వహించడం కాకుండా తప్పించుకోవడం కాకుండా, నిలిచి ఎదుర్కొని పరిష్కారానికి ఉద్యమింపజేస్తూంది. ఈ గీతం 'ఔచితీవంతమయిన శీర్షికతో శ్రామిక జన వస్తువు కేంద్రంగా నిష్ఠుర మయిన నిజాల ఆలోకనంలో పరివర్తనకు అచంచల మయిన ప్రాతిపదిక అవుతూంది. ఇది అయిదు అంశాల మూల రేఖలతో నిర్మాణ రూపాన్ని పొందింది. 1) సమాజ సౌభాగ్యంకై నిరంతరం పరిశ్రమించే కర్షకుల కార్మికుల శ్రమ విలువల గుర్తింపూ.

2) శ్రమ జీవనంలో భౌతికమయిన కష్టాల్లో నష్టాల్లో అనుభవించే పేదరికం పీడనం మధ్య దయనీయమయిన స్థితి చిత్రణం. 3) విషాదమయిన స్థితుల్లో నిరాశా వాతావరణంలో ధైర్యంగా ఎదుర్కొనే ప్రగతి చేతన – దీని నుండి ఉద్భవించే విప్లవ నాదం. 4) పరివర్తనకు సంబంధించిన భావజాలానికి సమర్థకంగా శ్రామిక లోకం పక్షాన నిలిచిన కవి నుండి కర్తవ్య ప్రకటనం. 5) విశాలమయిన ప్రాతిపదికపై శ్రమ శక్తుల సమీకరణంలో సమస్త వృత్తుల్నీ కలుపుకొని సమాన ధర్మమూ సమాన న్యాయమూ గల మేలైన జీవితాన్ని ఆశించడం, భవిష్యత్తుకు పునాదిగా కార్యక్రమాన్ని నిలపడం కనిపిస్తాయి.

కవిత్వపరంగా శ్రమ జీవనం ప్రధానంగా ఉన్న వస్తువులో విలువ కట్టలేని సౌందర్యానుభవ దృష్టితో శ్రామిక జన హృదయ స్పందనతో ప్రగతికి ప్రాతినిధ్యం వహిస్తూంది. సమసమాజ దార్శనికతతో "నవీన రీతి"లో "నవీన గీతికి" ఆవిష్కారం జరిగింది.

## II

మానవ సహజమయిన ఉత్సాహ శక్తితో మట్టి నుండి బంగారాన్ని పిండే కర్షక వీరులూ గనిలో కార్ఖానాలో యంత్ర భూతాల కోరలు తోమే కార్మిక వీరులూ, తాము శుభ్రపరచే కోరలే, చాకిరీ చేయించుకున్నవే ఒక రోజున ఆయుధమయి బాధించవచ్చు. కర్షకులూ కార్మికులూ సంఘటితమయి ఇరువైపుల నుండీ శ్రమ శక్తికి ఏకాకృతినిస్తారు. ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తారు. ఈ సందర్భంలో దరిద్రంలో మ్రగ్గేవారూ దైన్యంలో క్రుంగేవారూ కనిపిస్తారు. 'ధనికస్వామి'కి దాస్యం చేసే దయనీయమయిన స్థితి చిత్రితమయింది. ఇది సమాజంలో నెలకొని ఉన్న నిష్ఠురమయిన నిజాన్ని ఎత్తి చూపుతూంది. ఎంతో శ్రమ నిధితో ప్రపంచాన్ని భాగ్యవంతం చేసే జీవితాలు "విలాపాగ్నులతో" విషాదాశ్రువులతో ప్రత్యక్షం కావడం బాధాకరమే. ధనస్వామ్య సమాజంలో ధనవంతుల విలాసవంతమయిన అవసరాలకూ, శ్రామికుల కనీసమైన అవసరాలకూ మధ్య అఖాతం పూడ్చరానిదిగా ఉంది. ఇరుపక్షాల సామాజిక సంబంధాల్లో సుగమత్వం కన్నా విషమత్వం ఎక్కువగా ఉంది. సమాజంలో అవసరాలకు శ్రామికుల నుండి పని తీసుకోవలసి ఉంటుంది. ఇది ఆర్థికమయిందే కాక మానవీయం కూడానూ, సామాజిక

ఆర్థిక ప్రయోజనాలతోపాటు లాభాలతోపాటు మానుషధర్మం దృష్ట్యా మానవతకు సంబంధించిన విలువల్నీ కాపాడవలసిన బాధ్యత కూడా ఉంది. దీన్ని విస్మరించడానికి వీలు లేదు. ఏ మనిషినీ, ఎటువంటి సంక్లిష్ట పరిస్థితులూ "విషాద తప్త" మయిన "విలాపమగ్న" మయిన జీవితానికి దారి తీయకూడదు. వీటికి తగిన విధంగా సరిఅయిన వ్యవస్థలో యంత్రాంగం కల్పించే అవకాశాలూ సౌకర్యాలతో చాలా భాగం నివారించవచ్చు. సామాజికమయిన యాథార్థ్యాన్ని పైకి తీసి "వ్యథార్థ జీవిత" రూపాన్ని కవితా వస్తువుగా మలచడంలో ప్రత్యేకత ఉంది. కఠోర మయిన వాస్తవాలతో భావజాలాన్ని పరిపుష్టం చేయడంలో విశిష్టత ఉంది. వాస్తవాల కనుగుణంగా సమ సమాజ దార్శనికతను నిశ్చలమయిన లక్ష్యంగా నిలపడంలో శ్రేష్ఠత ఉంది.

ఈ సమూహాల్లో అదృష్టం కలిసి రానివాళ్ళూ, ఏ అపరాథం లేకుండా శిక్ష అనుభవించేవాళ్ళూ, లోహ రాక్షసుల పద ఘట్టనలో నలిగి అణగిపోయేవాళ్ళూ, "శ్రమనిష్ఫలమయి పోయేవాళ్ళూ ఆకలితో అమటించేవాళ్ళూ సాహసంతో సమ్మెకు దిగేవాళ్ళూ!" ఇంకా ఎందరెందరో! బ్రతుకు నిష్ఠురమై ఆత్మహత్యకు పూనుకునేవారు! అనాథులూ! అభాగ్యులూ! అశాంతులు! వీరి ఆక్రందనంలో ఆరావంలో విప్లవ శంఖం వినిపిస్తుందనీ కవి విశ్వాసం! ఇందులో మార్పును కోరే బలమయిన అభిలాష వ్యంజితమవుతూంది. మానవ కల్పిత మయిన దుస్థితిని తొలగించే దిశలో దరిద్రాన్ని రూపుమాపీ దౌర్జన్యాన్ని లేకుండా చేసే బాధల్ని తొలగించే మార్గంపై ఆశ మానవ సహజం కూడా! ఈ ఆదర్శానికై తనలో కదలే నవ్య కవిత్వాన్ని "కార్మిక లోకపు కల్యాణానికీ" "శ్రామిక లోకపు సౌభాగ్యానికీ" అంకితం చేయడం, సాహిత్య చరిత్రలో అపూర్వమయిందీ. ఇదొక గొప్ప మలుపు! పై లోకంలో దేవతలపై నుండి దృష్టిని కష్టంలో నష్టంలో సానుభూతితో ఈ లోకంలో మానవుల పైకి మరలించడం జరిగింది. క్రియాత్మకతను ఆవిష్కరించడమూ జరిగింది. "జని నిష్ఠురం"గా భావించే దుర్భరమైన పరిస్థితుల్లో మానవ శక్తిపై అచంచలమైన విశ్వాసం కవిలో ప్రతిజ్ఞారూపాన్ని మానవీయమైన భావతేజంతో ప్రకాశింప జేస్తూంది. ఈ క్రమంలో కష్టజీవులకూ కర్మవీరులకూ న్యాయం కోసం కవి హృదయం ఆశావహమైన సృజన రూపాన్ని వరించింది. కర్షకులతోపాటు కార్మికులూ ఇంకా శరీర కష్టంతో బ్రతికే అన్ని వృత్తులవారూ వారి వారి పనిముట్ల సంకేతాలతో శ్రమసాధనామయమైన కొత్త ప్రపంచాన్ని కవిత్వంలో ప్రవేశపెట్టడం జరిగింది.

## III

ఈ గీతం అసాధారణమైన సంవిధానంతో నిబంధితమైంది. ఈ అభిప్రాయం సహేతుకమయిందీ. దీని నిర్మాణంలో శిల్పకళ చేతనే ఈ విధమైన ఆలోచనలకు దారి ఏర్పాడుతూంది. దీన్ని వివేచన చేస్తే స్థూలంగా మెదలే అంశాలు. 1) ప్రాస చలనం 2) యతి స్ఫూర్తి (సంస్కృతంలో వలె విరామం / విశ్రాంతి కలిగిందీ); (అప్పుడప్పుడూ ప్రాస మరియు యతి రెండూ కలిసీ), 3) ఆకర్షణీయమైన మాత్రా విభాగాలు (units) 4) సమభారంతోనూ సమాంతరంగానూ సమ గతితోనూ పద విన్యాసాలూ వాక్యరీతులూ విభాగ విభజన పద్ధతులూ సరికొత్త సౌందర్య కళను చేకూర్చాయి. రచనలో మొదటి నుండి చివరి వరకూ వివిధ భంగిమల్లో మాత్రాబద్ధమైన గతి విశేష రూపాలు నిర్మితమయినాయి. "ఇది పూర్వ ఉన్నదే కదా!" అనవచ్చు. కాని ఇందులో అట్లా లేదు. అపూర్వంగా ఉంది. ఎట్లాగంటే, రచనలో మొదటి నుండీ చివరిదాకా ఏదో నియతమైన విభాగ (units) పద్ధతిలో ఒక విధంగా లేదు. వరసగానూ లేదు. పంక్తి పంక్తికీ లేదా రెండేసి పంక్తులకూ మూడు నాలుగు పంక్తులకూ ఒక్కొక విధమైన గతి విశేషం భావ రూపాలకు వాహన సాధనాలుగా కనిపిస్తాయి.

1) ఆరంభంలో పొలాలనన్నీ / హలాలదున్నీ" ఇవి రెండు పంక్తులుగా ఉన్నాయి. నాలుగు నాలుగు మాత్రలలో ప్రాసను పాటించినవనీ. పంక్తుల్లో మొదటి పదం మెత్తదనం / సౌకుమార్యంతో ఆకర్షిస్తుంది. ఆ పదాల్లో రెండో అక్షరంలో ధైర్యం బ్రతుకులో బరువును అనుభూతికి తెస్తూంది. 2) వెంటనే మరో వాక్యం పైదానికి భిన్నమైన ఆకర్షణ రూపం కలిగింది. "ఇలా తలం పయి హేమం పిండగ" (3) దీని వెనకనే "ఘర్మ జలానికి ధర్మ జలానికి ఘర్మ జలానికి"; భంగిమ మారింది. 4 ప్లస్4 లేదా 3 ప్లస్ 3 ప్లస్ 2 మాత్రల పంపకంతో ఉంది. ఇలా ప్రతివాక్యాల్లో ఒక్కొక్క విధమైన భంగిమతో / విన్యాసంతో ఆకట్టుకోవడం జరిగింది. ఈ శ్లిష్టమయిన పద్ధతి పూర్వం లేదు. ఈ పద్ధతిలో భావానుగుణమైన శబ్ద గతి ఏ విషమత్వానికీ అవకాశం లేకుండా సుగమంగా ఆవేశస్థాయిని నిలుపుతూ క్షిప్రంగా సాగడం శ్రీశ్రీ ప్రత్యేకత. ఇది అపూర్వమయిందీ. మహాప్రస్థానంలో చాలా చోట్ల ఈ విధమైన బహుశ్లిష్ట (multiplex) సంవిధానం విశేషణకందుతుంది. స్వయం ప్రేరితమైన నిర్మాణ వ్యూహం రచనలో పరవశత్వాన్ని కలిగిస్తుంది. మొత్తం మీద అనియతమైందిగా కనిపిస్తూనే ఎక్కడికక్కడ నియమ గతిలో నిబద్ధం కావడంలో గతి విశేషాలు ఏ అశ్వక్రీడనో ఏ విమాన విన్యాసాన్నో ఏ యంత్ర ఖేలనాన్నో తలపిస్తాయి. ఈ

కారణం చేత కవిత్వం అనితర మార్గాన్ని భావింపజేస్తుంది. దీన్ని బహుశ్లిష్ట (multiplex) సంవిధాన కళగా నిర్ధారణ చేయవచ్చు.

ఈ గీతాన్ని సంవిధాన దృష్టితో చూస్తే 1) సమభారంతో సమ చలనంతో ప్రాసగతులూ 2) యతి స్ఫూర్తి – విరామయుతంగానూ 3) మాత్రల పంపకంలోవివిధ గతి భేదాలూ 4) అక్షరాల నిడివి, బరువు వాటి కలయికలో భేదాలతో గతి వైవిధ్యమూ 5) వాక్య విన్యాసాల, భంగిమల నిర్వహణ కౌశల్యం 6) భావనుగుణమైన ధ్వని (sound) చలన ప్రసారాలు 7) గీతం ఆరంభం నుండి చివరి వరకూ అనేకమైన పద్ధతుల్లో నడపడం 8) స్వయంప్రేరిత (Self - automation) మైన విధానాల్ని అవలంబించడం చేత, దీన్ని శ్లిష్ట (multiplex) సంవిధానంగా ఉల్లేఖించడానికి వీలవుతూంది. మొదటి నుండి చివరి వరకూ ఆవేశ స్థాయి రూపాల్ని కాపాడుతూ, ఎక్కడా విషమతకూ విచ్ఛిన్నతకూ తావులేకుండా గీతం నడిచింది. మహాప్రస్థానంలో ఎన్నో గీతాల్లో ఈ నిరంతర ప్రసార కళ అనుభూతమవుతుంది. ఇది ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన విషయం. చివరలో 'నవీన రీతి' 'నవీన గీతి' అన్న మాటలు సామాజికమైన దార్శనికతతోపాటుగా కొత్త సంవిధాన కళ గురించి ఆలోచింపజేస్తాయి. ఇది ఏదో అలవోకగా ఆవేశంలో వ్రాసిందికాదు. ఎంతో నిర్దుష్టంగా అంతర ప్రేరితమయిన నిర్మాణంతో స్తిమితత్వం / అవధానతతోపాటు పరిణతమైన శిల్పజ్ఞత కలిగిన కళాదృష్టితో ఆవిష్కృతమయింది. ప్రతిజ్ఞ ఆధునిక తెలుగు కవిత్వంలో 1. శ్రమ విలువను గుర్తించే వస్తువులతోనూ 2. ఇంత వరకూ తెలుగు సాహిత్య జగత్తులో ప్రతిపాదితం కాని శ్రమజీవన సౌందర్యంపై ఫోకస్‌తోనూ 3. సామాజిక వాస్తవికతతోపాటు సామ్యవాద భావలక్ష్యంగా దార్శనికత కలిగిన ఆదర్శంతోనూ 4. ఆకర్షణీయమైన బహుశ్లిష్ట (multiplex) సంవిధాన శిల్పంతోనూ 5. స్వయం ప్రేరితమైన కళాత్మక దృష్టితోనూ రచన అనితర మార్గంలో అజేయంగా నిలిచింది.

# 9. శ్రీశ్రీ దేశ చరిత్రలు - యథార్థ భూమిక

దేశ చరిత్రలు ఆధునిక తెలుగు కవిత్వంలో ఇంత వరకూ కనిపించనీ చూడనీ చరిత్రలో నిజం పయి వెలుగు ప్రసరించే కవిత. దీనికిదే సాటిగా ఉంది. వస్తువు సామాజికం. విషయం సాధారణ పరంపరా రూపానికి భిన్నమయింది, ఇందులో భావ ప్రకాశనం ఇంత వరకూ విస్మరించిన రూపాన్ని కొత్త విలువలతో దర్శింప జేస్తూంది. ఆలోచనలో 1) స్థితి వివేచనం 2) యథార్థ గవేషణం 3) నిజాల ఆవిష్కారం మెదలుతాయి. చీకట్లో కనిపించని వస్తువు విధంగా ఒక కోణంలో అడుగున పడినవీ మరచినవీ ఇంత వరకూ ఆలోచనకు రానివీ నిరాదరణకు గురి అయినవీ, సామాజిక సత్యాల్ని వెలుగు లోకి తేవడం జరిగింది. దీని వెనుక నుండి సమాజ దార్శనికత స్పష్టంగా గోచరిస్తుంది. ఇదొక ప్రత్యేకత. విషయంలో అభిప్రాయ భేదం ఉంది. ఇది వాదానికి తగిన పద్ధతిలో భావాంశాలు యోజితమయినాయి. ఇదొక అభివ్యక్తి విధం. విషయంలో అభిప్రాయ ప్రకాశనం వాద విధానంలో ఆకట్టుకుంటుంది. ఇదొక విశిష్టత. ఈ పద్ధతి కవిత్వ నిర్వచనానికి మరో గుణాన్ని చేరుస్తూంది. కవిత్వ పరిధిని పెంచుతూంది. ఇక దీని నిర్మాణంలో రచన మొదటి నుండీ చివరి వరకూ మాత్రా విభాగాల (4+4+4+2) లేదా (2+4+4+4)తో ఒక ఆవేశ స్థాయిలో వేగవంత మయిన గతి విశేషంతో ఆకర్షిస్తుంది. ఎవరి ప్రత్యేకత వారిది అయినా విషయానికి తగిన వాద రూపంతో గతి శీలమైన నిర్మాణం గురజాడ "దేశభక్తి" రచనా శ్రేణిలో చేరుతుంది. ఈ గీతంలోభావ గతమయిన అంశాల్లో ముఖ్యమయినవి. 1) చరిత్ర గతిలో బీభత్స రసం ప్రధానంగా నడచిన పరిస్థితులూ వాటి దయనీయ మయిన పర్యవసానాలూ. 2) రాజ్యకాంక్ష, మితిమీరిన బల ప్రయోగం, హింస చేత కలిగే విపరీత పరిణామాలూ. 3) చరిత్రకు "నిజ" మయిన అర్థాన్ని ప్రతిపాదించే సత్యాన్ని సామాజికంగా స్ఫురింపజేసే ఆలోచన. 4) మానవ వికాస ప్రస్థానంలో విజయాల్ని సాధించే స్థితుల్లో సామాన్య ప్రజలకు లభించే ప్రయోజనం. 5) ఈ దిశలో "యథార్థ" చర్చతో పాటు ఇంతవరకూ సాధించిన "పరమార్థం" గురించి ప్రశ్నకు జవాబుగా రావలసిన మార్పు గురించి ఆశాభావం, సమాలోచనాని కందుతాయి.

ఈ ప్రాతిపదిక పయి చరిత్రలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పనిచేసే సమాజ శక్తుల చలనం చిత్రితమయింది. పూర్వ నెలకొన్న కోణాల్ని తప్పించి, కొత్త కోణాల్లో సామాన్యుల జీవిత రూపం దర్శితమయింది. పరంపరగా వస్తూన్న కారణాల్నీ విశ్వాసాల్నీ నిర్ణయాల్నీ పక్కకు పెట్టి సాధారణ స్థాయిలో తమ తమ పనుల్లో ఉపకరించే పాత్రల పట్ల స్పందనంతోపాటు ఇంతవరకూ విస్మరించిన ఆయా వ్యక్తిత్వాల్ని గురించి గాఢమయిన సానుభూతి కనిపిస్తుంది. ఏదో ఒక భూభాగమో మత భావనో రాజ్య విస్తరణమో అధికార కాంక్షో విశ్వాస ప్రచారమో పేరుతో ప్రతి దేశంలో అహంకారం విజృంభించింది. స్వార్థం మొన తేలింది. "నరజాతి చరిత్ర సమస్తం పరస్పరాహరణోద్యోగం"గా పరిణమించింది. పరస్పర హననంతో సమాజం అనేకమైన బీభత్స దృశ్యాల్ని పొందింది. రక్త చిత్రమై వెలసింది. కన్నీటితో తడిసింది. బలవంతులూ హంతకులూ అధిపతులయినారు. ప్రసిద్ధి పొందారు. బలహీనులు బానిసలయినారు. ప్రతి దశ దశలోనూ దరిద్రం ఎక్కువ అవుతూనే ఉంది. ఒక కార్య సాధనలో ఎందరో వివిధ స్థాయిల్లో పని చేయవలసి ఉంటుంది. రణ సందర్భంలో వారి అకాల మరణంతో చిన్నా భిన్నమయిన సంసారాలూ బంధువుల హాహాకారాలూ ఆక్రందనలూ వినిపిస్తూనే ఉన్నాయి.

ఈ సన్నివేశాల్లో సామాజిక శక్తుల వెనుక నుండి పని చేసే మానవ మనస్తత్వ రూపాలూ ప్రసక్త మయినాయి. కేవలం భౌతికమయిన స్థితి స్థాయిల్లోనే కాక మానసికమైన స్థితి స్థాయిల్లోనూ కవి ఆలోచన గమనించదగింది. ఈ విషాద స్థితులకు మూల మయిన స్వార్థం ద్వేషం ఈర్ష్య స్పర్ధ కుటిలత నీతి బాహ్యంతో కూడిన మనో రూపాలు చరిత్రలో ఎన్నో మలుపులకు కారణ మయినాయి. విశాలమయిన ప్రాతిపదిక పయి మనుషులంతా ఒకటే అయినా అనుకున్నా సూక్ష్మ సూక్ష్మ గతుల్లో ఎన్నో భేదాలు అనుభవంలో గమనించవచ్చు. ఆలోచనలో ప్రవర్తనలో గమ్యంలో ప్రయోజనంలో సంబంధాల్లో వీటి మార్పుల్లో పరస్పర విరుద్ధ శక్తుల సంక్లిష్ట (complex) మయిన స్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఎన్నో విషమ పరిస్థితులు మధ్య విధ్వంసాలమధ్య శాంతి సహనం ప్రేమ కరుణ ఉదారత మొదలయినవి సుస్థితికి సహకరించిన సందర్భాలూ ఉన్నాయి. ఇవి మానవ వికాస భాగాలుగానూ నిలిచాయి. ఈ విషయం వేరు. ప్రస్తుత విషయ సందర్భంలో చరిత్రలో రణ చరణాలతో బల ప్రయోగంతో హింసకూ అణచివేతకు సంబంధించిన దృశ్యాలెన్నో! ఒక్కొక దాని వెనక పైకి కనిపించని అంశాలెన్నో! ఒక్కొక రహస్యమూ

దాగి ఉంటుంది. అన్వేషణం అవసరమవుతుంది. ఈ వ్యవస్థ వెనక జరిగిన విధ్వంసం ఏ పరిణామాలకు దారి తీసిందో అన్నిటినీ బహిర్గతం చేయవలసి ఉంటుంది. అప్పుడే "యథార్థం" అవగతమవుతుంది. ఒక్కొక్క దృశ్యంలో ప్రభుత కోసం "హంతకులు" దాటిన "కత్తుల వంతెన", క్రింద ఒరిగి పోయిన శరీరాలూ, పారిన రక్తమూ, ఒలికిన కన్నీరూ, ధ్వనించే ఆక్రందనలూ స్ఫూర్తికి వస్తాయి. ఈ భాగం రణ చరిత్రలో సమాజం పొందిన (ఒక విధంగా) శిథిలతనూ ప్రజల వ్యధనూ స్థితిలో మలుపునూ సూచిస్తూంది.

జీవిత గమనంలో "ఆకలీ" "ఆవేశం"తో ఒకవైపు నుండీ, ప్రభుతతో అణచి వేతతో మరో వైపు నుండీ సాగే శక్తులూ వాటి ఘర్షణలో నడిచిన చరిత్ర గురించీ స్పందనం, మార్చు భావ జాలంతో ఐక్యాన్ని పొందుతూంది. ఈ సందర్భంలో రణ మతుల "మోసం" బలవంతుల "దౌర్జన్యం" ధన వంతుల "పన్నాగం" ప్రసక్తమయింది. ఇంతకాలం సాగింది. ఇక సాగదనీ, చెల్లదనీ కవిలో విశ్వాసం.

"ఒక వ్యక్తిని మరొకవ్యక్తీ ఒక జాతిని మరొక జాతీ
పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇక పై చెల్లదు" ఇది భవిష్యత్తు పై ఆశా రూపాన్నీ భావింపజేస్తూంది. దేశం జాతి మతం వృత్తి భేదం లేకుండా సమస్త ప్రపంచంలోని అనాథులూ అభాగ్యులూ ఆర్తులూ పీడితులూ అంతా ఒకటే! చైనా అయినా జెకోస్లోవికియా అయినా ఇంగ్లండు అయినా ఐర్లండు అయినా భారతదేశమయినా! అమెరికా అయినా ఒకే స్వరం! ఒకే స్పందనం! మానవ వికాస చరిత్రలో శిథిలాలపయి కదలుతూ, "చీకటి కోణం"లో అడుగున బ్రతుకుతూ ఇంకా! ఎందరో! రచనలో చారిత్రక యథార్థ తత్త్వం (వివరణం వర్ణనం పట్టికలా కాకుండా) కేవలం కీలకమయిన అంశాల సూచనతో కవిత్వానికి అవసరమయిన స్థితి బిందువుల (points) తో ప్రకాశాన్ని పొందింది. దీన్ని తెలుసుకోడానికి, కనిపించే రూపానికి మరో వైపున ఉన్న కోణంపై దృష్టిని ప్రసరించవలసిన అవసరమూ ఉంది. మహా నదుల మైదానాల నాగరకతల్లో మహా నిర్మాణాల్లో మహా కార్యాల్లో పని చేసిన క్రింది స్థాయి శ్రామికుల్ని గురించీ, "దండయాత్ర'లో రాజకీయ చర్యల్లో సాహసం ప్రదర్శించిన వీరుల్ని గురించీ ప్రభువు "పల్లకి మోసే" బోయీల్ని గురించీ అనివార్య మయిన సమాజ చలన శక్తి భాగాల్నీ జ్ఞాపకం చేయడం జరిగింది. వారి అవసరాన్నీ గుర్తించడమూ కనిపిస్తుంది. చీకటి కోణంలోనే అడుగునపడి ఉన్నవారిపై వెలుగును ప్రసరించడమే కవి అభిప్రాయం.

ఆది మానవ గుహాలోకనం నుండీ "చారిత్రక విభాత సంధ్య"ల్లో మానవ కథ వికాసంలో ప్రముఖమయిన పాత్ర వహించిన శిల్పం! సాహిత్యం! శాస్త్రం! సంగీతం! సంస్కృతి ఎంత వరకు ఉపయోగించాయనే ప్రశ్న! కూడా ఉంది. ఇవి సాధించిన పరమార్థం గురించి కవిలో ఆలోచన చెలరేగింది. ఈ ప్రశ్న ఎప్పటికీ మిగిలి ఉంటుంది, ఉండేదీ. ఇప్పుడు జరగవలసిందీ చీకటి కోణంలో అడుగున పడి ఉన్న వారిపయి వెలుగును ప్రసరించి పైకి అవతరింప జేయడం! మానవులంతా ఒకటిగా చరిత్రలో నిజమయిన వికాసానికి గర్వ కారణంగా ప్రకాశింపజేయడమే. చరిత్రలో 'యథార్థ' దృశ్యంతో చైతన్యశీల మయిందీ 'దేశ చరిత్రలు', శ్రీశ్రీలో సమాజ స్థితి పట్ల వెలుగు రూపాన్ని ఆవిష్కరిస్తూంది. ఆధునిక కవిత్వంలో కొత్త పార్శ్వాని (facet) కి ప్రాతినిధ్యం వహిస్తుంది.

# 10. సంపరివర్తన (transformation) రూపం

## కవితా! ఓ కవితా!

కవికి ఇష్టమయిందీ, కవిత్వ జగత్తులో సహృదయుల దృష్టిలో విశిష్టమయిందీ, శ్రీశ్రీ మహా ప్రస్థానంలో దీర్ఘకవిత "కవితా! ఓ కవితా!". ఇందులో కవి దృష్టిలో ఒక దశ నుండి మరో దశకు మానసికంగా సంపరివర్తన (transformation) ను గుర్తించడమే ముఖ్యోద్దేశం. ఈ ప్రక్రియలో ప్రధానంగా 1) కాల్పనికం నుండి సామాజిక వాస్తవం, 2) కళానుభూతి ప్రాధాన్యం నుండి సామాన్య జనహిత కాంక్ష, 3) పరంపరగా వచ్చే నియమ నిబంధనల నుండి ముక్తమైన స్వతంత్ర స్థితి, 4) పీడితుల దుఃఖితుల వంచితుల నిర్భాగ్యుల పట్ల సానుభూతి, కరుణతో కూడిన సంపరివర్తన గుణంతో మానవతా రూపం విశ్లేషణ కందుతాయి. రచన 'కవితా! ఓ కవితా!', మూర్తమైన రూప సంబోధనతో మొదలవుతుంది. భావానుబంధంలో సరస్వతి స్ఫూర్తికి వస్తుంది. శక్తి రూపాల్లో మొదటిది బ్రాహ్మి. ఇది సంకల్ప స్థాయిలో సరస్వతిగా రూపొందుతుంది. ఈ గీతంలో సృజనకు బదులు సర్గ అనీ, క్రియాశక్తికి బదులు చైతన్యం అనీ, విరాట్ బదులు విశ్వం అనీ రూపాంతరాల్ని పొందాయి. సృజనలో వ్యక్తి అనుభూతి స్థాయి నుండి సమాజ హిత స్థాయికి వస్తువు సంపరివర్తనం చెందింది. కవి భావనలో తాత్త్విక స్పర్శనూ గమనించవచ్చు. ఇది కవి సంపూర్ణ వ్యక్తిత్వంలో భాగంగా ఉంది.

ఒకప్పుడు కవిలో కవితా రూపం ఆకాశంలో సుందరమయిన రథంలో అందని అందంగా విహరించింది. ఇది కాల్పనికమయింది. కవిత కయి ఒక తపస్సులో జీవితంలో మానసికంగా అన్వేషణ సాగింది. ఎటు చూచినా 'చటుల'మైన అలంకారాల్లో 'మటు మాయల' 'నటన'ల్లో నిజ రూపం కనిపించలేదు. దీన్ని దర్శించడానికి కవి తపన పడిన రోజులూ ఉన్నాయి. అది ఒక అందీ అందని స్థితి. దీక్షతో సాగే కవి మానసికమయిన తపస్సులో నిశ్చలమయిన సమాధి దశలో సంపరివర్తన (transformation) సంకేతాలందాయి. అప్పుడు "స్వర్గ ద్వారానికి" తోరణమయి వ్రేలే మస్తిష్కంలో కొత్త దృశ్యాలు కనిపించాయి. ఇవి సంపరివర్తన ప్రభావ రూపాలు. కల్పనా జగత్తును వీడినవి. వాస్తవ జీవిత ఖండాలు. ప్రచండమయిన ఝంఝా ప్రభంజనాన్ని గజగజ లాడించే

సముద్రపు కెరటాల్లో "మ్రోగే శంఖారావం ఢంకా ధ్వానం" వినిపించింది. ఇది కవిలో ఆకారం పొందే విప్లవానికి వాతావరణాన్ని నిర్మిస్తూంది. ఈ సందర్భంలో ప్రకృతినీ మానవేతర ప్రాణి కోటినీ స్పృశిస్తూ మానవ సమాజంలో మార్పుకు సంకేతా లందింపబడినాయి. ఇందులో వస్తు పరిధి విస్తరింపబడింది. నానా జంతు ధ్వనులూ, వెనువెంటనే భూకంపం! ప్రభుత్వ పతనం! విప్లవం! యుద్ధం! అన్నీ "విశ్వరూప సాక్షాత్కారం"గా ప్రకృతి నుండి సమాజం దాకా అంచెలు అంచెలుగా పరిస్థితులు మార్పుకయి బహువేగాన్ని అందుకున్నాయి. సమాజ పరమయిన మార్పు ఇంకా సముద్రం ప్రతీకలోనూ నిహితమయింది. ఈ విశేషమైన భూమికలో చైతన్య శీలమయిన మార్పును కోరే కవితను స్మరిస్తే కనిపించే దృశ్యాలు చిత్రితమయినాయి. "అగ్ని సరస్సున వికసించిన వజ్రం!" "ఎగిరే లోహశ్యేనం!" మొదలయినవి. ఈ భావ రూపాల్లో అర్థచ్ఛాయలు సహృదయుల భావనా ప్రసార శక్తిని బట్టి అనుభవానికి వస్తాయి. రచనలో వేగవంతమయిన గతి విశేషం ఉంది. అభివ్యక్తిలో నవ్యమైన ఆకర్షణ ఉంది. ఇది సంవిధాన సుందరమయింది. రచనతో తాదాత్మ్యం కలుగుతుంది. పూర్వం అందీ అందని ప్రభావ రూపం స్పష్టంగా అందే స్థితికి చేరుతూంది. ఇది సంపరివర్తనంలో భాగమయింది. ఇక భావరూప రామణీయకతకు వస్తే – అగ్ని చైతన్యానికి ప్రతీక. అగ్ని సరస్సు అంటే చైతన్య వంతమయిన సమాజం. సరస్సులో పద్మం ప్రభవిస్తుంది. కాని వజ్రం ఎలా సాధ్యం! అంటే కవిత్వంలో సాధ్యమే. ఈ సరస్సులో జలం బదులు అగ్ని ఉంది. వజ్రం ఇక్కడ చైతన్యం పొందిన సమాజపరంగా విలువైందీ వాడనిదీ రాలనిదీ ప్రకాశమాన శక్తిని సూచిస్తూంది. పూవు వాడిపోతుంది, రాలిపోతుంది, జీవితమూ కొంత కాలమే! వజ్రం అట్లా కాదు. చిరమయిందీ, కాల ప్రభావానికి తట్టుకొని నిలిచేదీ, స్థిరమయిందీ. ప్రకాశమాన రూపం కలిగిందీ. కవిలో పరివర్తనకు చెందిన ఆదర్శం – వజ్ర రూపాన్ని పొందింది. మరో విధంగా చైతన్యం పొందిన సమాజంలో అవతరించే స్థిరమైన వ్యక్తి రూపాన్నీ భావింపజేస్తూంది. ఇంకో విధంగా అగ్ని సరస్సు పట్టపగలునూ, (చైతన్య రూపాన్ని) వికసించిన వజ్రం పరిణతమయిన సూర్యుణ్ణీ (విప్లవ తేజాన్నీ) సూచిస్తాయి. ఈ భావ రూపాలు మార్పుకు దోహదం చేసేవిగా సహృదయుల ఆలోచనలో సుముచితమయిన అర్థాంతరాల్ని పొందడం సహజం. ఎగిరే లోహ శ్యేనం – యాంత్రిక యుగంలో విజ్ఞాన శాస్త్ర ప్రభావంతో సిద్ధించింది. లోహ నిర్మితమయింది. ఇది భౌతిక శక్తి ప్రయోజనాన్నీ, విమాన రూపంలో ఆకాశాన్ని వశం చేసుకునే మానవ సంకల్పాన్నీ ప్రదర్శిస్తూంది. భౌతిక సంపదతో మానవ విజయాన్ని సూచించడం కవి ఉద్దేశం.

కవి దృష్టిలో సంపరివర్తన స్థితికి చెందినవీ, కవితావేశంలో ఆవేదన సానుభూతి కలిగిన దృశ్యాలు వరసగా చిత్రిత మయినాయి. నడి రాత్రి "ఎదకు శిశువును" హత్తుకొన్న బాలెంతరాలు, వైద్యశాలలో "కన్ను మూసిన" రోగార్తుడూ, కాలువలో "జారి పడిన" తాగుబోతు, 'బాధల పాటల పల్లవిలో పదుపు కత్తె' – స్థితి గతులూ, యథార్థ జీవితంలో కఠోర స్థితుల చిత్రణం కవిలో కాల్పనికం నుండి వాస్తవానికి సంపరివర్తనాన్ని సూచిస్తూంది. మరో వరసలో "సమ్మె కట్టిన కూలీల, కూలీల భార్యల బిడ్డల" హాహాకారాలు, ఆర్తారావాలు శ్రామికజన దీనగాధను వినిపిస్తాయి. వ్యక్తులు ఎదుర్కొనే సమస్యల్లో సంబంధాన్ని స్థాపించి, కవితను దర్శించడం ఇందులో ప్రత్యేకత ఉంది. మొదట్లో అందీ అందనిది ఇప్పుడు వాస్తవ తలంపై అందినట్లవుతూంది. సంపరివర్తనంతో పొందిన మలుపు కవిలో సామాజిక నిబద్ధతను దృఢతరం చేస్తూంది. మరవబడిన, తిరస్కరింపబడిన జీవితాన్ని భావింపజేస్తూంది.

సృజన క్రియలో సహజమయిన ఆలోచనా గమనాన్ని అరికట్టే పద్ధతుల్ని నిరసించడం జరిగింది. స్వేచ్ఛను నిరాకరించే నిబంధనల్ని తిరస్కరించడం జరిగింది. ఇది కవి భావనలో సంపరివర్తన స్థితిలో పూర్ణతను చేకూరుస్తూంది. "శ్మశానాల వంటి నిఘంటువులు" దాటి "ఛందస్సుల సర్ప పరిష్వంగం" వదలి వడివడిగా కన్నవీ విన్నవీ కవితా రూపాన్ని పొందాయి. ఇవి తరచుగా ఉదాహరింపబడేవి. ఒకటి నిఘంటువు, రెండోది వ్యాకరణం, మూడోది ఛందస్సుకూ సంబంధించినవీ. నిఘంటువు భాషలో శబ్దానికి అర్థాన్నీ, వ్యుత్పత్తినీ, ప్రయోగాన్నీ, ఇతర విశేషాన్నీ ఒక్కొక్క పద్ధతిలో సూచిస్తుంది. ఇష్టపడే వాళ్ళూ అవసరమనుకునే వాళ్ళూ సంప్రదించడానికి ఉపకరిస్తుంది. దీన్ని శ్మశానంతోపోల్చడం కవిత్వంలో వాడుకలో లేని, సజీవం కాని పదాలకు సంబంధించిన అవసరం లేని స్థితిని చూపడమే కవి ఉద్దేశ్యం. భాషను వ్యాకరించేది వ్యాకరణం. పూర్వ వ్యాకరణమూ నిబద్ధత పేరుతో కవిత్వంలో ఏర్పడే కృత్రిమతనూ క్లిష్టతనూ పరిహరించడమే కవి అభిప్రాయం. ఇక ఛందస్సు. సృజన సమయంలో ఇది కవి స్వేచ్ఛను హరించేదిగానూ ఆటంకంగానూ ఉండకూడదనే కవి ఆంతర్యం. ఈ మూడు అంశాలూ కవిలో స్వతంత్రమయిన అభినివేశాన్ని భావింపజేస్తాయి. ఆయా విషయాల్ని వివేచనతో చూడవలసిన దృష్టినీ అవసరాన్నీ తలపింపజేస్తాయి.

ఇక కవిలో తాత్త్విక స్పృహ అంతర మయింది, ప్రకాశ రేఖల్ని పొందింది. పంచేంద్రియాలు మేల్కొన్న స్థితిలో ఆనందవశమయిన దశలో సుఖానికీ దుఃఖానికీ అతీత మయిన మనో రూపం కవులకు సంకల్ప రచనా సందర్భాల్లో సహజమయింది దృష్టికి వస్తుంది. ఇక్కడ కవి మాటల్లో "అమోఘమైందీ అమేయమైందీ, అచింత్యమైందీ ఏకైక మయిందీ దివ్యానుభవం" బ్రహ్మానుభవంలో కరగిపోయే లక్షణం అనుభూతి సాంద్రతనూ పారవశ్య స్థితినీ పొందింది. జనని గర్భంలో పిండోత్పత్తి దశలో రూపొందే ఆకారంతో, భూమిపైకి వచ్చి ఇక్కడ పొందే కష్ట సుఖాల జీవితం వర్ణితమయింది. బాహ్యలోకానికి సంబంధించిన ప్రత్యక్షమయిన అనుభవ దృశ్యాలతో సంపన్నమయింది. ప్రపంచ పరిణామంలో అభయ ముద్రతో ప్రత్యక్షమయిన రూపం కవితాకృతిని పొందింది. ఇది భావాను బంధం చేత సరస్వతిని స్ఫూర్తికి తెస్తుంది. ఇది తాత్త్విక స్పర్శ పొందిన సంపరివర్తన భాగం. కారుణ్య భావంతో విలసిల్లింది. రస విషయంలో కరుణం వైపు మొగ్గు కనిపిస్తుంది. ఇది పీడితుల పట్ల అభిమానానికీ వారి సమస్యల పట్ల అవగాహనకూ, వారి దుస్థితి పయి సానుభూతికీ, పరిష్కారమార్గం గురించి చింతనకూ దారి తీసింది. ఈ సంపరివర్తనం ఫలితంగా సిద్ధించిన తన రచనలో "లోకం ప్రతిఫలించాలనీ" "తపస్సు ఫలించాలనీ", తన జాతి జనులు "పాడుకొనే మంత్రం"లా మ్రోగాలనీ తన ఆదర్శాలు "సోదరులంతా పంచుకునే" వెలుగులు కావాలనీ సమాజానికి హృద్యంగా నైవేద్యంగా సమర్పితం కావాలనీ కవి ఆకాంక్ష.

ఈ గీతం సంప్రదాయ ఛందోమార్గానికి భిన్నమయిన సంవిధాన నిర్మాణ గుణంతో స్వేచ్ఛా కవిత్వ (ఫ్రీ వెర్స్) ప్రక్రియలో ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. ఆకర్షణీయమైన గతి విశేషంతో స్వతంత్రమయిన అభివ్యక్తి కళతో స్వేచ్ఛా కవిత్వానికి పరమాకర్షణ రూపాన్నిస్తుంది. మరో విధంగా కాల్పనికం నుండి వాస్తవానికీ, వ్యక్తి అనుభూతి నుండి సమాజ ప్రయోజనానికీ, భావ జగత్తు నుండి కఠోర వాస్తవ జీవితానికీ సంపరివర్తన రూపాన్ని గుర్తించడం వల్ల కవిలో మార్పుకు సంబంధించిన వ్యక్తిత్వం సమాలోచనానికి బాగా అందుతుంది. మహాప్రస్థానంలో పలు సంపరివర్తన దశల్లో ఆధునిక చేతనకు ప్రాతినిధ్యం వహించే ప్రముఖమైన గీతాల్లో ఒకటి, "కవితా ఓ కవితా"!, అనితరమయిందీ.

# 11. రథ చక్రాలు - గతి వేగం

'మహాప్రస్థానం' గీతాల సంపుటిలో అంకితం వదిలేస్తే చివరది జగన్నాథ రథ చక్రాలు. ఇది ఉద్రేక సంరభంలో ఉత్కంఠను నిలుపుతూ ఊపిరి తీసుకోడానికి కూడా సమయంలేని వేగంతో అంచెలు అంచెలుగా గతి రూపం కలిగిన శిల్పఖండం. మధ్య మధ్య స్వల్ప విరామం ఉన్నట్లు కనిపిస్తుంది కాని, ఇది ఆ తరువాత వచ్చే దాన్ని సత్వరం ఆపేక్షించే అందుకునే భావచలనంతో ఆకర్షిస్తుంది. ఇందులో భావసూత్రం సామ్యవాద సమాజాన్ని లక్షించే ప్రగతిరూపం. ఈ విధంగా శిల్ప విధానంతో ప్రగతి భావనతో సమస్థితిని పొందింది. ఆరంభం నుండి సమాప్తి వరకు గీతంలో ఆవేశ స్థాయి నిలుపబడింది. శబ్ద శక్తి ప్రసారం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. శ్రీశ్రీ రచనల్లో సామ్యవాద ప్రగతి తత్త్వంతో కవితా శిల్పం శిఖరాల్ని అందుకున్న వాటిలో ముఖ్యమైంది. ఇందులో భావధార తరుముకొని వస్తుంది. ఈ విశిష్టత సామ్యవాద కవిత్వానికి విశేషమైన ఖ్యాతిని ఆర్జించి పెట్టడమే కాక గౌరవ స్థానాన్ని కలిగించింది. అభ్యుదయ కవిత్వ లక్ష్యంగాను సాహిత్య చరిత్రలో రూఢమైంది.

"జగన్నాథుని రథం" – పురాభావ (ఆర్కిటైప్) ప్రతీక. విప్లవ భావానికి సంకేతంగా ప్రయుక్తమైంది. జగన్నాథ రథ చక్రాలనగానే సాధారణంగా మనస్సులో మెదిలేది, పూరి జగన్నాథస్వామి రథోత్సవం. ప్రజలంతా తలా ఒక చేయి వేస్తారు. తాళ్ళతో లాగుతూ రథాన్ని లక్ష్యానికి చేర్చడంతో పర్యాప్తమైంది. ఇది ఎంతో కృషీ, పట్టుదల అంకితభావంతో ఎక్కడెక్కడి నుండో సమీకృతమైన మహాప్రజ! ఆప్రయత్నరూపంగా కనిపిస్తుంది. ఇది ఏ బేధభావాలు లేకుండా ఒక మహాకార్యంలో పాల్గొనే జన సందోహంలోని ఉత్సాహశక్తికి కార్యదీక్షకూ ఉత్తమ లక్ష్యానికి ప్రతీక.

ఆధునిక యుగంలో ఈ జగతికి నాథుడు దైవం కాదు, ఏ ప్రభువూ కాదు. మహాప్రజయే. ఈ ప్రజారూపమే సమాజం. ఈ రథగమనం సామాన్య ప్రజల మార్పును కోరేది! ఆ ప్రయత్న రూపాన్ని భావింపజేసేదీ. ఇది విప్లవోపేతమైంది. సామ్యవాద లక్షితమైంది. సామాన్యుడు భాగస్వామి – నడిపేదీ సామాన్యుడే. ఈ రథం సామ్యవాద విప్లవభావ రూపమైంది. దాని చక్రాలు పరివర్తన శీలంగలవి. దీనికి నాథుడు భావ సంకేత మూర్తీభవించిన మహాజనం రథాన్ని ముందుకు నడిపించే బాధ్యతను స్వీకరించిన మహాప్రజ!

ఈ సందర్భంలో వర్తమాన సమాజ జగతికి నాథత్వాన్ని పొందిన మహాప్రజ రథం “మెయిలు దారిన బయలు” దేరింది. దీన్ని భూమార్గం పట్టించే ప్రయత్నమూ సఫలత్వంలో అశాదృశ్యం చిత్రితమైంది. ఇదీ గీతంలో నిబిడమైన, అంతరమైన భావ నిర్మాణ సూత్రం. మెయిలుదారి అంటే ఆకాశం. ఇది కాల్పనిక జగత్తుకూ, (దైవ లోకానికీ) ప్రతీక, ఇక్కడి నుండి భూమార్గానికి పట్టించే ప్రయత్నం కనిపిస్తుంది. అంటే కవిత్వంలో కాల్పనిక (దైవ) జగత్తు నుండి మారుతున్న స్థితి సూచితం. ఇది సామ్యవాదయుతమైంది. కల్పన ఎన్నటికీ అందనిదీ ఆదర్శంతో కూడింది. ఇంతవరకూ జరిగినకథ దీనికి సంబంధించింది. ఇక ముందు జరుగబోయేది దీనికి భిన్నమైంది. వాస్తవోపేతమైందన్న మాట. ఇది సామాజికమైందీ. సమాజంలో అదీ పతితులకూ, దీనులకూ, హీనులకూ, కూడులేని, గూడులేని పక్షులకూ, భిక్షులకూ సంబంధించింది. అట్టడుగునపడియున్న వారిపై దృష్టిని ప్రసరింపజేసేది. “పతితులార! భ్రష్టులార! బాధా సర్పదష్టులార!” అని ఆరంభమైన గీతం సంబోధనాత్మకమైంది. ఆత్మీయతను వెలారుస్తుంది. ఇది మొదటి దశ. వీళ్ళు “శని దేవత రథ చక్రపు టిరుసుల్లో పడి నలిగిన”వాళ్ళు. శని కష్టాలకూ నష్టాలకూ కారకుడన్న విశ్వాసం ఉంది. ప్రజల్లో ఉన్న ఈ నమ్మకంపై నిర్మితమైందీ భావం. ఆ తరువాత మంచి జరుగుతుంది. రథగమనంలో ఒక దాని తరువాత మరొక ఇరుసు క్రమిస్తుంది. ఈ రథ చక్ర పరిక్రమణంలో పడిపోయిన బ్రతుకులంటే! సామాజిక పీడనలో నలిగిపోయిన, చితికిపోయిన వన్నమాట. వీరే సమాజంలో పీడితులూ! తిరస్కృతులూ! బహిష్కృతులూ! పరిచ్యుతులూ! వీళ్ళను స్వాంతనపరచే దశ రెండోది. “ఏడవకండి! ఏడవకండి!” అని, సానుభూతితో కరుణాత్మకమైన భావనతో కూడిందీ. దీని తరువాత వచ్చే మూడో దశలో బాధా సర్పదష్టులకొక ఆశారూపం ఆవిష్కృతమైంది. అదే జగన్నాథ (అంటే ప్రజా) రథ చక్రాల ఆగమనం! ఇది భూమార్గం పట్టడంగా ఉంది. వాస్తవమైన స్థితికి చెందిందీ, జన హితమయమైందీ. “వస్తున్నాయొస్తున్నాయ్ జగన్నాథ రథ చక్రాల్! భూమార్గం పట్టిస్తాను భూకంపం పుట్టిస్తాను” ప్రయత్న పూర్వకమయిన విప్లవ చేతనలో కవి సమైక్యం పొందడంతో పీడిత పక్షం వహించే మానసిక స్థితి వ్యంజితమౌతూంది. ఇందుతో పీడితుల కాశ్వాసం ఉంది. విప్లవ పథ నిర్దేశం ఉంది. ప్రజల నిస్సహాయతను పోగొట్టి ధైర్యాన్ని కలిగించే మానసికమైన ప్రేరణ యోజితమైంది. ఈ గీతంలో ప్రజల కోసం పోరాటానికి కవిత్వమొక సాధనంగా అవలంబించిన ప్రయోజన రూపం దృష్టికి వస్తుంది.

మహాప్రజ అధినేతగా కలిగిన సమాజ రథ వేగానికి “సింహాచలం కదిలింది, హిమాచలం కరిగింది, వింధ్యాచలం మొదలైనవి ఎగిరిఎగిరి పడుతున్నాయి, ఎంతో కాలంగా స్థిరంగా ఉన్నవి, ఇక చలనం లేదనుకున్నవి కదలిపోతున్నాయి. పట్టుతప్పిపోతున్నాయి. వినాశన స్థితిని పొందుతున్నాయి. ఇది పాత వ్యవస్థ తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి నిదర్శనంగా ఉంది. ప్రజా రథగమనంలో, విప్లవ ప్రభావం చైతన్య బంధురంగా చిత్రితమైంది. రథం వచ్చే ముందు ఉన్న స్థితి అంతా చీకటి! దుఃఖం! నిరాశ! దగాపడిన తమ్ములూ! వాళ్ళ బాధలూ! ఇంతవరకూ ఆకాశ మార్గాన వెళ్ళే రథం భూమార్గం పట్టడంతో వీళ్ళ సమస్యల్ని గుర్తించే పరిష్కరించే వాస్తవరూపం ఆరంభమయింది. ఇంతవరకు కాల్పనిక జగత్తులో ఉన్న భావజాలం, భౌతికతలంపైకీ వాస్తవ జగుత్తలోకీ క్రమింపజేయడమే ఈ విశేషపరివర్తనం. ఉద్దేశం సామ్యవాద సాధనలో విప్లవభావోపేతమైంది. ఆచరణయుతమైందీ.

మరో దశ రథం భూమార్గం పట్టడంతో ఉత్పన్నమైన స్థితిలో సంఘర్షణతో భూకంపం పుట్టినంత పని జరిగింది శివుని మూడో నేత్రం పగిలి అగ్ని విస్ఫోటం జరిగినంత పని అయింది. ఈ పురాభావాలన్నీ ప్రకృత విప్లవస్థితిని ప్రభావోపేతంగా ప్రస్ఫుటీకరించేందుకే తోడ్పడుతున్నాయి. విలయరూపం సమాజంలో విప్లవ శక్తుల సమరస్థితిని వ్యంజింపజేస్తోంది. అటో ఇటో తేలే స్థితికై విప్లవాచరణంలో శిఖర స్థితిని చేరేందుకు సర్వశక్తులు సన్నద్ధం కావడం సూచితం. ఎటు చూచినా ప్రజా సంరంభం! ఇది మార్పు అవసరాన్నీ, అమేయమైన ప్రజల ప్రమేయాన్నీ విజయరూపాన్నీ సూచిస్తోంది. మొయిలుదారి భావవాదాన్నీ, భూమార్గం యథార్థమైన భౌతిక వాదాన్నీ సూచిస్తాయి. ప్రకృతి శక్తులతోపాటు మానవ శక్తులూ కలిసిన సంస్థితి స్ఫుటంగా కనిపిస్తుంది. ఇది సామాజిక పరిణామ రూపంలో భాగంగా నిర్మితమయింది. ఇది ఆర్థిక వ్యత్యాసాల్ని తుడిచిపెట్టి, అసమానతల్ని రూపుమాపేది. సమాజ స్థితికి ఆర్థికతలం ఆధారం, రాజకీయ సామాజిక కళాసాహిత్యాల పోకడలు ఆర్థిక వ్యవస్థను బట్టే ఉంటాయి. వీటిలో సమూలంగా మార్పువస్తే తప్ప ప్రజల జీవితంలో గుణాత్మకమైన మార్పుకు అవకాశం లేదు. సమాజ సంపదను ప్రజాయత్తం చేయడమొక్కటే శరణ్యం. దీనికి సంఘర్షణ అనివార్యమౌతుంది. ఈ గీతంలో జగన్నాథ రథ గమనం ప్రజాపరమైందీ. వాళ్ళ ఆశయాల సాధనామయమైందీ.

వర్గచైతన్యం, ముఖ్యంగా ప్రజల్లో సామ్యవాద పరిజ్ఞానంతోను అనుభవం వల్లనూ సమస్యల పరిశీలన వల్లనూ ఏర్పడుతుంది. ఇది పీడిత తాడిత వర్గంలో విప్లవభావానికీ,

విప్లవాచరణకు, దారితీస్తుంది. ఇక్కడ దైవశక్తులకన్నా మానవశక్తులకే ప్రాధాన్యం. మానవునిపైన మానవశక్తిపైన ఆశ, విశ్వాసం, ఆచరణం, విజయం మొదలుగా ప్రజల ప్రమేయాన్నీ, కార్యశక్తినీ, సమరరూపాన్నీ ఆవిష్కరిస్తూంది గీతం.

ఈ విజయావిష్కారం సులభమైంది కాదు! ఇది "మరఫిరంగి! టార్పిడో! టార్నాడో!" అని యుద్ధ వాతావరణ వస్తుజాలంతో చిత్రమైంది. ఇందులో మార్క్సిజంలోని కార్యాచరణ విప్లవ సంకేతాలు పరంపరగా కనిపిస్తాయి. దీన్ని కవి ఆవేశంతో, ఉద్రేకంతో, శిఖరస్థాయిలో నిలిపి వేగాన్ని సాధించడం జరిగింది. విధ్వంసన చణమైన సంఘర్షణతో కోలాహలం నుండి హాలహలంతో అంతా పొగచూరినట్లుంది. ఇదో సముద్ర మథనం వలె ఉంది! మొదట హాలహలం ఆ తర్వాత వచ్చేది అమృతం అదే సామ్యవాద సమాజ విజయం. ఇది ప్రజా వ్యతిరేకుల్ని తూలగొట్టేదీ అసమానతల్ని తుడిచిపెట్టేదీ.

చివరి దశ, జనచైతన్యంతో వచ్చిన విప్లవ పర్యవసానంగా సామాన్యుని స్వాతంత్ర్యంతోపాటు ప్రజల్లో సమభావం. సౌభ్రాత్రం, సౌహార్దం సిద్ధింపజేసేది. ఈ భావ స్థానాలు పునాదిగా కొత్త వ్యవస్థ ఆవిర్భావం ఈ గీతంలో లక్షితమైంది. దేవుని స్థానంలోనూ రాజుస్థానంలోనూ నెలకొన్న ప్రజారూపం అంటే సమాజమే ఈ జగన్నాథ రథం! సమాజంలో విప్లవ చర్యయే రథ గమనం! ప్రయాణ లక్ష్యం సామ్యవాదం! అంతటా "శాంతి! కాంతి!" సామ్యవాద స్వప్నం నిజమౌతుందని శ్రామిక రాజ్యం ఋజువౌతుందని! కవి సంకల్పం! "రారండో రండి రండి! ఈ లోకం మీదేనండి మీ రాజ్యం మీరేలండి" అన్న ఆశాస్ఫూర్తితో "జగన్నాథ రథ చక్రాలు" ఆధునిక కవిత్వంలో ప్రగతి శక్తులు కలిసీ సమాజపరంగా లక్ష్యంతో మార్క్స్ విప్లవభావంతో నిండింది. సామ్యవాద గమ్యాన్ని ఉద్దేశించిన మార్గానికి ఆదర్శరూపమే కాదు, నవ్యయుగానికి ఆరంభ శిఖరమైన కవితా రూపాన్ని పొందింది.

# 12. అభ్యుదయ పథం

శ్రీశ్రీ ఆరంభించిన నవ్య మార్గం గురజాడ ప్రగతి వారసత్వాన్ని అందుకుంది. ఆ తరువాత అభ్యుదయ కవిత్వంగానూ స్థిరపడింది. మహాప్రస్థానం కవితా సంపుటి తెలుగు సాహిత్యంలో అంతర్జాతీయ సామ్యవాద చేతనకు ప్రాతినిధ్యం వహిస్తూంది. మార్పు సమసమాజ లక్ష్యంగా మరో ప్రపంచమై నూతన వ్యవస్థానిర్మాణానికి దారితీసింది. "మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది" ఈ మరో ప్రపంచం వ్యక్తిగతమైంది కాదు. సమాజగతమైంది. మార్పును కోరేది. సర్వప్రజల సమానత్వంతో, సౌభాగ్యంతో నిర్దిష్టమైన మార్పు సిద్ధాంతాలకత్యంత సమీపంగా వర్తించే లక్ష్యంగా కలిగింది. ఈ మరో ప్రపంచం ప్రజల్ని "అగ్ని కిరీటం"తో "ఎర్రబావుటా"తో ఆహ్వానిస్తోంది. ఇందులో అగ్ని విప్లవశక్తికీ, ఎర్ర బావుటా సామ్యవాద భావానికీ ప్రతీకలు. ఈ ప్రపంచం సంపూర్ణంగా భిన్నమైంది. కొత్త ఆర్థిక రాజకీయ సామాజిక వ్యవస్థపై నెలకొంది. ఇది గతితార్కిక భౌతిక వాదయుతమైంది.

గురజాడ ప్రగతిశీలం నుండి శ్రీశ్రీ అభ్యుదయ తత్వానికి ప్రయాణించడానికి ముప్పై – ముప్పై ఐదు సంవత్సరాల కాలం పట్టింది. ఆధునిక యుగంలో సృజన సాహసంతో శ్రీశ్రీ "జయభేరి" 1933లో మ్రోగింది. కవిత్వానికి సంబంధించిన ఉన్నతమైన ప్రమాణా ఇది మొట్టమొదటి నవ్యముఖం, అభ్యుదయ గీతంగా నిలిచింది. చారిత్రక పరిణామంతో చూస్తే సంఘ సంస్కరణ ప్రయాణ నతాకగా తోకచుక్క (1910)తో గురజాడ ఆరంభించిన ప్రగతిశక్తికి తోడైందీ. శ్రీశ్రీ అభ్యుదయ శక్తి. దీన్ని జయభేరిగా గుర్తించవచ్చు. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" ప్రపంచ వ్యాప్తమైన విప్లవాగ్నికి ప్రతివ్యక్తి ఒక సమిధయై ఉజ్వలింపజేయాలని కర్తవ్యబోధ వ్యంజితం. సమాజం కోసం చేసే ప్రాణాహుతిలో దూరఫలం ఉంది. జడశక్తులూ సుప్తశక్తులూ చేతనతో మేల్కొనీ సమిధల వలె త్యాగంతో ఉద్యమానికి ఉపయోగపడే అవసరం సూచితమైంది. "నేడే ఈ నాడే ఈ నాడే నర జాతి పరివర్తన జగమంతా బలి వితర్ది నవ జీవన శుభ సమయం అభ్యుదయం" అభ్యుదయ శబ్దాన్ని మొదట ప్రయోగించింది శ్రీశ్రీయే. 'నవ' 'నవ్య' 'నవీన' శబ్దాలు వాడాడు. అయితే అభ్యుదయ శబ్దమే తెలుగుసాహిత్యంలో సమసమాజ సామ్యవాద సిద్ధాంతాన్ని ఆవిష్కరించేందుకు రూఢమైంది. ఇది మార్పు విప్లవ చైతన్యాన్ని స్ఫూర్తికి తెస్తూంది. ప్రాతినిధ్యం వహిస్తూంది కూడా.

సమాజంలో వివిధ శక్తుల సంఘర్షణతో విప్లవం, సమూల పరివర్తనకు హేతువైంది. నవ జీవనాన్ని ప్రతిఫలించే నూతన వ్యవస్థను సమావిర్భవింపజేసేది అన్న భావంతో "అభ్యుదయం" సమావిష్కృతమైంది. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యంలో ప్రగతి శక్తుల చైతన్యవంతమైన పాత్రతో, నిబద్ధమైన సామాజిక రాజకీయ ప్రభావంతో గుణాత్మకమైన మార్పుకు కారణమైందీ. సమసమాజ భావన మూలమైందీ.

సామ్యవాద సమసమాజాన్ని కోరే అభిప్రాయాల కనుగుణంగా విశ్లేషణకందే "మహా ప్రస్థానం" శ్రామిక రాజ్యాన్ని స్థాపించేదీ. శ్రమ జీవన సౌందర్యాన్ని భావించేదీ. జగమంతా శాంతినీ, క్రాంతినీ కోరేదీ.

'నాలో కదిలే నవ్య కవిత్వం కార్మిక లోకపు కల్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణంగా సమర్చనంగా'
'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని
కష్ట జీవులకు కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ' సాగింది.

కమ్యూనిస్టు పార్టీ దేశానికేం మేలు చేసిందన్న విశ్లేషణలో తెలుగు సాహిత్యానికి వస్తే సంస్కరణ మా పరివర్తననూ ఉన్న దాన్నీ జరిగే దాన్నీ వేగవంతం చేసిందనే చెప్పాలి. ఇది ప్రగతి శక్తులకు ప్రేరణగా నిలిచింది. మార్పుకు కేంద్రంగా వ్యవహరించింది. దీని కనుబంధంగా విశాల ప్రాతిపదికపై అభ్యుదయ రచయితల సంఘం స్థాపితమైంది. ఒక్క మార్క్సియం వరకే పరిమితం కాకుండా ప్రగతీశీల శక్తులకు నిలయమైంది. యువశక్తుల్ని ఉత్సాహంతో ఉద్యమింపజేసింది. సంస్కరణ వాదానికి పరివర్తన సిద్ధాంతానికి విప్లవ భావాలకు చేయూతనిచ్చింది. వేదికగా నిలిచింది. వ్యక్తిలో సామాజిక స్పృహతో అన్యాయాల్ని నిరసించే అక్రమాల్ని ఎదరించే ధైర్యాన్ని పుంజీభవింపజేసింది. తెలుగు ఆధునిక కవిత్వంలో ముఖ్యమైన అభ్యుదయ పరిణామ శిఖరానికి ప్రాణభూతమైన కేంద్ర బిందువు మార్క్సు సామ్యవాద సిద్ధాంతం. "మహా ప్రస్థానం" "వ్రాసే నాటికి తనకు మార్క్సిజం గురించి తెలియదనీ" మార్క్సిజం తెలుసుకున్న సాహిత్యంద్వారానేనని శ్రీశ్రీ ఒక మాట అన్నాడు. అయితే శాస్త్రపరమైన సిద్ధాంతం దాని తత్త్వరహస్యాలూ తెలియకపోవచ్చు. కాని ఆలోచనలో ప్రపంచంలో వెలువడే ప్రగతిశీల సాహిత్యతో పరిచయంతో, సామాజిక విశ్లేషణ శక్తి తన చుట్టూ నెలకొన్న దీన హీన జనుల జీవన గాథా వాతావరణం పట్ల సానుభూతి, ఈ దుస్థితికి స్పందించే హృదయం శ్రీశ్రీ ఆలోచనల్ని

మార్క్సిజానికి సమీపంగా వర్తింపజేసాయి. వాస్తవమైన అనుభవస్థాయిలో స్పందన తీవ్రత తనకు తెలియకుండానే విప్లవ రచనకు దారి తీసింది. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా అభ్యుదయ కవిత్వానికి అవసరమైన ప్రభావంతో సృజతన్మాతకమైన ప్రతిభచేత "మహా ప్రస్థానం" అవతరించింది.

## II

ఆంగ్ల విద్యాప్రభావం వల్ల దేశంలో కొందరు విద్యావంతులూ, మేధావులూ ఆసక్తితో ఎప్పటికప్పుడు వివిధ దేశాల్లో ప్రచలితమయ్యే కొత్త సిద్ధాంతాల్ని పోకడల్ని తెలుసుకునే ఉత్సుకత కనబరచేవారు. కలకత్తా బొంబాయి మద్రాసు ఢిల్లీ వంటి నగరాల్లో వీటికి సంబంధించిన సాహిత్యమూ వివిధ పత్రికల ద్వారా సమాచారమూ బాగా అందుబాటులో ఉండేది. ఈ విధంగా శ్రీశ్రీ మద్రాసు నగరంలో మార్క్సిజం గురించి స్థూలమైన పరిచయాన్నైనా పొందే అవకాశముంది. దీని పట్ల అవగాహనకూ వీలుంది. ఆ తరువాత రాజకీయ ప్రభావం అనివార్యం కావచ్చు. మానసికమైన సానుభూతి స్థితీ, పరిశీలనాగుణమూ తోడ్పడి ఉండవచ్చు. శ్రామిక వర్గ శ్రేయస్సు కోరే కవి తనచుట్టూ ఉన్న సామాజిక శక్తుల మధ్య జరిగే సంఘర్షణలో తన పాత్రను నిర్వర్తించడానికి వెనుదీయడన్న మార్క్సీయమైన మాట శ్రీశ్రీ పట్ల బాగా వర్తిస్తుంది. కవిత్వంలో "నేను సైతం విశ్వ వీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను" అన్న భావన చివరకు సమష్టి చైతన్యంలో కలిసి ఏకమయ్యే వ్యష్టి సంకల్పాన్ని చిత్రించే భావరూపాలతోను సంపన్నమైంది.

ఈ భావజాలానికి మహాప్రస్థానం రచన నాటి (1930–40) చారిత్రక నేపథ్యమూ, కొంత సహకరించింది. రెండో ప్రపంచయుద్ధ (1939–45) వాతావరణం నెలకొన్నప్పటి నుండీ, సమాజం ఆర్థికంగా విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. రాజకీయంగా సంక్షోభాన్ని పొందింది. యుద్ధానికి దారితీసే పరిస్థితుల్లో సమాజం ఏమంత సుఖశాంతులతో లేదు. ఫాసిస్టు నిరంకుశ శక్తులకూ, శాంతి కాముక శక్తులకూ మధ్య ఘర్షణ అనివార్యమైంది. ఇటలీ జర్మనీ ఫాసిస్టు ధోరణులు మరీ విజృంభించాయి. ఈ కాలం (1934–39)లో ఫ్రాన్సు మరియు యూరోపియన్ దేశాల్లో కార్మిక వర్గం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ప్రాధాన్యం వహించింది. ప్రపంచమంతటా క్రమంగా ముఖ్యమైన దేశాల్లో కార్మికుల కర్షకుల ఉద్యమాలు సమాఖ్యలు తలెత్తాయి. అంతటా శ్రామిక జనచైతన్యం విజృంభించింది. ఈ క్రమంలో బ్రిటన్ అమెరికా ఆపైన రష్యా ప్రపంచశాంతికై

ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఏమైనప్పటికి ఈ సంక్షుబ్దమైన కాలం శ్రీశ్రీ ఆలోచనపై అతని జీవితంపై అనితర ప్రభావాన్ని నెరపింది. సరిగ్గా 1933 నుండి 1942 మధ్యకాలంలోనే గొప్ప కవిత్వం వచ్చింది. జయభేరి (1933)తో ఆరంభమయింది. గర్జించు రష్యా (1971) నీడలు 47 చివరవీ మహా ప్రస్థానం సంపుటిలోని గీతాలు వెలువడిన కాలం ఇదే. ఈ అంశం శ్రీశ్రీ మహాప్రస్థానం సమాలోచనలో గుర్తింపదగింది.

ఈ కాలంలో సమాజంలో ఆకలీ, దారిద్ర్యం, అజ్ఞానం ప్రబలింది. శ్రమ శక్తిని వశం చేసుకున్న ధనస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాటమూ ఆరంభమైంది. వ్యవస్థలో మార్పు ప్రజలకు నవజీవనాన్ని ప్రసాదిస్తుందన్న అభిప్రాయం పుంజుకోవడం మొదలైంది. "చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలు ధనవంతుల పన్నాగాలు ఇంకానా ఇకపై సాగవు"

"ఒక వ్యక్తిని మరొక వ్యక్తి ఒక జాతిని వేరొక జాతి" పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై సాగదు" మార్క్సు గతి తార్కిక భౌతికవాదం చరిత్రను కొత్తకోణాల్లో దర్శింపజేసింది. సాహిత్యమూ సమాజమూ వేరు కావు. పరస్పరం సంబంధం కలవీ. అన్యోన్యం ప్రభావం నెరపేవీ. వీటి గమనం భౌతిక శక్తులపై ఆధారపడి ఉంటుంది. ప్రకృతిలో మార్పుల్లాగానే సమాజంలో మార్పులూ జరుగుతాయి. ఇది సహజమైన పరిణామం. ఇదీ ఈ కవిత్వం మూల స్వరూపం. స్థూలంగా మహా ప్రస్థానంలో వివేచనకందే అంశాలు. 1) ఈ జగత్తు వస్తు నిర్మితమైంది. భౌతికమైంది. ఆఖరికి మనస్సు కూడా భౌతిక రూపమే. ఇది మస్తిష్కంలో ఉన్న శక్తి నిలయం. ఆలోచనకూ అనుభవానికి జ్ఞానానికి కేంద్రస్థానం. మనస్సుకు గల ఈ శక్తి వల్లనే మానవజాతికి మహనీయత్వం సిద్ధిస్తూంది. ఈ మనస్సు భౌతికమైన ప్రపంచానికి ప్రతిరూపం అనవచ్చు. స్వతంత్రమైంది కాదు. మార్క్సు భౌతికవాదం మనస్సును దైవ ప్రాబల్యం నుండి ముక్తం చేసింది. అతీత శక్తుల ప్రాధాన్యం నుండి తప్పించింది. సమాజం వైపు వాస్తవం వైపు జీవితం వైపు సమస్యల వైపు సత్వర పరిష్కారాలు మనిషి దృష్టిని మరల్చింది. జీవితంలో దృక్పథాన్నీ విలువల్నీ లక్ష్యాన్ని సంపూర్ణంగా మార్చేసింది. 2) సమాజంలో బహుసంఖ్యాకులు పీడితులే. పీడకులెప్పుడూ అల్ప సంఖ్యాకులే. బహు సంఖ్యాకుల జీవితాలు అల్ప సంఖ్యాకుల గుప్పిట్లో చిక్కుకపోయాయి. వీరు అన్యాయాలకు అక్రమాలకు గురయ్యారు. అసమానత్వం పెరిగిపోయింది. దీన్ని సరిచేయడం సాధారణంగా కుదిరేపని కాదు. ప్రజల్లో దారిద్ర్యం అజ్ఞానం రోజురోజుకూ ప్రబలిపోయింది. నిస్సహాయస్థితిలో నలిగిపోతున్నారు. పీడకుల

ప్రతారణ (Exploitation) బహుముఖాలుగా విస్తరించింది. అనేకమైన బాధలకూ కష్టాలకూ గురి అవుతున్నారు. 3) సామాజిక వ్యవస్థకు మూలం ఆర్థికమే. ఆర్థిక వ్యవస్థే ఉపరితల నిర్మాణాన్ని రూపొందిస్తుంది. అందువల్ల సామాజిక వ్యవస్థ మూలంలోనే మార్పు రావాలి. ఉత్పత్తి సాధనాలపై "కష్ట జీవులకూ కర్మ వీరులకూ" ఆధిపత్యం చేకూరాలి. ఇది శ్రామిక జన చైతన్యంతో వర్గ పోరాటం వల్లనే సాధ్యం. దీనికో సమయంలో సంఘర్షణ, విప్లవం అనివార్యాలౌతాయి. ఈ గీతాల్లో కవిత్వం ప్రధానంగా ఈ భావస్థానాల్ని స్పృశిస్తుంది. నూతన వ్యవస్థలో స్వాతంత్ర్యాన్ని సమభావాన్నీ సౌభ్రాత్వాన్ని సౌహార్దాన్నీ కోరుతుంది. "శుభం పూచే" ఉదయాన్ని ఆశిస్తుంది.

4) మార్క్సిజం లక్షణాల్లో ఒకటి, పరస్పర వ్యతిరేక శక్తుల మధ్య సంఘర్షణ. దేశ చరిత్రలు గీతం ఈ సిద్ధాంత భావజాలానికి కళాత్మకమైన కవితారూపం అనవచ్చు. "పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను" మానవజాతి చరిత్ర అంతా వర్గాల మధ్య జరిగే సంఘర్షణ పర్యావసానమేనని కవి భావం. ప్రతీవస్తువులో రెండు విరుద్ధ శక్తులుంటాయి. ఇవి పరస్పరం సంఘర్షిస్తూ ఉంటాయి. సమాజంలో ఈ శక్తుల మధ్య సంఘర్షణ కొన్ని కొన్ని పరిస్థితుల్ని బట్టి మందంగానూ తీవ్రంగానూ వేగంగానూ ఉండొచ్చు. వస్తువులో చలనం నిరంతరమైంది. ఏదో మార్పుకు లోనవుతూనే ఉంటుంది. ఇది పైకి కన్పించవచ్చు. కన్పించకపోవచ్చు. అందువల్లనే వస్తువు పరివర్తన గతి లక్షణం కలిగిందిగా పేర్కోడం జరిగింది. ఈ క్రమంలో చూస్తే ప్రకృతీ ఆపైన మనిషీ కన్నా, మరో గొప్ప శక్తీ ఏదీ లేదు. ప్రకృతీ, సమాజం రెండే ముఖ్యమైనవి.

6) ప్రతీ వస్తువులో అంతర్వైరుధ్యం ఉంటుంది. ఇది సమాజానికి వర్తిస్తుంది. కొంతకాలానికి సృష్టి పాతదైపోతుంది. అందులోనే శిథిల సూచనలు కనిపిస్తాయి. ఇది వ్యక్తికీ సమాజానికి అన్నిటికీ వర్తిస్తుంది. క్రమంగా కొంత కాలానికి వినాశనాన్ని పొందుతాయి. సమాజంలో అంతర్నిహితమైన "ఇతరేతర శక్తులు" పైకి లేస్తాయి. పరస్పరం సంఘర్షిస్తాయి. పాత శక్తులు పడిపోతాయి. ఈ వినాశనం నుండి కొత్త సృష్టి ఉద్భవిస్తుంది. పుడమి తల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపజేస్తాయి. ఈ కొత్త సృష్టికి ముందు సంక్షోభం పెనుతుఫాను సంఘర్షణ భీభత్సం అనివార్యమౌతాయి ఈ స్థితి. "జాతి జాతి నిర్ఘాతపాత సంఘాతహేతువై కాలకేతువై అదె సంవర్తనపు తుపాను మేఘం! తొలి గర్జించిన తూర్యవిరావం"గా భావితమైందీ' కవిత్వంలో.

మహా ప్రస్థానంలో వివిధ గీతాల్లో గ్రీష్మం – అగ్ని – ప్రళయం – మహామేఘం మహావర్షం – గర్జన – సూర్యుడు – కిరణాలు – ఉదయం – పద్మం – సృష్టి ఇట్లా ఎన్నో ప్రకృతి ప్రతీకలు తటస్థపడతాయి. ఇవి పాత వ్యవస్థ నుండి కొత్త వ్యవస్థ ఆవిర్భావానికి సంకేతాలుగానూ నిబంధితమైనాయి. మార్పును గురించి ప్రకృతిపరంగా విశ్లేషిస్తే, గ్రీష్మం మండే ఎండలతో చండప్రచండంగా తాండవిస్తుంది. ఈ భీషణమైన ఆతపానికి ప్రభావ పర్యవసానంగా పరిణామ స్థితి హెచ్చి, నీరు ఆవిరై పైకి వెళ్ళిపోతుంది. ఆ పైన మార్పుతో మేఘమై వర్షిస్తుంది. ఇది కొత్త సృష్టికి నాందీ రూపం. ఇదో విధమైన మార్పు.

నేల నుండి బీజం మొలకెత్తుతుంది. బీజం నశిస్తుంది. దాని స్థానంలో కొత్త సృష్టి పల్లవిస్తుంది. పాత వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ అవతరించే విధం బహు సహజమైందీ అనివార్యమైందీ. ఇదో విధమైన మార్పు. ఇట్లా ఇంకా అనేక విషయాల్లో మందమైన వేగమైన తీవ్రమైన స్థాయిల్లో పరిణామాల్ని గుర్తించవచ్చు. ఈ దృష్టితో భౌతికమైన అస్తిత్వానికీ చైతన్యానికీ పరస్పర సంబంధం ఉంది. ఇది అనివార్యమయిందీ. భౌతిక శక్తుల పైనే చైతన్యం ఆధారపడి ఉంటుంది. ఇది ఎన్నెన్నో పరిణామ దశల్ని క్రమిస్తుంది. అవే! సమాజంలో "సంరంభం! సంక్షోభం! సంఘర్షణ! విప్లవం!" మొదలుగా దృష్టికి వస్తాయి. ఇక్కడ ప్రజలకు కష్టంలో దుఃఖంలో బాధలో సాంత్వనంతో ఆశాస్ఫూర్తినీ ధైర్యాన్నీ ఇవ్వడం కన్పిస్తుంది. "వస్తున్నాయ్ వస్తున్నాయ్ వస్తున్నాయొస్తున్నాయ్ జగన్నాథ ! జగన్నాథ! జగన్నాథ రథచక్రాల్" విప్లవ చైతన్యంలో విప్లవ ప్రక్రియతో ఉత్పత్తి సాధనాలు ప్రజలకైవసమౌతాయి. విశ్వ శ్రామికుల సమిష్టి చైతన్యంతో శ్రామిక రాజ్యం, అదే! మరో ప్రపంచం సిద్ధిస్తుంది. ఇందులో కవి ఆంతర్యం, విశ్వాసం ఆదర్శం వ్యంజితమవుతున్నాయి. 'పతితులూ' 'భ్రష్టులూ' 'దీనులూ' 'హీనులూ' 'దరిద్రులూ' 'బాధితులూ' అందరూ కొత్త స్ఫూర్తితో మార్పుతో ఆనందించే 'స్వాతంత్ర్యం' 'సమభావం' 'సౌభ్రాత్రం' 'సౌహార్దం'తో "ఆ స్వప్నం నిజమౌతుంది" "ఆ స్వర్గం ఋజువౌతుంది" "జగమంతా శ్రామిక జన" "శాంతి శాంతి కాంతి శాంతి" చేకూరుతుంది. చివరకు ఆ కాంతి ఆ శాంతిలో సామ్యవాద మరో ప్రపంచ వ్యవస్థపై ఆశారూపంతో వెలసిందీ, కొత్త యుగానికి హేతుభూతమైందీ, తెలుగు సాహిత్యప్రపంచంలో కవిచే (నవ/ నవ్య/ నవీనంగా పేర్కొబడిందీ. అభ్యుదయ కవిత్వ పరిణామ శిఖరంగా నిలిచిందీ / ఆదర్శంగా ఆవిష్కృతమైందీ "మహాప్రస్థానం".

# 13. ప్రతిజ్ఞ - సంవిధాన కళ

## (సామ్యవాద దర్శనం)

మహాప్రస్థానంలో "ప్రతిజ్ఞ" కవిత సామ్యవాద ఆదర్శ కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. కవిలో సామాజిక వాస్తవికతపై దృష్టి మార్పు దార్శనికతతో అభిన్నతను పొందింది. సంవిధాన కళతో రచనా శిల్పం ఈ కవితను అనితరమైన స్థాయిలో నిలుపుతూంది. ప్రతిజ్ఞ అంటే ఏదేని ఒక ఆదర్శం లేదా కర్తవ్యం లేదా అభిప్రాయం పట్ల దృఢమయిన విశ్వాసాన్ని కలిగి ఉండడం, దీక్షతో ప్రవర్తించడం, చిత్తశుద్ధిని ప్రకటించడం. ఇందులో మాట తప్పకుండా, అడుగు వెనక్కి వేయకుండా పలికిన మాటను నిలబెట్టుకొనే అచంచల మయిన సంకల్పం గోచరిస్తుంది. దీన్ని నిబద్ధతగానూ భావించవచ్చు. ఇందుకు స్థిరత ముఖ్యం. ప్రస్తుత సందర్భంలో "ప్రతిజ్ఞ" 1) సమాజ పరివర్తన హేతువుగా ఉంది. 2) ఇంతకు ముందు తెలుగు సాహిత్యంలో కనిపించని సామ్యవాద దర్శనంలో సామాజిక వాస్తవికతతో వస్తు నవ్యత కలిగిందీ. 3) నిష్ఠురమయిన యథార్థ జీవిత చిత్రణంతో విషయ నవ్యత కలిగిందీ. 4) సంవిధాన కళలో రచనా శిల్పం చేత అభివ్యక్తి నవ్యత చూపిందీ.

దీన్ని కవి తనలో "కదలే నవ్య కవిత్వం"గానూ, తాను "వినిపించే నవీన గీతి" గానూ తాను "విరచించే నవీన రీతి" గానూ పేర్కొనడం సమాలోచనానికి మార్గం సులభతరమవుతూంది. కవి కవిత్వ వ్యక్తిత్వం గురించి, 'ప్రతిజ్ఞ' కవిత ప్రత్యేకత గురించి అధ్యయన కోణాన్ని నిలుపుతూంది. ఇది ఒక విధంగా కవిలో పనిచేసే సమాలోచనకు సంబంధించిన ప్రక్రియా రూపంగా భావించవచ్చు.

ఏ సమాలోచనంలో నయినా మునుముందుగా కవి కృతి (Text) ఆధారంగా పరిశీలనం జరపడం సముచితం. ఆ తరువాతనే దీనికి పోషకంగా మిగతావీ. ఇతర విషయాల్నీ ప్రమేయాల్నీ దృక్పథాల్నీ వాదాల్నీ పరిగణనలోకి తీసుకోవచ్చు. సమగ్రతకు ప్రయత్నించనూ వచ్చు. కృతి ఆధారంగా కవి దృక్పథాన్ని అనుసరించి జరిపే సమాలోచనానికి విశ్వసనీయత ఎక్కువ. మిగతావి దీని విస్తరణకు తోడ్పడతాయి. ఆధునిక యుగంలో కవిత్వ చరిత్రలో ప్రగతి యుగ దశలో "ప్రతిజ్ఞ"కు ఒక స్థానం ఉంది. దార్శనికంలో స్పష్టత, లక్ష్యంలో నిర్దిష్టత, భావనలో సామాజికత, చేతనలో పరివర్తన గుణం అనేవి దీనిలో ముఖ్య మయిన అంశాలు. ఇంగ్లండులో జరిగిన "ప్రోగ్రెసివ్ రైటర్స్

ఎసోసియేషన్" సమావేశాల సందర్భంలో 'మానిఫెస్టో' ప్రేరణతో అవతరించిన విధమూ 'ప్రతిజ్ఞ' కవితకు చారిత్రక ప్రాధాన్యాన్ని కలిగిస్తూంది. ప్రస్తుత సమాలోచనం ఈ రచనలో రూపొందిన సంవిధాన కళలో రచనా శిల్పానికి మాత్రమే పరిమితమయింది. అక్కడక్కడా విషయ ప్రాధాన్యాన్ని బట్టి కవిలో దార్శనిక పార్శ్వం గురించి ఆలోచనకు చోటు లభించవచ్చు.

2

ఈ గీతం ఆరు భాగాలుగా ఉంది. సామ్యవాద దర్శన ప్రేరితమయింది.

1) వ్యవసాయ క్షేత్రంలో పని చేసే కర్షకుల శ్రమను వర్ణిస్తూంది. వారి శ్రమ విలువను గుర్తిస్తూంది. ప్రపంచ సుఖం కయి తమ బ్రతుకుల్ని బలి చేసే వారి జీవితాల్ని గురించి ఆలోచనతో సానుభూతి ప్రకటిస్తూంది.

2) కర్మాగారాల్లో పని చేసే కార్మికుల శ్రమ జీవనాన్ని చిత్రిస్తూంది. ధన స్వామ్యంలో కార్మికుల దుర్భర మయిన జీవన స్థితుల్ని దృష్టికి తెస్తూంది. వారి విలాపాన్నీ విషాదాన్నీ ప్రపంచానికి వినిపిస్తుంది. వారి శ్రమ విలువను భావింప చేస్తుంది.

3) బయట ప్రపంచంలో అభాగ్యులూ నిరపరాధులూ చెరసాలల్లో మ్రగ్గే వారూ అనాథులూ అశాంతులూ అనేకులు! భవిష్యత్తులో బాగు కయి నినదించే విప్లవ శంఖారావాన్ని వినిపింప జేస్తూంది.

4) సమాజంలో దారిద్ర్యాన్ని దౌర్జన్యాన్ని పరిష్కరిస్తూ బహిష్కరిస్తూ బాటలు తీసే, పాటలు వ్రాసే, నవ్య కవిత్వాన్నీ కవి కర్తవ్యాన్నీ స్మరింపజేస్తూంది. "శ్రమ జీవన సౌందర్యానికి సమానమయినది లేనే లేదు" అన్న విశ్వాస ప్రతిపాదనంతో కష్ట జీవులకూ కర్మ వీరులకూ "స్వస్తి వాక్యం" పలుకుతూంది. యథార్థ స్థితి పునాదిగా జీవితాలకు మంచి భవిష్యత్తు సూచితమయింది.

5) చివరి భాగం కవి ఆదర్శం గురించి లక్ష్యం పైన దృష్టి కలిగింది. సమాజంలో శరీర కష్టంతో గడిపే సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు (గొడ్డలి రంపం కొడవలి నాగలి మొదలుగా) – కవిత్వానికి "భావ్యం భాగ్యం ప్రాణం ప్రణవం"గా భావితమయినాయి. భావ్యం ఆవశ్యక మయిందీ. భవిష్యత్తుకు మేలయిందీ. భాగ్యం దేశ సంపదకూ వ్యక్తి సుఖానికీ కారణ మయిందీ. ప్రాణం జీవవంత మయిన విలువల్ని కలిగిందీ. ప్రణవం మానసికంగా శాంతినిచ్చేదీ, పవిత్రమయిందీ. ఈ దార్శనికత సమాజంలో కఠోర

మయిన వాస్తవాల నుండి సుఖకరమయిన భవిష్యత్తును కోరే కవిత్వాన్ని అవసరంగా అభిలషిస్తూంది, ఆ సమాజాన్ని వాంఛిస్తూంది. సామాజిక సమస్యల పరిష్కారంలో తాటస్థ్యం లేకుండా తన అభిప్రాయాలతో ఆదర్శాలతో సరిపడే ఒక రాజకీయ వేదికపై పాల్గొనడం కవి స్వేచ్ఛకు సంబంధించిన విషయం.

"ప్రతిజ్ఞ" – రచనలో రూపం, వస్తువు, విషయం, కర్తవ్యం, లక్ష్యంతో సమాహితమయిన స్థితి ఉన్నప్పటికీ కవిత్వంగా భాసించడానికి ఆకర్షణీయ మయిన సంవిధాన కళతో రచనా శిల్పమూ అవసరం.

3.

ఈ గీతంలో అభివ్యక్తికి సంబంధించిన సంవిధాన కళలో రచనా శిల్పం వివేచనలో మూడు లక్షణాలు దృష్టికి వస్తాయి. మొదటిది, ఇది కవితలో పాటకు అవసరమయిన నిర్మాణ పద్ధతికి సంబంధించింది, Melo Poeia, ఆరంభంలోనే స్పష్టంగా అనుభవానికి వస్తుంది.

1. "పొలాల నన్నీ – (4+4 / 3+5)
   హలాల దున్నీ – (4+4/3+5) / ప్రాస
2. ఇలా తలంపై హేమం పిండగ (4+4) / మైత్రి
   జగాని కంతా సౌఖ్యం నిండగ" (4+4)

మొదటి రెండు పంక్తులూ మెత్తని పదాలతో శ్రవణానికి ఇంపయిన నడకను కలిగినవీ. పదాల వరస నాలుక పయి కరిగి సరిస్తూంది ఇది పాల్ ఎలురాయిడ్ రచనను జ్ఞాపకం చేస్తుంది. మహాప్రస్థానం మొదటి ముద్రణం పుస్తకం అట్టపై "మహాప్రస్థానం" అక్షరాల క్రింద "మొదలైన గీతాలు" అన్న మాటలు కనిపిస్తాయి. ఇదీ సందర్భంలో ఆలోచనకు గురి చేస్తూంది. గీతం అంటే పాడేందుకు యోగ్య మయింది. శ్రుతికి ఇంపయిన పదాల సంయోజనంతో లయకూ గతికీ వీలయిన ప్రసార గుణాన్ని కలిగినవీ పై నాలుగు పాదాలూ. మెలో పోయియా (Melo Poeia) లోని పదాల కలయికతో పాటకు తగిన నిర్మాణ విధం స్పష్టంగా కనిపిస్తుంది.

కవిత చివరలో "నవీన గీతి" "నవీనరీతి" అన్న మాటలూ ఈ సందర్భంలో ఎంతో ఉపయోగకరమయినవీ. నవీన "గీతి"లో నవీనత్వం వస్తువుకు సంబంధించిందీ.

నవీన "రీతి"లో నవీనత్వం అభివ్యక్తికి సంబంధించిందీ. పదాల బరువూ పరిమాణం చలన శక్తి ప్రసార శక్తితో వాటి కలయిక చేత నిర్మాణ విధం ప్రత్యేకతను పొందుతూంది.

రెండోది పదాల నిర్మాణానికి సంబంధించింది, లొగొ పోయియా (Logo poeia). పదాల సహ యోగం సంయోజనం సమతుల్యం సమగతి మొదలైనవి సాధించడంలో నైపుణితో కూడిందీ. దీనికి భాష పయి పట్టు ప్రభుత అవసరం. శబ్ద పరిజ్ఞానంతోపాటు భావానికీ తాను కోరే పద్ధతికీ పదాల్నీ పద సమూహాల్నీ తగిన విధంగా ఎన్నుకొనీ ఉపయోగంలోకి తెచ్చే శిల్ప దృష్టీ ముఖ్యం.

ప్రస్తుత రచనలో

1. "కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి / (అక్షర మైత్రి)
ఘర్మ జలానికి
ధర్మ జలానికి / (ప్రాస)
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్

2. నరాల బిగువూ
కరాల సత్తువ / (ప్రాస)
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో వనిలో కార్ఖానాలో / (ప్రాస)

పరిక్రమిస్తూ
పరిప్లవిస్తూ (ఊనికతో శబ్దాలంకారం)

స్థూలంగా పరిశీలిస్తే ఇందులో చెవికి ఇంపైన 1) అక్షర సామ్యం యతి విరామం ప్రాస శబ్దాలంకారం తోపాటు 2) బరువు పరిమాణం చలనం (movement) ప్రసారం (extension) ధ్వని (sound), 3) ఇంకా పాద విభజనం పునరావృత్తి ఇట్లా వివిధాంశాల ఉపయోగం కవి ఛందో హృదయాన్ని భావింప జేస్తూంది. ఈ అంశాలతో నిర్మాణ సంకల్పం కవి మనసులో పని చేస్తూ ఉంది. కాబట్టే మాత్రా ఛందోమయమయిన రూపం, అనితరమయింది సిద్ధించింది. దీన్ని స్వేచ్ఛా ఛందం అనవచ్చు. అంటే, కవిచే స్వయం

నిర్మిత మయిందీ. గతిలో పాదాలు ఒకే విధంగా కాకుండా భిన్న భిన్న విధాలుగా, పదాల వరస వరసకూ పాద పాదానికీ కొన్ని పాదాలకూ వర్తించే భిన్నమైన సంవిధానంలో రచనాశిల్పం కవి స్వేచ్ఛాగతమయిందీ. ఇది మాత్రాఛందస్సులో విజయవంతమయిన ప్రయోగం!

2) మూడోది భావ రూపాల నిర్మాణానికి సంబంధించింది, Phano Poeia, ఇదీ కవితలో చాలా స్వల్పంగా ఉంది. కవి విషయాన్ని సూటిగా ప్రభావయుతంగా చెప్పేందుకే అధిక ప్రాముఖ్యం ఇవ్వడం చేత భావ రూపాలకు తక్కువ అవకాశం లభించడం సహజం.

"యంత్ర భూతముల కోరలు తోమే వాళ్ళూ

లోహ రాక్షసుల పద ఘట్టనలో నలిగే వాళ్ళూ" కార్మికులు యాంత్రిక యుగంలో పడే కష్టాలూ బాధలూ వర్ణిత మైనాయి. వాళ్ళు పని చేసే కర్మాగారాల్లో యంత్రాలనే భూతాల కోరల్ని ఎప్పటికీ చక్కగా వాడిగా ఉంచడమే వారి పని. కోరలు పొడిచి బాధ పెడతాయి. వాటికి సేవ చేయడంలో వాటిని తళ తళగా ఉంచడంలోనే కార్మికుల బ్రతుకులో సార్థకమవుతున్నాయి. అలాగే ఇనుప గుణంతో రాక్షస మనస్తత్వమూ, చిత్రితమయింది. ధన స్వాముల అడుగుల క్రింద నలిగిపోయే బ్రతుకులూ, కర్మవీరుల దుస్థితికి అద్దం పడుతున్నాయి. కార్మికుల పట్ల ఆర్ద్రతలేని మెత్తదనం ఎరగని కఠినమయిన మనో రూపం భావ రూపాల్లో ధ్వనిస్తూంది.

ప్రతిజ్ఞలో పాటవిధం (Melo Poeia) పద నిర్మాణ విధం (Logo Poeia) భావ రూప నిర్మాణ విధం (Phano Poeia) – ఈ మూడూ వాటి వాటి ప్రాధాన్యాలతో, ఏర్పడిన సంవిధాన కళలో రచనా శిల్పం కవిత్వ దృష్టితో విశ్లేషణ కందుతాయి. ఈ గీతం సహృదయుల మనస్సుపై శక్తివంతమయిన ప్రభావ ముద్రను వేస్తూంది. మహా ప్రస్థానం సంపుటిలో ఇలాంటివి మరి కొన్ని ఉన్నాయి.

ఒక విషయం ఈ గీతం ఏదో అలవోకగా వ్రాసింది కాదు. సామ్యవాద దర్శనాన్ని కలిగిందీ. రాజకీయ విశ్వాసాన్ని బింబించేదీ. లక్ష్యంపయి స్థిర మయిన ఆలోచన, నిర్మాణ ప్రణాళిక, సంవిధానం పై దృష్టీ, శిల్పంపై ప్రీతి, భాషపై పట్టుతో పదాలతో అశ్వ క్రీడ నెరపడం, స్వయం ప్రేరిత మాత్రాఛందోరూపంతో మనసులో లో పొరలో సంకల్పంతోనే సాధ్యం. స్వేచ్ఛా ఛందో హృదయ స్పందనంతో స్వయం ప్రేరిత నిర్మితమైన "ప్రతిజ్ఞ" శ్రీశ్రీలో Conscious artist పై వెలుగును ప్రసరింప జేస్తూంది.

# 14. శ్రీశ్రీ 'నీడలు' - సామాజిక వాస్తవికత

మహా ప్రస్థానంలో 'నీడలు' గీతం సామ్యవాద భావనతో సామాజిక వాస్తవికతను స్పందిస్తూంది. అభివ్యక్తిలో రచన శిల్ప సమగ్రతను కలిగింది. ఇందులో వస్తువు సమాజంలో అడుగున పడి ఉన్న మనుషుల బ్రతుకులకు సంబంధించింది. విషయం పేదరికంలో అనుభవించే దుర్భరమయిన స్థితుల్ని సూచిస్తుంది. ఇది ప్రత్యక్ష వర్ణనంగా కాక వివిధ భావరూపాల్లో ప్రతీకలతో కవితా కృతిని పొందింది. ఈ గీతానికీ భావరూపాల పరంపర ప్రత్యేకతను చేకూరుస్తూంది. ఈ రచన 19 జూన్ 1947న వ్రాసింది. ఆనాటి పరిస్థితులే ఈనాటికీ దేశంలోనూ ప్రపంచమంతటా ఉన్నాయి. అభివృద్ధి చెందుతూన్న దేశాల్లో వెనుకబడిన ప్రాంతాల్లో మరీనూ గోచరిస్తాయి. ప్రస్తుత సమాజంలో ఉన్న దయనీయమయిన దుర్భరమయిన భేదాల వివక్షల పీడనల స్థితులు తొలగనంతవరకూ దుర్భరమైన పేదరికం ఉన్నంతవరకూ మార్పు ప్రభావం ప్రసరిస్తూనే ఉంటుంది, అవసరమూ, ఈ మార్గంలో వెలువడిన రచన మహా ప్రస్థానం ముఖ్యంగా శ్రీశ్రీ సమకాలీనంలో వ్యాప్తిలో ఉన్న సంప్రదాయ నవ్య సంప్రదాయ భావ కవిత్వ మార్గాలకూ కొందరి ప్రయోగ పద్ధతులకూ భిన్నమయింది. వర్తమాన సామాజిక వాస్తవికత విషయ నేపథ్యంగా మార్పు సామ్యవాద దార్శనికత లక్ష్యంగా ప్రగతి మార్గాన్ని కలిగింది.

"నీడలు" గీతం అట్టడుగున పడి ఉన్న బ్రతుకుల్ని స్పందిస్తూంది. తరాలుగా పీడనకూ బాధలకూ గురి అవుతూ స్వయం వ్యక్తిత్వానికి తావులేని, స్వయం ప్రకాశానికి వీలులేని బ్రతుకులు ఇప్పటికీ ఉన్నాయి. ఒకవైపు సమాజంలో ఎదుగుతూ పోయే వెలుగుల శ్రేణులూ, మరోవైపు ఏ ఎదుగూ లేని చీకటి సందోహాలూ కనిపిస్తాయి. మహా ప్రస్థానం రచనకు ముందు ఆధునికమైన కవిత్వంలో పీడితులపట్ల అక్కడక్కడా సానుభూతి స్పర్శ కనిపిస్తుంది. కాని మహా ప్రస్థానంలో పీడితుల పట్ల విశేషమయిన చింతనతో పరిష్కారానికి నిర్దిష్టమయిన లక్ష్యంతో కార్యచరణకు నిబద్ధమయిన ప్రేరణతో కొత్త ప్రపంచం దర్శనమిస్తుంది. కాలం గడచే కొద్దీ మార్పును కోరే పరిస్థితుల వల్ల దీనికి ప్రాధాన్యం ఏర్పడింది, స్థిరపడింది.

"చూడు! చూడు! నీడలు
నీడలు! పొగమేడలు"

'నీడలు' కవిత ప్రతీకాత్మకమయింది. తాను చూచే సామాజిక వాస్తవ దృశ్యాన్ని మరొకరికి చూపే దృష్టి కోణం (పాయెంట్ ఆఫ్ వ్యూ) తో కవిత ఆరంభమయింది. ఆరంభం నుండీ చివరిదాకా అట్టడుగున పడి ఉన్న వారి బ్రతుకులు, "వేదనలో" "రోదనలో" "చెరసాలల" "తెరచాటుల", నీడలు ఓడలుగా, ప్రీడలు క్రీడలుగా 'తరతరాల రకరకాల' పీడనలో యథాస్థితులు ప్రతీకాత్మకంగా చిత్రితమయినాయి. భావరూపాల్ని (ఇమేజెస్) బింబించే పదాలు, బరువులో తూగులో సమగతిలో వైవిధ్యంతో, ప్రాసలతో శబ్దాలంకార సుందరంగా నిర్మాణ రూపాన్ని పొందాయి. రచనా శిల్పం గురించి మరో మాట కవకాశం లేకుండా రచన ప్రపూర్ణత్వాన్ని (పెర్‌ఫెక్షన్) పొందింది. ఇది పాడేందుకు అనుగుణంగా ఉండడం విశేషం. టి.ఎస్. ఇలియట్ ఒకమారు స్టీఫెన్ స్పెండర్‌తో కవిత్వం గురించి "బాగా వ్రాసిందీ", "బాగా వ్రాయందీ" అని రెండే విధాలన్న మాటలో బాగా వ్రాసిన దానికి మొదటి ఉదాహరణగా ఈ కవిత నిలుస్తుంది.

పేదల బ్రతుకుల్ని గురించి "నీడలు", భావరూపం ప్రతీకాత్మకంగా, స్వయం ప్రకాశం లేనివీ, స్వేచ్ఛ ఎరగనివీ, నిరాకరింప బడినవీ, అర్థాంతర శక్తిని భావింపజేయడం కవిత్వ కళను ప్రకాశింప జేస్తుంది. ఇక మౌలికమయిన విషయానికి వస్తే నీడలు ఎంతో కాలం నిలిచేవి కావు, వెలుగు లేనివీ. పొగమేడలూ అంతే! నివాస యోగ్యాలు కావు. అంతలో చెదరిపోతాయి. తొలగిపోతాయి. యుగాలుగా పై వర్గాల దోపిడికీ రాపిడికీ గురి అయి బాధలో వేదనలో మ్రగ్గే, అణగారిన కింది వర్గాన్ని సూచిస్తాయి. ఈ నీడల స్థితి ఈనాటిది కాదు. ఏ మార్పూ లేకుండా తరాలుగా వస్తూన్నది.

"చూడు! చూడు! నీడలు! పూలు లేని కాడలు!"

పూలు ప్రకృతిలో అందానికీ భాగ్యానికీ పరిమళవంతమయిన స్థితికీ ప్రతీక. తమ బ్రతుకులో వెలుగులేని సంపద లేని సంతోషంలేని సంస్కారం ఎరగని శూన్యస్థితిని భావింపజేస్తుంది.

"చెరసాలల" "తెరచాటుల" ఖైదీ వలె ఉన్న స్థితి ఒక విధంగా బాధాకరమే. పూర్తిగా స్వేచ్ఛగా బ్రతకలేక "చెరసాల"లో ఉన్నట్లుంది. తాము అనుకున్న దాని కవకాశం లేని స్థితి 'తెరచాటు'లో ఉన్నట్లుంది.

"నిర్భాగ్యపు నీడలు, ఎడారిలో ఓడలు"

వెలుగు స్పర్శ ఎరగని బ్రతుకులు! భాగ్యం లేనివే, ఇవి పొందేదేముంది? చీకటి మాత్రమే! నీరు లేని చోట ఇసుక ప్రదేశంలో నిలిచిన ఓడల్లా బ్రతుకులు! వాటిలో కదలిక లేదు. జడత్వాన్ని పొందినట్లుంది. నీరు సానుభూతికీ, కరుణకూ, ఉదారతకూ ప్రతీక. జీవన కారణమూ – నావ పయనించ గలిగిన ప్రవాహమో జలరాశియో ఇది సమాజానికి ప్రతీక. ఇలా అర్థ విస్తృతి కలిగింది. ఎడారి బడుగు బ్రతుకుల్లో అనుకూలంగా లేని పరిస్థితిని సూచిస్తుంది. "ఓడ" స్థితి కదలని బ్రతుకును రూపిస్తూంది.

"చూడు! చూడు! వ్రీడలు! పీడలతో క్రీడలు
చూడు! చూడు! నీడలు! సూర్యునితో క్రీడలు
సూర్యునిలో సూదులతో, క్రీడలాడు నీడలు!"

పేదల బ్రతుకులు దుస్థితిలో సిగ్గుతో తొలగి ఉన్నవీ బాధలతో ఆడేవీ. అవి ఆడగలిగినవి అవి ఒకటే! సూర్యుడు వేదనకు ప్రతీక. పరితాపానికి కారణం. సూర్యునిలో సూదులు వేడివీ, వాడియైనవీ. ఇవి బాధించే స్థితుల్ని వ్యంజింప చేస్తాయి. కాస్త దూరాన్వయంగా ఉన్న భావరూపాలు రచనకు అర్థదీప్తి నిస్తున్నాయి.

చలనంలేని పేద బ్రతుకుల్లో వేదన కలిగించే బాధించే విపరీతమైన సమాజ దుస్థితి అర్థాంతరాన్ని పొందుతూంది! నీడలు కవిత కవిలో (1) సామాజిక వాస్తవికత కలిగిన సామ్యవాద దర్శనంతో; (2) పాటకు యోగ్యమయిన రచనా శిల్పం కలిగిన అభివ్యక్తి కళతో సహృదయుల నాల్కలపై నర్తించే అనితర గీతంగా నిలిచింది.

# 15. శ్రీశ్రీ పరిణామ వ్యక్తిత్వం

శ్రీశ్రీ అంటే రెండు గౌరవ వాచకాల నివాసి. కవిత్వ విషయంలో సృజన గుణ సమృద్ధీ సమాజపరంగా పరివర్తన తేజం స్ఫురిస్తాయి. ఒక వైపు శ్రీ హృదయం మరో వైపు శ్రీ కంఠం – ఇలా చెబుతూ పోవచ్చు. లేదా విమర్శకు గురి చేయొచ్చు. కాలాంతరాన సమాజం ముందు నిలిచేది కవి సృజన కృతి మాత్రమే. అది మహా ప్రస్థానం, సమాజ ప్రగతి రూప చిహ్నం. శ్రీశ్రీ వ్యక్తిత్వం అనేక పరిణామాలతో సంశ్లిష్టమైంది. ఇది ఈయన చిరునామా. ఒక రచన గుణ విశేషం చేత విఖ్యాత మవుతుంది. కవికి మారుగా పేర్కోబడుతుంది. ప్రాతినిధ్యం వహిస్తుంది. శ్రీశ్రీ అనగానే మహా ప్రస్థానం సాక్షాత్కరిస్తుంది. దీనికి తోడుగా ఇదే మార్గంలో మరొకటి మరొకటి చేరి, వ్యక్తిత్వానికి వైశాల్యాన్ని చేకూరుస్తాయి. వైవిధ్యాన్ని సంతరింప జేస్తాయి. అనేక పార్శ్వాలేర్పడతాయి. కాలం స్థితి సందర్భం అవకాశం కారణంగా భేదిస్తాయి. వీటిని పరిణామ దశలుగానూ గుర్తించే అర్హతను పొందడమూ జరుగవచ్చు.

సృజన క్రియ (process) లో కవిత్వంలో అంతస్ స్వరూపం ప్రత్యక్షంగానో పరోక్షంగానో బాహ్య జగత్తుతో సంబంధం కలిగి ఉంటుంది. స్థాయి భేదాలు తప్పవు. ఈ మూలం పయినే కవి వ్యక్తిత్వం నిర్మితమవుతుంది. సహృదయులయిన పాఠకుల దృష్టికోణాల్లో భేదాల వల్ల అభిరుచిలో తేడాల వల్ల రచన గురించి అభిప్రాయాలూ మూల్యాంకనాలు వేరు వేరుగా ఉండడం జరుగుతుంది. ఇవి సాధారణస్థాయి నుండి తీవ్ర స్థాయినీ పొందవచ్చు. 'మహా ప్రస్థానం' రచన వెనక నుండి ప్రేరక శక్తుల్ని ప్రభావ రూపాల్నీ కవి మనో రూపానికి సంబంధించిన అంశాల్నీ ఇదమిత్థమని తేల్చి చెప్పడం కష్టం. అంతస్స్వరూపమూ బాహ్యాజగత్తుకు సంబంధించిన కారణాలు మరుగున బడిపోతాయి. ఏ విధంగానో తెలిసిన వాటికి ఆధారాలు దొరకాలి. హేతువుకు నిలవాలి. ఈ దిశలో ఎందరో విమర్శకులు వ్రాస్తూనే ఉన్నారు. సకారాత్మక మయిన సద్విమర్శ సమాలోచనాని కెంతగానో ఉపకరిస్తుంది. ముందుగా ఏర్పరచుకున్న దృక్పథంతో ఊహాలపయి అప విమర్శ వల్ల ప్రయోజనం ఉండదు.

సృజన రూపం కవి వ్యక్తిత్వం సమాజ నేపథ్యం మూడిటి సమాకలనంతో చేసే సమాలోచనంలోనూ కొన్ని అంశాలు జారిపోవచ్చు. తప్పిపోవచ్చు. అయితే కొత్తవి చేరవచ్చు. అనుకోనివి చోటు చేసుకోవచ్చు. ఈ విధంగా సమాలోచనా క్షేత్రం విస్తరిస్తుంది. బయటికి కన్పించే భౌతిక క్షేత్రానికీ సంబంధించినవీ, లోపలి మనస్తత్వ రూపానికి సంబంధించినవీ సృజన సమయంలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పనిచేస్తాయి. శ్రీశ్రీ పరిణామ వ్యక్తిత్వం ఇట్లా ఏర్పడిందే, దీని విశ్లేషణలో యథార్థానికీ హేతువుకీ నిలిచే విధంగా నిర్ణయానికి రావడం ఉత్తమం.

శ్రీశ్రీ అనగానే మనస్సులో నిలిచేది, కాలాన్ని జయించిన 'మహాప్రస్థానం'. అప్పటి వరకూ బాగా పరిచయమున్న ప్రచారంలో ఉన్న మార్గాలకు భిన్నమయిందీ. మానవ జీవితాని కత్యంత సన్నిహిత మయిందీ. వాస్తవ దృశ్యాలతో నిండిందీ. తోటి మనిషిని గురించి ఆలోచించేదీ. సానుభూతి బంధాన్ని పెంచేదీ. మార్పుకై ప్రేరేపించేదీ. ఈ కృతిలో మొదటి కవిత 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' 'పదండి ముందుకు! పదండి ముందుకు!', మాటల్లో ప్రబోధంతో ఉత్సాహ పరచే దృశ్యాల పరంపర చివర మరో ప్రపంచం ప్రకాశ రూపం సూచిత మయింది. కొత్త సమాజం కయి ప్రజల్ని నడిపించే స్వరం ఆకర్షిస్తుంది. గీతంలో కవి స్వరం అభివ్యక్తిలో పాత్రగా తన భూమికను నిర్వహించింది. చివరిది కవి మాటల్లో ఈ కృతిలో అనివార్యమయిందీ, ఇది లేకుండా ఈ రచనకు సంపూర్ణత సిద్ధించదన్నభావం కలిగించేదీ 'జగన్నాథ రథ చక్రాలు'! ఇది దీనులకూ పీడితులకూ ధైర్యాన్ని ఇస్తూ ఊరట కలిగిస్తూ కవి ఆశించే సమాజంలో మనిషి భవిష్యత్తునూ, సౌభాగ్య సమాజ లక్ష్యాన్ని స్థాపిస్తూంది. మరో ప్రపంచం కోసం ప్రస్థానంలో విజయరూపంగా అనుభవానికి వస్తుంది. జగన్నాథ రథ చక్రాల్ని 'భూమార్గం పట్టిస్తాను' అంటే శబ్దాల్లో పైకి తోచే అర్థం కన్నా విశేషమయిన భావ ప్రసారం కలిగింది. ఇంతవరకూ సమాజంలో ఆకాశంపైన దేవతలూ విధి ఆముష్మికం గురించి కల్పనలతో ఉన్న వాతావరణం నుండి, భూమిపయి మనుషులూ శ్రమ జీవిత వాస్తవం పరివర్తన రూపంతో ప్రగతి రూపాన్ని ఇచ్చే సంకేతంగానూ ఉంది. ఈ ప్రయత్నంలో ఉద్రేక సంభరితమయిన తీవ్రత ఉన్న మాట నిజం. దీనివల్ల కార్యం వేగంగా సాధ్యమవుతుందనీ కవి అభిప్రాయం. ఉత్తమ పురుషలో అభివ్యక్తి స్వరం

కవిలో వ్యక్తి బాధ్యతనూ వ్యక్తిలో కవి హృదయాన్ని తలపిస్తుంది. ఆత్మ ప్రత్యయాన్నీ భావింప జేస్తుంది. ఈ గీతం అపూర్వమయిన సంవిధాన కళతో ఆవేశ స్థాయిని నిలుపుతూ భావాన్ని పరుగెత్తించే గతి విశేషంతో అద్భుతంగా నడచింది. దీనికిదే సాటిగా ఉంది.

ఈ కొత్త ప్రపంచం సామ్యవాద భావజాలానికి చాల దగ్గరిగా వర్తిస్తూ, పోను పోను వామ పక్షాలతో కలిసి పోవడం పరిణామ రూపంగానే గ్రహించాలి. ఇది శ్రీశ్రీ పరిణామ వ్యక్తిత్వంలో ఒక పార్శ్వం. మార్క్సిజానికి కాలదోషం పట్టడమనేది ఉండదు. చరిత్ర గ్రాఫ్‌లో తగ్గుతూ హెచ్చుతూ ఉండవచ్చు. ఇది విపరీతమయిన నిరంకుశ రీతులకు 'చెక్'గా తన పాత్రను నిర్వహిస్తుంది. దీనిలో ఉదగ్ర మయిన ప్రచండ మయిన ఉద్యమ చేతన (spirit) ప్రతి దశ దశలో రూపం మారుతూ పాత్రను నిర్వహిస్తుంది. నిరంకుశత్వం దారిద్ర్యం అణచివేత అసమానతలు మొదలయిన పీడాకరబధాకర శక్తులు పనిచేస్తూ ఉన్నంత వరకూ మార్క్సిజం అవసరం ఉంటుంది. ప్రాముఖ్యం తగ్గదు, పైగా హెచ్చుతుంది. పరోక్షంగానూ పనిచేస్తూనే ఉంటుంది.

'మరో ప్రపంచం', 'జగన్నాథ రథచక్రాలు' గీతాల మధ్య సమాజ జీవన స్థితి గతుల స్పందనలతో మహా ప్రస్థానం కావ్యం నిర్మాణైక్యతను పొందింది. తన చుట్టూ బాధించే తపింప జేసే దుర్భర స్థితులకు ఆవేదన చెంది వెలువడింది. ఇది ఒక ఎత్తు. అయితే దీన్ని గురించి చింతనలో సృజన కళతో అభివ్యక్తి శిల్ప సౌందర్యంతో ఆవిష్కారాన్ని పొందడం మరో ఎత్తు. ఇవి ఒక దానికి మరొకటి సహభావం (complimentary) తో కవిత్వానికి ఉదాత్త స్థాయిని చేకూరుస్తున్నాయి.

'మరో ప్రపంచం!' అన్న మాట పునరుక్తం కావడంలో విశేషం ఉంది. ఇవి కవి ఉద్దేశించే భావాన్ని "వీప్సార్థే ద్విరుక్తిః" అని బలంగా హత్తుకునేట్లు చెప్పే అభిలాష కలిగింది. spring action తో అభివ్యక్తికి గాఢత్వాన్ని చేకూరుస్తుంది. కర్తవ్యాన్ని మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేస్తుంది! ఈ గీతం పొంగే ఆవేశంతో రగిలే ఉద్రేకంతో కోరే సామాజిక గమ్యంతో కొత్త ఆలోచనలకు ఉన్ముఖం చేస్తుంది.

శ్రీశ్రీ సమకాలికుల్లో సామాజికాంశాల పట్ల స్పృహ ఉంది. కాని అది యథాస్థితి చిత్రణం వరకే పరిమిత మయింది. ప్రయోగ వైచిత్రి ఉంది. అది ఉన్నతమైన లక్ష్యాన్ని

పొందలేదు. ఈ దృష్టితో సామాజిక ప్రగతి లక్ష్యం సాగనూ లేదు. శిల్ప గుణం ఉంది. సంవిధాన కళలో పరిపూర్ణమయిన ఆకర్షణ రూపం సిద్ధించలేదు. శ్రీశ్రీ మహా ప్రస్థానం కవిత్వ కళతో సామాజిక ధ్యేయంతో సృజన పూర్ణతను పొందింది. పైకి ఎదిగి ఉన్నతంగా నిలిచింది.

తన చుట్టూ ఉన్న పేదరికం పేదరికంలో మ్రగ్గే ప్రజలూ ప్రజలకు జరిగే అన్యాయాలూ, వీటిని పట్టించుకోని రాజ్యం దీన్ని నడిపే పాలకులూ నైతిక శక్తి కోల్పోయిన నేతలూ ఇది ఇలా ఒక దాని వెంట ఒకటి ఒక దానిలోకి మరొకటి ప్రవేశిస్తూ దుస్సహమయిన స్థితిగతులకు కారణం కావడం కవి హృదయాన్ని కలచి వేసింది. ఈ వేదన నుండి అవతరించిన ఉత్సాహశక్తి రూపం మహా ప్రస్థానం.

ఇక మహా ప్రస్థానం గీతాలపయి పాశ్చాత్య కవితా రీతుల ప్రభావమన్న మాట పాతదీ, విషయ వివేచనం జరగకుండా చేసే ప్రతిపాదనం, అసమంజసమయిందీ. శ్రీశ్రీ తనజీవిత కాలం చివరి సంవత్సరాల్లో 1981 మే 29న షికాగో – పిట్స్‌బర్గ్‌లో జరిగిన మూడవ 'తానా' సభల సమావేశంలో పలికిన మాటలు కవి చిత్తశుద్ధికి తార్కాణం. ఆ కాలంలో ప్రగతి వాద భావ జాలంతో వ్రాసే డబ్ల్యూ హెచ్ ఆడన్, స్టీఫెన్ స్పెండర్, సిసిలి డి. లూయిస్ కవులను పేర్కొని వామ పక్ష భావాల పయి తన మొగ్గును వివరించడం జరిగింది. మరో సందర్భంలో బెంగాలీ కవి ఖాజా నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి' కావ్య ప్రభావమూ పేర్కొనడాన్ని గమనించవచ్చు. ప్రతిభావంతుడయిన కవి తన ప్రేరణ కలిగించిన విషయాన్ని మరచిపోడు. అదొక విధంగా గుణంలో భాగంగానే భావిస్తాడు. ఈ సందర్భంలో చెప్పదలచుకున్నది, ఒక భాషలో కవికి మరో భాషతో పరిచయం వల్ల దాని ప్రభావం పడుతుంది. ఆధునిక యుగంలో పెరిగే సంబంధాల కారణంగా ఇంకా విస్తృతిని పొందుతూంది. కవి తన ప్రతిభ చేత తన దయిన ముద్రతో ఒక విశిష్టమయిన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాడు. ఇతర భాషా ప్రభావం సృజన రూపంలో లీనమయి, జీవశక్తిలో భాగమయిపోతుంది. ఇక్కడి వాతావరణానికి అనుగుణంగా మౌలికతకు భంగం రాకుండా నిర్వహించడం వల్ల ఆ ప్రభావం రచనలో నూతన ప్రకాశానికి దోహద పడుతూంది. మహాప్రస్థానం గీతాల్లో కొన్నిటిలో పాశ్చాత్య ప్రభావాన్ని జీర్ణించుకొని స్వంతం చేసుకొని స్వతంత్ర మయిన స్థాయిని పొందడమూ గమనించవచ్చు.

ఇక మార్క్సిజంతో రూపొందిన ఆలోచనా వ్యక్తిత్వం కవి స్వతంత్ర్యమయిన జీవితానికీ స్వేచ్ఛా గుణానికీ సంబంధించింది. సృజన విషయంలో ఎవరూ ప్రశ్నించడానికి వీలులేనిది, ఒక పార్టీ లేదా సిద్ధాంతం మౌలిక భావాలతో మానసికంగా ఐక్యత చేకూరినపుడు వాటితో కలిసి పనిచేయడంలో శ్రీశ్రీ నిబద్ధత క్రియాశీలత కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో కష్టాల్ని లెక్క చేయకుండా తాను విశ్వసించే సామాజికావసరాల్లో చారిత్రక మయిన పాత్రను నిర్వహించడం గొప్ప విశేషం. శ్రీశ్రీ జీవిత గమనంలో వివిధ దశల్లో జరిగిన పరిణామాలు దీన్నే సూచిస్తాయి. ఇవి కవిలో వ్యక్తికి సంబంధించిన అచంచలమయిన అభిప్రాయాలకు నిదర్శనం. కాలం గడిచే కొద్దీ పరిణామ వ్యక్తిత్వంలో వివిధ పార్శ్వాలు ప్లస్ పాయింట్స్ గానే పరిశీలనలో చేరతాయి. కవి యశో రూపానికి ఉజ్వలతనూ చేకూరుస్తాయి.

శ్రీశ్రీ కవిత్వంలో వలెనే వ్యక్తిత్వంలోనూ ప్రవాహకత ఉంది. కొందరు దీన్ని 'చంచల' గుణంగా భావించవచ్చు. కాని చలన శీలంలోనే ఒడుదుడుకులతో ప్రవాహకత ఉంటుంది. దీనితో గమనం – ప్రస్థానం ఉంది. ప్రవాహకతలో వర్తమానం నుండి భవిష్యత్తుకు సంకేతం ఉంది.

మహా ప్రస్థానంలో చాలా భాగం కవితలు మాత్రా ఛందస్సులో సంకీర్ణ గతుల్లో ఉన్నాయి. ఒక విధంగా స్వతంత్ర మయిన మార్పులతో ప్రయోగ సరణిలో ఆకట్టు కుంటాయి. "కవితా! ఓ కవితా!", "జగన్నాథ రథ చక్రాలు" పరిశీలించ వచ్చు. రెండో విధం "Poetry that is sung" పాటకు యోగ్యమయిన విధంగా మాత్రాఛందో గతిలో ఉన్నాయి. మూడో విధం సంభాషణ conversational పద్ధతిలో ఉన్నాయి. నాలుగో విధం కేవలం వచన పద్ధతిలో సాగిపోతాయి. మొదటిదీ రెండోదీ శ్రీశ్రీ ఉపజ్ఞకే చెల్లింది. ఈ నాల్గింటిలో అభివ్యక్తి కళ నిర్దుష్టంగా శ్రీశ్రీ ముద్రతో ఆకర్షిస్తుంది. ఎవరూ అనుకరించే వీలులేని నిర్మాణ శిల్పం కలిగిందీ.

గొప్ప కవిత్వంలో స్వచ్ఛమయిన కవిత్వ కళతో పాటు సామాజిక లక్ష్యానికి సహకరించే విధంగా ఉపదేశాలు సూక్తులు నినాదాలు ప్రకటనలు సందర్భానుగుణంగా చోటు చేసుకోవడం ఉన్నదే. ఇవి తాత్త్విక పటుత్వంతో ప్రబోధ ప్రకాశంతో కవిత్వలో భాగమై నిలుస్తాయి. మహా ప్రస్థానంలోనూ వీటికి స్థానం లభించింది.

"జీవిత మొక పద్మ వ్యూహం

కవిత్వ మొక తీరని దాహం" జీవిత తాత్త్వికతనూ కవిత్వ పిపాసనూ ఆవిష్కరిస్తాయి.

ప్రపంచ పటంలో యునైటెడ్ సోవియెట్ సోషలిష్టు రిపబ్లిక్ (USSR) ఇపుడు లేదు. ఇది కొన్ని విభాగాలుగా వేరయి మారింది. "గర్జించు రష్యా" గీతం ఆనాటిది. రెండో ప్రపంచ యుద్ధానికి సంబంధించిన పరిస్థితుల్లో వ్రాసింది. అయినప్పటికీ దానిలోని చైతన్యం (spirit) ఇప్పటికీ అన్వయిస్తుంది. ఎప్పటికీ మిగిలే ఉంటుంది. పూర్వపు ఇతిహాసాలూ ఇలాంటివే. కాలంలో మార్పులు వచ్చినా నియంతృత్వం పయి విజయయత్నంలో విలువలు మిగులుతాయి. దృష్టి ప్రధానంగా వాటి పయినే ఉంటుంది. "గర్జించు రష్యా" గీతంలో చైతన్యం నిలిచే ఉంటుంది. భౌతికంగా రూపంలో మార్పు వచ్చినా ఉద్దేశం మారదు.

ఏ జీవితమూ అనుక్షణం సరళరేఖలో సాగదు, మలుపులు తప్పవు. మరో రేఖలతో సంబంధాలు ఏర్పడుతాయి. ఆకృతిలో సంశ్లిష్టత ఏర్పడుతుంది కూడా! శ్రీశ్రీ వ్యక్తిత్వంలో అనేక సంఘటనలూ సందర్భాలూ వైరుధ్యానికి ఆస్కారాలుగా కనిపిస్తాయి. సంశ్లిష్టతను తలపిస్తాయి. ఇవి ఒక ఒరపిడిలో నుండి బయటపడి విలువయిన దేదో ప్రకాశిస్తుంది. ఇది నడచే 'బుట్ట బొమ్మ'లా కొన్ని విశేష సందర్భాల్లో కొందరికి కనిపించవచ్చు. కాని లోపల ఒక అగ్ని పర్వతం ఆయుధ విశేషం విలయరూపం ఉందనీ తెలియదు. ప్రభావ ప్రకటనంలోనే తెలుస్తుంది.

ఆంతర్యంలో చైతన్య వంతవయిన నిఖిల మానవ ప్రగతి శీలంతో, ఎక్కువగా మాట్లాడకుండా మౌనంగా ఉంటూనే, చిట్టచివరకు క్లిష్ట ఘట్టంలో ఆ ఒకటి రెండు మాటలు, ఎంతో శక్తివంతమయినవీ, ప్రేరకమయినవీ, ప్రయాణం ఆగకుండా నడిపించే సిగ్నల్స్‌గా ఉపకరించేవీ. క్షణ క్షణం నవంనవ తేజంతో కాలన్ని అందుకునే వేగం కలిగిందీ శ్రీశ్రీ పరిణామ వ్యక్తిత్వం.

# 16. శ్రీశ్రీ యుగ కర్తృత్వం

సాహిత్య చరిత్రలో యుగ విభజన ప్రసిద్ధమైంది. ఈ యుగ కర్తృత్వ మనేది ఆధునిక యుగంలో కవిత్వ విషయంలో కొత్త తేజాన్ని నింపి కొత్త లక్ష్యాన్ని చూపి కొత్త దర్శనంతో అపుడున్న దాని కన్నా భిన్న మయిన కొత్త ప్రపంచాన్ని నిర్మించే మహాకవికే చెల్లుతుంది. దీనితో ఏర్పడే విశాలమయిన పరిధి (scope) చేత పూర్వ భూమికలయిన సంఘ సంస్కరణం మొదలయిన మార్పులు దీనికి ఉపకరిస్తాయి. ఈ దృష్టితో కవిత్వం విషయంలో గురజాడ 'అడుగు జాడ'లో కదలిందీ, స్పష్టమయిన నిశ్చయ పూర్వక మయిన లక్ష్యాన్ని కలిగిందీ శ్రీశ్రీ కృతి మహా ప్రస్థానం. దీని ప్రభావ శక్తి చేత యుగ కర్తృత్వం మహాకవి శ్రీశ్రీ కే దక్కుతుంది.

ఇది ఐదారు బలమయిన అంశాలతో సమీకరణాన్ని పొందింది. స్థూలంగా ఆధునిక సాహిత్యాన్ని ముందుకు నడిపే ప్రగతి చేతన యైన సామ్యవాద దార్శనికత దీనికి ఆయువు పట్టుగా ఉంది. భౌతికవాద సామాజిక భావనతో జీవన వాస్తవికతపై దృష్టితో ఏర్పడింది. ఇది ఈ కవిత్వానికి ఆధార తలం. ఇది నిర్ణయ హేతువుకు ఉపకరించే వాటిలో ప్రముఖమయింది. మహా ప్రస్థానంలో కవిత్వానికి లభించిన జనాదరణం సహృదయుల ఆమోదం ఎంతో గొప్పది.

మహా ప్రస్థానం కవిత్వ సమాలోచనంలో 1) కొత్తగా ఎన్నుకొన్న వస్తువూ – తీసుకున్న విషయమూ; 2) సృజన దృష్టీ – భావనా జగత్తు; 3) సమాజ లక్ష్యం; 4) మార్క్సియ దార్శనికత; 5) రూపమూ – అభివ్యక్తి కళ; 6) మానవీయ ప్రతిపాదనం అనే అంశాలు విశ్లేషణ కందుతాయి. ఈ అంశాలు వివిధ భాగాలుగా కలిసిన శక్తి వంతమయిన ప్రభావ రూపం చెరగని ముద్ర వేస్తుంది. ఈ key note (కీలక భావాన్ని)ను ప్రతిపాదించడమే ప్రస్తుతోద్దేశం.

కవి స్వతంత్ర మయిన గుణం తాను ఎన్నుకునే వస్తువులో అందునా తీసుకొనే విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. వస్తువులో విశ్వమానవుడు మొదలుకొని సమాజంలో మనిషి ప్రత్యేకతనూ బ్రతుకునూ గుర్తించడం జరిగింది. రచనా కాలంలోని స్థితి గతుల విశేష స్పందనంతో వివేచన గుణంతో భవిష్యత్తు దర్శనమూ కనిపిస్తుంది. ఈ సమాజంలో

ఉన్నవాళ్ళూ లేని వాళ్ళూ పీడకులూ పీడితులూ మంచీ చెడూ మధ్య విభజన రేఖ గుర్తింపబడింది. పేదవాళ్లూ పీడితులూ తమ బ్రతుకుల్లో పడే బాధలూ వాళ్ళు ఉన్న స్థితి గతులూ వాటికి సంబంధించిన మూల సమస్య పయి దృష్టిని ప్రసరింపజేయడం కనిపిస్తుంది. కఠిన మయిన యథార్థ దృశ్యాల్లో వారి వారి తీరని అవసరాలూ పొందే విషాదాలూ ఉన్న దరిద్రం నిరాశ నుండి ఉత్సాహాన్నీ ఆశనూ ప్రేరేపించి కొత్త ప్రపంచంలోకి తీసుకొని వెళ్ళుతుంది. పాఠకునిలో ఎంతో కొంత మార్పు వస్తుంది. ఆలోచనలో తనకు తెలిసో తెలియకుండానో సంభవిస్తుంది. ఈ అంశంలో రచన ఒక పొరలో విశ్వ భావనామయంగానూ మరో పొరలో దేశ కాల స్థలాల అధీనంలో భౌతికమయిన జీవితానుభవ యుతంగానూ ఉంటుంది. ఇది కేవలం మానవీయ తలం పయి నిరంకుశ నిరసనమూ దీన హీన స్థితి చిత్రణమూ కలిగింది. రావలసిన కొత్త వ్యవస్థ సూచనతో ఆపూర్ణ మయింది. భూమిపై నడచే జీవితాన్ని గురించి ఆలోచింపజేస్తుంది, క్రియాశీలతను ప్రేరేపిస్తుంది.

(2) సృజన దృష్టి – భావనా జగత్తు అనేది కవి ప్రతిభాధీన మయింది. నవ నవోన్మేష శాలీనంగా ఈ రచనలో ప్రత్యక్ష మవుతుంది. మౌలికంగా మహా కవులందరిలో ఈ అంశం ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా వర్తిస్తుంది. ప్రస్తుత సందర్భంలో చాలా భాగం దీనికిదిగా కాక, ఈ రచనలో సామాజిక మానవీయ పార్శ్వాలతో ముడివడి ఉండడం గమనార్హం. ప్రతి కవితో ఏదో ఒక విధమయిన సృజన రూపం నవ్యతను ప్రదర్శిస్తుంది. ఆధునికతను భావింప జేస్తుంది. ఇందులో అనేక మయి భావ రూపాలు చోటు చేసుకున్నాయి. వీటిలో కొన్ని పౌరాణిక సంబంధం కలిగినవీ అయినప్పటికీ వాటిని ఆధునిక చేతనకు వాడుకునే నైపుణి కనిపిస్తుంది. క్షుణ్ణమయిన సంప్రదాయ పథాన్ని వీడి, పూర్వపు కవి సమయాల్ని వదలి, పరివర్తన సూచనగానో వైయక్తిక భావరూపాలుగానో ప్రతీకలుగానో (personal images & symbols) అన్వయ శోభను పొందుతున్నాయి. కవి సృజన దృష్టితో స్వతంత్ర మయిన నిర్వహణ గుణం వివేచన కందుతుంది.

"నరక లోకపు జాగిలమ్ములు గొలుసు త్రెంచుక ఉరికి పడ్డాయి". నరకం పౌరాణిక ప్రసిద్ధమయిన మాట. ఈ సందర్భంలో సమాజంలో దుర్భర మయిన దయనీయ స్థితి

సూచితం ఇక్కడ కట్టివేయ బడిన జాగిలాలు గొలుసులు త్రెంచుకొని బయట పడడం, మనుషులు తమ స్వేచ్ఛకు పడిన బంధనాల్ని బలవంతంగా తొలగించుకొని నడచే సాహసక్రియ వ్యంజితం.

"ఆకాశపు టెడారిలో

కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా జాబిల్లి"

అనేది, వైయక్తిక భావరూపం (personal image) దీనికిదిగా దీనితో సంబంధం లేకుండానూ విడిగా ఆకర్షిస్తుంది. కాని కవి రచనలో సందర్భ దృష్టిని బట్టి సామాజికంగా స్ఫూర్తికి వస్తుంది. ఆకాశంలా పరచుకొన్న సమాజ జీవితంలో పచ్చదనం ఎరగని ఎడారి స్థితిలో ఆశ అనే జాబిల్లి! పైన ఆకాశంలో కాళ్లు తెగిన ఒంటరి ఒంటెలా ఉంది. ముందుకు కదల లేని దవుతూంది. నడచే శక్తిని కోల్పోతూంది. ప్రస్తుతం సమాజ స్థితిలో సామాన్యుని జీవన యానం సూచితం, కవి భావనలో సమాజంలో పేదల జీవన స్థితీ, మనిషిలో ఉండే ఆశారూపం రెండూ ప్రతీయమానత్వాన్ని పొందుతున్నాయి. ఈ భాగం సాంద్రమయిన భావ రూపానికి నిదర్శనంగా ఉంది. దీని ప్రకాశం మనస్సును అలరిస్తుంది. ఇది కాల్పనిక సౌందర్యంతో భావ కవిత్వంతో వీడని పరంపరా రూపాన్ని నిలుపుతూంది.

(3) సమాజ లక్ష్యం – ఇంతకు ముందున్న కవిత్వంలో కన్నా ప్రయోజన విస్తృతిని పొందిందీ. ఒక విధంగా ఉపేక్షిత మయిందీ, ఇపుడూ దీనిపై దృష్టి పడిందీ, సమాజంలో అట్టడుగున గడవని బ్రతుకులతో గడిపే, మోయరాని బాధలతో సతమత మయ్యే, పడరాని పాట్లు పడే ప్రజల పట్ల అటు ప్రభుత్వానికీ ఇటు సమాజానికీ గల బాధ్యతను ఆలోచింప జేస్తుంది. "భిక్షువర్షీయసి" కవితలో "ఆ అవ్వే! మరణిస్తే ఆ పాపం ఎవరిది?" అన్న ప్రశ్న ఒక్కటి చాలు! ఆ పాపం గాలిలో కలిసి పోయింది. ఆ అవ్వ ప్రాణంతో పాటుగా! అయితే దీనికి సమాధానం అవసరం. ఈ కవిత సామాజికమైన రాజకీయమైన జవాబుదారీ తనాన్ని గుర్తు చేస్తుంది.

రచనలో చాలా సందర్భాల్లో సామాజిక శక్తి ప్రతిపాదనంతో పాటు వ్యక్తి స్వేచ్ఛ కూడ చోటు చేసుకుంది. సర్వ సమాజంలో ఏ భేద భావం లేకుండా సమభావంతో

సమ న్యాయాన్ని సౌహార్ధంతో తో సౌభ్రాత్రాన్నీ కాంక్షిస్తుంది. అటువంటి వ్యవస్థకోసం ఆవేదన స్పష్టం. మహా ప్రస్థానం రచన మొదలుకొని చివరి విప్లవ రచనల దాకా ఈ విషయంలో ఏక సూత్రత ఉంది. ఎక్కడా దీని నుండి తప్పడమూ తొలగడమూ జరగలేదు. ఆగిపోవడం లేదు. లక్ష్యం చెదరలేదు. స్థిరంగా ఉంది. లక్ష్యం నుండి దార్శనికానికి దారితీసే ఆలోచనలో పీడితుల పట్ల సానుభూతి,దీనులకు ఆశ్వాసమూ భవిష్యత్తుపై ఆశారూపం సామ్యవాద సిద్ధాంతం వైపు మరలించే విధం ఈ కవి ప్రత్యేకత.

(4) మార్క్సీయ దార్శనికత – ఇది లక్ష్యం యొక్క సైద్ధాంతిక పరిణామ రూపం. సామాజిక స్పందనలో భావైక్యంతో మొదలయింది. పోను పోను, సామ్యవాద సంఘాలతో సంబంధాలు బలపడి 'అభ్యుదయ' మార్గంగా స్థిరపడింది. సామ్యవాద సిద్ధాంత పరిజ్ఞానంతో తీవ్రవాద క్రియాచరణ పాత్రకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ స్థితి కవీ – వ్యక్తిత్వాన్నీ, సమాజ చింతన – ఆదర్శాన్నీ ఒకటి చేసింది. అందువల్ల ఈ కవిలో సంశ్లిష్ట వ్యక్తిత్వం (complex personality) విశాల మయిన భూమికలో మాత్రమే సమాలోచనార్హ మవుతూంది. ఈ అంశంలో 'అభ్యుదయ కవిత్వం' దశనుండి 'విప్లవ కవిత్వం' దశ, తాన విశ్వసించిన మౌలికమయిన భావజాలానికి తీవ్రతనూ గాఢత్వాన్నీ ఉగ్రవాద ప్రేరణనూ కలిగించింది. ఇది మొదటి దశ పెంపుగానే భావించవచ్చు. ఎటువంటి కష్టాల్లోనూ నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీ పడని మనో రూపం ప్రగతి ప్రస్థానానికి బలాన్ని చేకూర్చింది. చారిత్రకంగా సరిగ్గా అవసరమయిన సమయంలో ఉపయోగ కరంగా పరిణమించింది. విప్లవ శక్తులకు సారధ్యం వహించడం జరిగింది. కవిత్వంలో విప్లవ వాదానికి తన వంతు ప్రశస్తిని చేకూర్చడమూ జరిగింది.

(5) రూపమూ – అభివ్యక్తి కళ – ఈ అంశం కవిత్వానికి ప్రధానమయిన ఆకర్షణ అనవచ్చు. ఈ అంశంలో కొత్తను అన్వేషించే మనో రూపం (innovative mind) స్పష్టంగా దృష్టికి వస్తుంది. ఇదొక విధంగా కవి మాటల్లో అనితర సాధ్యమైంది.

మాత్రా ఛందో మార్గంలో గురజాడ తన ఉపజ్ఞ చేత కనుగొన్న (invention) "ముత్యాల సరాలు" ప్రయోగ విజయంతో కొత్తదనం ప్రవేశించింది. వస్తువు – విషయమూ మారాయి. హేతు దృష్టి – సంస్కరణ దృష్టి – పరివర్తన దృష్టితో గమ్యం మారింది. శ్రీశ్రీ

మాటల్లో తాను గురజాడ ఆధునిక మార్గాన్ని 'వెడల్పు' చేసి తనదయిన ప్రభావ రూపంతో మహా ప్రస్థానం అవతరించింది. ఇందులో మాత్రా ఛందస్సులో సాధారణంగా అందరూ అవలంబించే త్రిస్ర చతురస్ర మిశ్రగతుల్ని అధిగమించి కొత్త ప్రయోగాలు కన్పిస్తాయి. వీటిలో బహు విధాలయిన గతులతో కలిసిన (mix) కళాత్మకత గోచరిస్తుంది. ఒకటీ లేదా రెండు పాదాల్లో మాత్రల్ని తగ్గించో, పొడిగించో భావాన్ని బట్టి ఆవేశ స్థాయిని నిలుపుతూ పదాల కలయికలో విరామాలతో నడకలతో కొత్త దనాన్ని స్థాపించడం జరిగింది. అర్థ స్ఫూర్తి కనుగుణమయిన వేగమూ రచనకు పైకి చదివింప జేసే గుణాన్ని సంతరింపజేసింది. ఈ శిల్పం కవి స్వతంత్ర మయిన ఛందో హృదయాన్ని తెలిసిన నిర్వహణ నైపుణ్యాన్ని తలపిస్తుంది. మరో విశేష మేమంటే చాలావరకు కవితలు గీతాల్లా పాడే గుణం (musical element) కలిగినవీ; మళ్ళీ మళ్ళీ చదివింప జేస్తాయి, వినాలనిపిస్తాయి.

"కవితా! ఓ కవితా!" లో ఛందస్సుల "సర్ప పరిష్వంగం వదలి" అన్నమాట ఈ సందర్భంలో గుర్తుకు వస్తుంది. ఛందస్సు అంటే సృజన స్థితిలో బయటికి వచ్చే భావాల్ని అందంగా కప్పే సమావృత రూపం. ఛందస్సు అనేది కవిత్వంలో భావానికి సర్ప బంధనంలా చుట్టుకొని బిగిసేది కాకూడదు. భయం కలిగించేదీ ప్రాణం తీసేదీ అంటే బాధ పెట్టేదీ కష్టం కలిగించేదీ కాకూడదనే కవి అభిప్రాయం. ఇది చలనానికి ఆటంకం కాకూడదు. శోభాకరంగా ఉండాలి. స్వేచ్ఛకు భంగం కలగకూడదు. కదలికలో అందాన్ని ఇనుమడింప జేయాలే తప్ప, స్తంభింప జేయకూడదనే కవి హృదయం. అసలు "కవితా! ఓ కవితా" గీతమే నిర్దిష్టమయిన ఛందో పద్ధతిలో కాకుండా వివిధ వేగ గతులలో, పదాల పద సమూహాల విన్యాసాలతో నిబద్ధమయింది. "నా జాతి జనులు పాడుకునే మంత్రంలా మ్రోగించే" అభిప్రాయంలో ఛందస్సు యొక్క హృదయ స్పందనాన్ని అనుమతించే లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది.

(6) మానవీయ ప్రతిపాదనం – అనేది మహా ప్రస్థానానికి పునాది వంటిది. పూర్వ రచనల్లో ఈ అంశం అక్కడక్కడా లేదా కొంత ప్రాధాన్యంతో ఉండవచ్చు కాని ఇందులో సంపూర్ణమైన విశాల దృష్టితో గోచరిస్తుంది మనిషి చరిత్ర – జీవితం; సమస్యలు

– పరిష్కారాలు; సమాజం – వ్యవస్థా రూపం; యథాస్థితి – మార్పు; అన్వేషణ – పురోగమనం; విశాలమయిన వేదికపై చింతనం కనిపిస్తుంది. మనిషి – సమాజం; వ్యక్తి – జీవితం; యధార్థ దృశ్యం – మార్పు కోరే దార్శనికం తప్ప మరొకటి లేదు. ఇది చారిత్రక సామాజిక రాజకీయ సాంస్కృతిక కోణాల్లో అధ్యయనం చేయదగిన సమాలోచనంలో విలువయిన అంశం.

ఈ ఆరు అంశాలతో సమీకృతమయిన కవితా రూపం "మహాప్రస్థానం", కొత్త యుగాన్ని ఆవిర్భవింప జేసింది. సాహిత్య జగత్తు పయి అమేయమయిన ప్రభావాన్ని నెరపింది. బహువిధాలయిన ఈ ప్రభావ రూపమే యుగ కర్తృత్వాన్ని సిద్ధింప జేసింది. కొత్త మార్గానికి కారణమయింది.

శ్రీశ్రీకి ముందు కొందరి కవిత్వంలో ఈ అంశాల్లో కొన్నిటిని మాత్రమే స్థూలంగా స్పృశించిన మాట వాస్తవం. అయితే శ్రీశ్రీ లోని స్పష్టత నిబద్ధత ఉదాత్తత తో కూడిన దార్శనికత వారిలో లేదు. భాషా విషయకంగా సంపూర్ణంగా వ్యావహారిక శైలితో పాటు కళాత్మకంగానూ perfection ను సాధించడం పేర్కోదగిన లక్షణం. ఇంకా అదనంగా మానవీయ భావనపైనే దృష్టి కేంద్రీకృతమవడమూ, సామాజిక చింతనపైనే మనస్సు నిలపడమూ చెదరని సామ్యవాద లక్ష్యంపై అభిలాష వివేచన కందుతాయి.

సాహిత్యంలో పూర్వం లేని మార్క్సీయ దార్శనిక భావ ప్రపంచం కొత్తగా అనుభవానికి వస్తుంది. దీని ప్రభావమూ బహు విస్తారమయింది. ప్రేరణ శక్తిగానూ నిలిచింది. ఈ కారణాల వల్ల మహా ప్రస్థానాన్ని ఆవిష్కరించిన సాహిత్య తేజోరూపం శ్రీశ్రీ, తెలుగులో ఆధునిక కవిత్వానికి యుగకర్త కావడం చారిత్రక వాస్తవం.

# 17. మరో ప్రపంచం - మహా ప్రస్థానం అభ్యుదయ పథం

(1)

తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక యుగంలో అవతరించిన మరోప్రపంచం, శ్రీశ్రీ మహా ప్రస్థానం, మార్క్సు సామ్యవాద దార్శనికానికి చేరువయిన లక్ష్యంతో మార్గదర్శకంగా నిలిచింది. సామాజిక వాస్తవికతతో యథార్థ జీవిత దృశ్యాలతో మానవతా ప్రకాశాన్ని కలిగిందీ. మానవీయ తలంపై దృఢంగా నిలిచిందీ, లేని వారిని గురించి ఆలోచన కలిగిందీ. వారి వ్యథలనూ బాధలనూ సంవేదనతో శబ్దించింది. కొత్త వ్యవస్థకు నేతృత్వాన్ని వహించిందీ. పాత వ్యవస్థ నిర్మూలనకూ ప్రేరేపించింది.

ప్రక్రియా పరంగా గురజాడ మార్గంలో మాత్రా ఛందస్సునూ, తనదయిన పద్ధతిలో స్వేచ్ఛా రచనా విధానాన్నీ అవలంబించింది. కవి విశ్వసించే సామ్యవాద భావనకూ కవిత్వ కళకూ సమానమయిన ప్రాధాన్యంతో రచన సృజన ప్రతిభ చేత అనితరమయిన అభివ్యక్తి శిల్పాన్ని పొందింది. వాదాలకతీతంగా సహృదయుల మెప్పునూ పొందింది. కొత్తదనంతో సజీవమయిన చిర యశోరూపాన్ని సంతరించుకుంది. రాజకీయ ఆర్థిక సామాజిక దర్శనం సామ్యవాదం. దేశంలో ఉన్న భూమి ప్రకృతి సంపద మానవ వనరులు పరిశ్రమలు ఇంకా అత్యవసరమయిన ప్రజాసేవ విభాగాలు మొదలయిన ప్రజాహితరూపాలు సమాజం/ ప్రభుత్వం ఆధీనంలో ఉండడాన్ని ప్రతిపాదిస్తూంది, సమర్థిస్తుంది, ఈ వ్యవస్థకై కార్యాచరణ నిర్దేశమూ దీని ప్రత్యేకత. పాత వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ వచ్చేందుకు చర్యల్లో నిరసన ప్రతిఘటన పోరాటాల్ని ప్రోత్సహిస్తుంది. ఈ మరో ప్రపంచ భావన ఈ కవితా సంపుటిలో మానవీయ స్పందనల్ని ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయంగా శ్రామిక శ్రేయస్సుకై, సామాన్యుల భాగ్యంకై కవిలో ఆలోచన చెదరని లక్ష్యంతో సాగింది.

ఈ కవి మాటల్లో ఇరవయ్యో శతాబ్దిలో నెలకొన్న ఆకలి / సంక్షుబ్ధ దశలో అప్పటి దుస్థితులకు తీవ్రంగా కలత చెందిన కవి హృదయం, వేదనతో చింతనతో

మార్పు కోరే దిశగా స్పందించింది. దిశా నిర్దేశంతో ఉత్సాహ శక్తిని ప్రసరించింది. ఈ విశిష్టమైన వ్యక్తిత్వం మరో ప్రపంచానికి అవసరమయిన 1. సామాజిక వాస్తవికత 2. సామ్యవాద దార్శనికత 3. పరంపరగా వస్తున్న రూపానికి భిన్నమయిన అభివ్యక్తి నవ్యత. 4 మానవీయ భావనతో సృజనోన్మేషాన్ని పొందింది. సాహిత్యంలో సామాజిక లక్ష్యంతో ప్రగతి శక్తులకు కేంద్రంగా స్థిరపడింది. కాలం గడచే కొద్దీ ఈ చేతనా రూపానికి సామ్యవాద/ వామపక్షాల సహకారమూ లభించింది. మార్పును కోరే వారినందరినీ ఒకచోట చేర్చే ఆకర్షణ రూపాన్ని పొందింది. ఒక వేదికకూ బాగా ఉపకరించింది. ఈ కారణాల్ని బట్టి "మహా ప్రస్థానం" కవితా సంపుటి, అభ్యుదయ భావజాలానికి ప్రాతినిధ్యం వహించింది. ఇది ఈ కవి కవితా ప్రస్థానంలో మొదటి భాగం, ఇదొక పార్శ్వం. ఆ తరువాత కొంత కాలానికి క్రమంగా బలపడుతూన్న తీవ్రవాద ఛాయలతో విప్లవ భావజాలానికి ప్రాతినిధ్యం వహించింది. ఇది ఈ కవి కవితా ప్రస్థానంలో రెండో భాగం, అయితే ఈ మహాప్రస్థానంలో మరో పార్శ్వమూ స్ఫూర్తికి వస్తుంది. ఈ రెండు దశల్ని చారిత్రక పరిణామ దృష్టితో కలిపి చూడడంలోనే కవి కవిత్వ వ్యక్తిత్వానికి సంపూర్ణత చేకూరుతుంది.

(2)

'జయభేరి' (2-6-1933) కవిత, పాత వ్యవస్థకూ పనికిరాని కాలం చెల్లిన విలువలకూ 'గుడ్‌బై' చెప్పింది. కొత్త వ్యవస్థకూ పనికి వచ్చే ఈ కాలానికి సరిపడిన విలువలకూ 'వెల్‌కమ్' పలికింది. ఈ రచన ఎనభై ఏండ్లు గడచినా ఇప్పటికీ కొత్తదనాన్ని మెరపిస్తూనే ఉంది. ఈ గీతం మార్పు కోసం త్యాగాన్నీ అంకిత భావాన్నీ లక్ష్య శుద్ధినీ ప్రేరేపించే భావ స్ఫూర్తితో నడచింది. సమాజంలో మంచి వ్యవస్థ కయి ఆలోచనకు పురికొల్పింది. నిరసన గళాన్ని విప్పారజేసింది. పోరాటానికి ప్రోత్సాహాన్ని కలిగించింది. విజయానికి సూచనగానూ చివరలో పరిణమించింది.

పెట్టుబడిదారి వ్యవస్థను నిర్మూలనం చేసి, ప్రజా శ్రామిక రాజ్య వ్యవస్థకు దారి తీసే కవి స్వప్నం నిజమయ్యే, భవిష్యత్తులో ఆశా రూపమూ స్పష్టం చేయబడింది. ఇది 'జగన్నాథుని రథ చక్రాలు'లో బాగా ఆవిష్కృతమయింది. దీనికి నేపథ్యం అంతర్జాతీయంగా

పరిణామాల ప్రభావమూ ప్రగతి మార్గంలో నడచేందుకు బాగా ఉపకరించింది. ఈ మార్గానికి సాహిత్యపరంగా ఆడన్, స్పెండర్, జార్జ్ బార్కర్, సి-లూయిస్ మొదలయిన అభ్యుదయ రచయితల రచనలూ ఈ దృష్టి కోణానికి తోడ్పడినాయి. ఈ భావ జాలంతో రూపొందిన కవి సాహిత్య వ్యక్తిత్వానికి, మార్క్సు గతి తార్కిక భౌతిక వాదం వెన్నెముకలా పని చేసింది. ఈ సందర్భంలో "జయభేరి"తో పాటు మహా ప్రస్థానం (12-4-34) అభ్యుదయం (2-4-37) గీతాలు బలాన్ని చేకూర్చేవిగా దృష్టికి వస్తాయి.

"జయభేరి" ప్రస్తుత విషయంలో 'యుద్ధానికి' సన్నద్ధమయ్యే ముందు మ్రోగే వాద్య విశేషం. ఆరంభంలో ఉత్సాహాన్ని కలిగించే శబ్ద విన్యాసంతో కూడింది. కొత్త వ్యవస్థ నిర్మాణం కయి పాత వ్యవస్థ పయి పోరాట సూచననూ గుర్తించవచ్చు. ఈ కవిత ఆరంభంలో మూడు విభాగాల (యూనిట్స్)తో వేరు వేరు భావ రూపాన్ని (ఇమేజస్) కలిగింది. ముగింపులోనూ ఈ సంవిధానమే అవలంబింపబడింది. కవిలో ఆలోచన సమాజంలో వ్యక్తి పాత్ర నిర్మాణంలో సామ్యవాద స్పందనల్ని మీటుతూంది.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను"

ఈ విభాగాల్లో సమాజంలో వ్యక్తి బాధ్యతను గుర్తు చేస్తూ భావ రూపాలు సమాజానికీ వ్యక్తికీ మధ్య ఉన్న అనివార్యమయిన సంబంధాన్ని స్థాపిస్తున్నాయి. ఇది ప్రగతి భావనతో తీర్చబడింది 'అగ్ని' క్రియాశీలమయిన ఉత్తేజంతో కూడిన ఉత్సాహ శక్తికి ప్రతీకగా ఉంది. సమిధ వ్యక్తిలో శక్తి ప్రకాశానికి పనికి వచ్చే ఉపకరణంగా ఉంది. ఆహుతిలోని త్యాగంతో కూడిన నిశ్చలమయిన దీక్షా బద్ధమయిన మనోరూపాన్ని వ్యంజింపచేస్తూంది.

"నేను సైతం విశ్వవృష్టికి అశ్రు వొక్కటి ధారపోశాను"

సమాజమంతా క్షామాన్ని తలపించే దుస్థితిలో ఉన్న క్లిష్ట సమయంలో కావలసింది మహా వృష్టిలాంటి కరుణోదారమయిన మనోరూపం! జలదంలా మేలు చేస్తుంది. ఇక్కడ ఆ మనో జలదం నుండి జారిన, ఒక్క కన్నీటి చుక్క ఎంతో విలువైంది. అశ్రువును ధారపోసే గుణం సానుభూతి విలసితమయిన ఆర్ద్ర హృదయాన్ని పట్టిస్తూంది చెడు కాలంలో ఉన్నప్పుడు మంచి కాలంకై పరితాపం సహజం. మార్పు కయి నిరీక్షణమూ తప్పదు. ఈ సందర్భంలో కవిలో మానుషీయ మయిన విశేష స్పందనంతోపాటు శాంతి కాముకతనూ సూచిస్తుంది. సానుభూతి చర్యలో విశ్వ హృదయం గోచరిస్తుంది.

దీన్ని అనుసరించి మరో భావ రూపం సహానువర్తంగా ఉంది.

"నేను సైతం భువన ఘోషకు" వెర్రి గొంతుక విచ్చి మ్రోసాను" ఎటు చూచినా నాలుగు వైపుల పట్టరాని బాధలతో వేదనతో ఆర్త రవాలు! ఈ స్థితికి స్పందించిన కవి హృదయం ! తానూ గొంతు విప్పి స్వరం కలపడంలో సానుభూతితో క్రియాశీలతతో ఐక్య భావం గోచరిస్తుంది. ఈ విభాగాలలో కాల్పనికమైన భావ రూపాల నిర్వహణంతో జన బాధా రూపానికి ప్రతి స్పందనం స్పష్టం. కవిలో సామాజిక తత్పరతకు అద్దం పదుతూంది. ఆరంభంలో మాదిరిగానే సమాప్తిలోనూ ఈ నిర్మాణ పద్ధతి అవలంబింపబడింది.

"నేను సైతం ప్రంపంచాబ్జపు తెల్ల రేకై పల్లవిస్తాను" ప్రపంచమనే పద్మంలో తెల్లని రేకు అయి చివురించే కోరిక, ఈ మహా సమాజంలో దాని సుస్థితికి స్వచ్ఛమైన నైతికమైన వ్యక్తిత్వ వికాసం అవసరాన్ని భావింప చేస్తుంది.

"నేను సైతం విశ్వ వీణకు తంత్రి నయి మూర్ఛనలు పోతాను"

విశ్వమనే గొప్ప వీణకు తీగెలా వ్యక్తి నిర్వహించే పాత్ర ప్రజల మధ్య సుస్వరతను ప్రేరేపిస్తుంది. ఇది ఆరోహణం అవరోహణంతో కూడిన నాద సౌందర్యాన్నీ, కళాత్మకతనూ పొందింది. శ్రావ్యతతోపాటు సుందరత జీవితంలో సాంస్కృతికమైన చేతనకు దారి తీయడం – దీని ప్రత్యేకత కవి కళా హృదయాన్ని పట్టిస్తుంది.

"నేను సైతం భువన భవనపు బావుటా నయి పైకి లేస్తాను" ఇదీ గీతంలో చివరి భావ రూపం – ప్రపంచమనే మహా సౌధం పై ఎగిరే విజయ పతాక దృశ్యం. ఈ వ్యక్తిలో ఆశా రూపం సరి అయిన కార్యాచరణంతో పొందే మంచి పరిణామాన్ని సూచిస్తుంది. ఈ రెండు భాగాల్లో క్రమంగా భావ స్థానాల నుండి క్రియా రూపానికి పర్యవసించే సమాజ వ్యవస్థలో మార్పు – కవి భవిద్దర్శనాన్ని ప్రతిఫలిస్తుంది.

ఈ గీతం ప్రధానంగా సమాజంలో వ్యక్తి పాత్రనూ, సమాజంలో మార్పు కోరే కవి మనో రూపంలో జన హిత చింతనతో, సామ్యవాద దార్శనిక సూచననూ కలిగింది.

# 18. మరో ప్రపంచం - మహా ప్రస్థానం విప్లవ సంకేతం

ఏ క్షణానికి ఆ క్షణం ఏ రోజుకు ఆ రోజు ఏ ఏడాదికి ఆ ఏడాది జీవితమంతా కొత్తగా సమాజంలో అందరికీ సుఖదంగా ఉండాలనీ అనుకోవడం సహజం. ఈ భావన కవిలో సృజన భూమికను కలిగి ఉంటుంది. దార్శనికతను పొందుతుంది. క్రియాత్మకనూ చూపవచ్చు. ఇది శబ్ద మయమవుతుంది. మానవీయమై వెలుగుతుంది. అయితే మానసికంగా సెట్ అయిన విధానాన్ని బట్టి దీని ప్రత్యేకత రూపొందుతుంది.

మహా ప్రస్థానం విషయంలో కవిలో 1) సృజన చేతనతోపాటు 2) చుట్టూ ఉన్న సమాజంలో పరిస్థితుల ప్రభావం - సంస్పందనం - ఆధునికమైన చింతనతో కూడిన భావన 3) మార్పును కోరే దార్శనికత 4) మానసికంగా మానవీయం పట్ల అభిలాషతో ఆధునికమైన వ్యక్తిత్వం పని చేసింది. ఇది కొత్తదనానికి కారణమయింది. మొదటి దశలో అభ్యుదయ భావనతో, రెండో దశలో బాగా బలపడిన విప్లవ సంకేతం, మహా ప్రస్థానంలో, ముఖ్యంగా "జగన్నాథుని రథ చక్రాలు"లో స్ఫుటంగా కనిపిస్తుంది. ఇది ఆలోచన స్పందనం దృష్టికోణం ప్రయోజనం లక్ష్య సిద్ధితో ప్రవృత్తమయింది.

మహాప్రస్థానం సంపుటిలో చివరి కవిత "జగన్నాథుని రథ చక్రాలు" (1940) విప్లవానికి సంకేతంతో ఆరంభమయింది. విజయ సూచనతో ముగిసింది.

ఈ రచనలో 1) పతితులూ భ్రష్టులూ దీనులూ హీనులూ ఉన్న దుర్దశలోని పరిస్థితులూ 2) వారికి ఊరట నిచ్చే మాటలూ 3) మార్పుకు సూచనలూ 4) మార్పు వల్ల కలిగే ప్రభావం 5) ప్రయోజన స్థితి గతులూ 6) సంక్షోభం - సంఘర్షణ 7) విధ్వంసం - రణ దృశ్యం 8) శ్రామిక రాజ్యంలో సామాన్యుల సౌభాగ్యంతో ఆశా రూపం 9) విజయ సూచనతో అనేక భావ దృశ్యాలు పరంపరగా చిత్రితమయినాయి. ఇవి అవిచ్ఛిన్న గతి విశేషాలతో కవితాకృతిని పొందాయి. వేగవంతమయిన రచనా శిల్పం పాఠకుల్ని ముందుకు లాక్కొనిపోయే గుణంతో దీనికిదే సాటిగా ఉంది, విప్లవ సంకేతంగా నిలిచింది.

ఈ రథ యాత్ర పరివర్తన సూచన దిశగా సాగింది. వాస్తవ తలంపై ప్రజల స్థితి దృశ్యాల్ని చూపిస్తూంది. సంఘటిత శక్తితో ఉద్యమించే సంకల్పం - క్రియా రూపం

దృష్టికి వస్తాయి. ఇవి అభిలాష ఉత్సాహం ప్రయత్నం పురోగమనం విజయలక్ష్యంతో తీర్చబడినాయి. ఈ పరివర్తన రథం విప్లవ భావంతో రూపొందింది. దీన్ని నడిపించేది మహా జన సమష్టి రూపం, మరో ప్రపంచానికి దారి తీయడం కార్యాన్ని సాధించే సమాజ శక్తికి నిదర్శనంగా ఉంది. ఇది వివిధ దశలతో సంవిధాన రూపాన్ని పొందింది.

1) సమాజంలో "పతితులార! భ్రష్టులార! దీనులార! హీనులార!" సంబోధనతో కరుణోపేతంగా పీడితుల పట్ల బాధితుల పట్ల సానుభూతి కలిగిందీ. అట్టడుగున నున్నవారిని గురించిన దార్శనిక విషయం కవితలో ప్రధానమైన భూమికను నిర్వహించడం ఇదే మొదటిసారి. ఆధునిక కవిత్వంలో వీటిని గురించి ప్రసక్తి ఉంది, కాని దార్శనికతను పొందలేదు.

2) వీరి జీవితాల్లో ఆశను నింపే ప్రయత్నం జరిగింది. "వస్తున్నాయి! వస్తున్నాయి! జగన్నాథ రథ చక్రాల్"! "మోయిల్ దారిని బయల్ దేరిన రథ చక్రాల్ భూమార్గం పట్టిస్తాను" – శపథంలో నిశ్చయ భావం సమాజానికి మేలు చేసేదిగా ఉంది. సత్వరం కార్యాచరణకు సిద్ధమైన పరివర్తన శీలంతో మనోరూపం స్పష్టం.

3) పరివర్తన కోరే ఉద్యమ ప్రభావం, ఉగ్రతను పొందింది. "సింహాచలం కదిలింది, "హిమాలయం కరిగింది", "వింధ్యాచలం పగిలింది," "మహా నగాలెగరు" తున్నాయి. ఇందులో గడ్డకట్టిన జడ వ్యవస్థ కరగి చైతన్యాన్ని పొందడం, నిరంకుశమైన అధికార పీఠాలు కదలడం మొదలయింది. ఇది అవసరమయిన సత్వర చర్యగా భావితమయింది.

4) నీరు ఇంకిన చెరువులూ ఆ పక్కన చెట్ల నీడలు తప్ప, వేరే ఆశ్రయం లేని ఆవాసాలతో, ఎటు చూచినా గోతులు! చీకటి! ఉరి కొయ్యలు! ఆత్మహత్యలతో బాధామయమైన విషాద దృశ్యాలు! వర్తమాన స్థితిని చూపిస్తున్నాయి. ఇది భరింపరానిదిగా ఉంది.

5) ఈ దుస్థితికి వ్యతిరేకంగా పట్టరాని ఆవేశంతో ప్రజాశక్తి విజృంభణం జరిగింది. విప్లవ చర్యలతో విధ్వంసకరంగానూ పరిణమించింది.

"నట ధూర్జటి నిటాలాక్షి పగిలి రగిలి"న విధంగా అగ్నిమయమయిన స్థితి ఏర్పడింది. మార్పులో చివరి దశను పొందింది. "టార్పిడొ! అది విలయం! అది సమరం!" శత్రువు ఓడల్ని ధ్వంసం చేసే యుద్ధ నౌకలా, మహోత్పాతంలా "సంరంభం సంక్షోభం"

చెలరేగింది. 'అటో ఇటో తెగి" పోయే సున్నితమైన స్థితికి చేరుకుంది. "ఇది సవనం, ఇది సమరం"– దీక్షా బద్ధమైందీ, పరివర్తన కోరేదీ, హింసకు వెనుదీయని విలయ గతిలో విప్లవంతో కూడింది. ఇంత జరిగేదీ! "ద్రోహాలను తూల" గొట్టడానికీ "దోషాలను తుడిచి" పెట్టడానికీ – మాత్రమే. ఇది సామాజికమైన ఒక మంచి ఆశయ ప్రయోజనం.

6) దీని తరువాత దశ నిర్మాణాత్మకమైందీ. స్వాతంత్ర్యం – సమభావం–సౌహార్దంతో సమాజానికి శ్రేయాన్ని కలిగించేదీ, దర్శితమైంది. ఇది కవి స్వప్నం. సామ్యవాద లక్ష్యాన్ని కలిగింది.

"Dreams impel progress - the greatest dream is socialism. Socialism will open new vistas for the boldest of new dreams"

- Lenin

కలలు మహా కార్యాలకు దారితీస్తాయి. కొత్త ఆలోచనల్ని కలిగిస్తాయి. సాహస కార్యాలకు పురికొల్పుతాయి. కల అనేది మానసికమైన సహజ లక్షణం. ఈ కల నిజమవుతుందనే కవి విశ్వాసం. ఇదొక దార్శనిక రూపాన్ని పొందింది.

"ఈ లోకం మీరేలండి ఈ రాజ్యం మీరేలండి", ప్రజా విజయంతో సంకల్పం సాకారాన్ని పొందే ఆశా రూపంతో కవిత, మరో ప్రపంచానికి మార్గ దర్శకంగా నిలిచింది.

"కలలు ప్రగతిని ప్రేరేపిస్తాయి సామ్యవాదం గొప్ప కల" అన్న లెనిన్ మాటలు, "ఈ స్వప్నం నిజమవుతుంది. ఈ స్వర్గం రుజువవుతుంది" అన్న కవి మాటల్లో భావ ప్రకాశాన్ని పొందాయి. ఈ నేపథ్యంలో ఈ గీతం నిరాశ నుండి ఆశా రూపానికీ, కాల్పనికం నుండి వాస్తవానికీ, భావన నుండి ఆచరణకూ, కష్టాల నుండి విజయానికీ, విధ్వంసం నుండి నిర్మాణానికీ, సమస్య నుండి పరిష్కారానికీ, ఘర్షణ నుండి శాంతికీ చేరుస్తోంది.

ప్రకృత విషయంలో సమాజంలో సామ్యవాద శ్రామిక శ్రేయో రాజ్యాన్ని స్థాపించే గొప్ప ఆదర్శం కలిగిందీ, కొత్త వ్యవస్థను కోరేదీ, ఈ కవిత. ఇందులో ఒక పిలుపు ఉంది, ఆశ్వాసం ఉంది. నిశ్చయం ఉంది. నిరంతర ప్రయత్నం ఉంది. చెదరని లక్ష్యం ఉంది. కరుణతో నిండింది. ఉత్సాహంతో విజృంభించింది. లక్ష్యంతో పయనించింది. సామాజిక పరివర్తనంలో విజయానికి విప్లవ సంకేతంగా ఉంది. "జగన్నాథుని రథచక్రాలు" మహా ప్రస్థానంలో మరో ప్రపంచాన్ని దర్శింపచేస్తోంది.

# ప్రతిపాదనం

## "అనితర సాధ్యం" శ్రీశ్రీ "మార్గం"

శ్రీశ్రీ మార్గం కవి మాటల్లో "అనితర సాధ్యం" అనితరమంటే అనన్యమైందీ, సాటిలేనిదీ, ఇతరులు సాధించడానికి సులభం కానిదీ లేదా శక్యం కానిదీ. దీనికిదే సాటిగా భావించవచ్చు.

1) మహా ప్రస్థానం కవితలు వెలువడి అర్థ శతాబ్ది పైగా కాలం గడచినా ఇప్పటికీ వాటిలోని నవ్యత సామాజికత ఉపయోగిత విషయంలో ఆకర్షణ శక్తి తగ్గలేదు, పైగా ఈనాటి పరిస్థితుల్ని బట్టి ఇనుమడిస్తూంది. ఇది దీని అనితరమైన అస్తిత్వ రూపం.

2) ఈ సంపుటిలో రచనలు బహిర్గతంగా సాంద్రమైన భావోద్రేకాన్ని అనురణించే శబ్దచలనాన్నీ వేగాన్నీ,

అంతర్గంతగా తీవ్రమైన కొన్ని సంధర్భాల్లో నిశితమైన రసావేశాన్ని ప్రసరించే భావ స్ఫూర్తినీ, దీప్తినీ పొందాయి. ఇదో అనితరమైన రసభావ శిల్పం.

3) కృతుల్లో ఒక పొర (స్థాయి)లో ఉత్సాహం ఉధృతీ ఉద్వేగం ఉల్లోలమూ, ఆరాటం ఆవేశమూ, సంవేదన సంచలనమూ ఉన్న సమాహిత స్థితులు అనుభవానికి వస్తాయి.

ఇంకొక పొర (స్థాయి)లో యథార్థ జీవిత చిత్రణంతో సమాజం గురించి సామ్యవాద విప్లవ లక్ష్యమూ ఆలోచనకందుతాయి. ఈ రెండు స్థాయిలకు సంబంధించిన కళాత్మకమైన మేళనం అనితరమైంది.

4) అంతర వ్యక్తిత్వం (inner personality) , ప్రతిభ, సాహిత్య సంసర్గం చేత ప్రాప్తించిన 'పట్టు' (grip), కవి భాషాశక్తిని మాత్రమే కాకుండా ప్రయోగ నైపుణినీ కళా హృదయాన్నీ ఆవిష్కరిస్తోంది. వివిధ నిష్పత్తుల్లో కలిసిన అభివ్యక్తి అనితరమైంది.

5) అభ్యుదయ కవిత్వానికాకృతినీ దిశనూ గమన వైఖరినీ విప్లవ లక్ష్యాన్ని చూపిన మహా ప్రస్థానంలో కవితలు సహృదయుల నాల్కలపై అలవోకగా నర్తించే ప్రత్యేకత – మాత్రాచ్ఛందస్సు హృదయాన్ని ఆవిష్కరించే సంవిధానం నిస్సందేహంగా అనితరమైంది.

6) మహాప్రస్థానంలో కవిత్వం ప్రక్రియా పరంగా స్థిరమయిన అభిప్రాయమూ, లక్ష్యంలో స్ఫుటమయిన సామాజిక స్పృహ, దార్శనికంలో నిబద్ధమయిన మానవ భావనతో విశిష్టమైందీ. తెలుగు సాహిత్య చరిత్రలో పరివర్తన రూపానికి ఆదర్శంగా నిలిచిందీ. ఇంతవరకూ సాహిత్య చరిత్రలో ఉన్నదానికీ ఆలోచించిన దానికీ భిన్నమైన యుగపథాన్ని దర్శింపజేస్తుంది.

"మహా ప్రస్థానం" సంపుటిలో కవిత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోడానికీ అనుభవ విస్తృతిని పొందడానికీ ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య శాస్త్ర మర్యాదలతో పాటు కవిత్వంలో సంప్రదాయ మార్గమూ ఆధునిక సామాజిక రాజకీయ మనస్తత్వ శాస్త్ర ధోరణుల పరిచయమూ ఉంటే మంచిది.